
ஒரு ஓட்டு







CI

5 PNOA 101B 134

అదీ ఒక జూదం! అంతే!!

రచయిత్రి :

శ్రీమతి ముక్తాబాయి దీక్షిత్, M. A. B. T.

అనువాదం :

జగన్నాథ్



కాపీరైటు వున్నది

ప్రదర్శనమునకుగాని మరియే యితర వుపయోగము
నకు గాని శ్రీ జగన్నాథ్‌గారి అనుమతి పొంద
వలెను.

అడ్రసు :
శ్రీ జగన్నాథ్,
ఫిలిం డైరెక్టరు,
ట్రిప్లికేన్, మదరాసు-5

ప్రచురణ :
1964

మూల్యము :
రూ. Rs 1 0 P 0 0,

సంపాదకుడు
"ఛాయేశ్వర్"

ముద్రణ :
విక్టరీ ప్రెస్,
విజయవాడ-1.

ఒక్క విషయం

శ్రీమతి ముక్తాబాయి దీక్షిత్‌గారు 1950 సంవత్సరంలో వ్రాసిన "జాగర్" అనే నాటకానికి యిది అనువాదం.

శ్రీమతి ముక్తాబాయిగారు1950కి పూర్వమే చాలా శ్లాఘించ తగిన కథా రచయిత్రిగా పేరు తెచ్చుకున్నారు.

ఈ నాటకం యిదివరకే, హిందీ, గుజరాతీ కన్నడ భాషల్లోకి అనువదించబడింది.

ఆడపాత్రలు ఎక్కువ అవటంవల్ల - చాలాసార్లు రంగ స్థలముమీద ప్రదర్శింపబడకపోయినా, మరాఠీ, నాటక సాహిత్యంలో యిది ఒక మైలురాయిగా పరిగణించ బడుతున్నది. సుమారు లక్షప్రతులు అమ్ముడుపోయాయి.

ప్రేమనుగురించీ, పెళ్ళినిగురించీ ఈ నాటకంలోని పాత్రలు వెలిబుచ్చినన్ని అభిప్రాయాలు యింకే యితర నాటకంలోనూ నేను చూడలేదు. అంచేత తెనిగించటానికి సాహసించాను.

మొదటి అంకంలో మంగమ్మ పాడే పాటలకు మూలములోని భావము మాత్రమే యివ్వబడినది__కార ణము__నాకు పద్యాలూ, పాటలూ వ్రాయడం చేతకాదు.

జగన్నాథ్.

పాత్రలు

ఇందిరాదేవి	:	భార్గవరావుగారి రెండవభార్య
మంగి	:	పని మనిషి
బేబీ	:	ఇందిరాదేవి రెండవకూతురు
భార్గవరావు	:	పెద్దఉద్యోగి, సంపన్న కుటుంబీకుడు.
చిదానందం	:	భార్గవరావుగారి అన్నకుమారుడు
డా॥ శంకరం	:	భార్గవరావుగారి అల్లుడు
చైతన్యదేవ్	:	బర్మానుంచి ప్రయాణం చేస్తున్నప్పుడు ఉషకు తటస్థించిన వృద్ధస్నేహితుడు
ఉష	:	బర్మానుంచి వచ్చిన ఒక అవివాహిత

సమయ సూచన

ఈ కథా ఘట్టములు 1916 సంవత్సరం జూన్, జులై మాసముల మధ్య జరిగినట్లూహింపబడినవి. నాలుగు అంకములకూ మధ్యనఒక్కొక్కరోజు వ్యవధిగలదు. స్థలము పూనా,బొంబాయి వంటి పట్టణము.

మొదటి అంకము	:	భార్గవరావుగారి కచేరి సావిడి
రెండవ అంకము	:	డా॥ శంకరం యింటిలో హాలు
మూడవ అంకము నాల్గవ అంకము	}	ఉష వుంటున్న గది

అదీ ఒక జోదం! అంతే!!

మొదటి అంకము

[సమయము - సాయంకాలము]

[స్థలం : భార్గవరావుగారి కచేరి చావడి. మధ్యతరగతి సంపన్న కుటుంబం ఫాయాలో పున్నట్టు కనిపించాలి. ఎడమచేతివేపు మేడమీదికి వెళ్లే చీడీలు రెండు మూడు కనిపిస్తూవుంటాయి. తెర ఎత్తేటప్పటికి పని మనిషి మంగి ఏదో పిండివిసురుతున్నట్టు తిరగలి శబ్దం వినిపిస్తూ వుంటుంది. మెట్లమీదనుంచి ఇందిరాదేవి దిగుతూవుంటుంది. ఆమె వయస్సు సుమారు నలభై నలభై ఐదు వుండవచ్చు. తిన్నని పాపిడి. ఒదులుగా వేసుకున్న ముడి. దక్షిణాది చీర. ఇవి ముఖ్య వేషభూషలు. ఆమె ముఖం గంభీరంగావుంటుంది. కొంచం విచారంకూడా వుంది భావంలో. ఇందిరాదేవి మెట్లు పూర్తిగా దిగింతర్వాత - ఒకసారి మేడ మీదికి చూస్తుంది.]

ఇందిర : ఇప్పుడు కిందికి రావడం ఎందుకులేవే అమ్మా. కొంచంసేపు పడుకో.

[ఒకసారి హాలులోకి చూస్తుంది. ఒకపయ్స. ఒకగొడుగు తలో కుర్చీమీద పడవేసి వుండటం గమనిస్తుంది. అంచేత ఎంతో దీనంగా, దుఃఖంగా, తల అడ్డంగా వూపుతూ ఆ వస్తువులుతీసి ఒకచోట కుదురుగా పెడుతుంది. అంతట్లో ఆవిడకు మంగి పిండివిసురుతూ పాడుకుంటున్న పదం నినిపిస్తుంది.]

మంగి పాట.

నాకెందుకె వేరే సొర్గం
చక్కనిదీ నా సంసారం
ఏడు జన్మలా పుణ్యఫలం
కన్నవారు చేసినగారాబం

అన్నిటికంటే నా అదృష్టం
అయనకి నామీదెంతో యిష్టం
పైగా యింకో సంగతితెలుసూ
అత్తగారిది ఉత్త వెన్నంటిమనసు
పెదలా దీవెనలే బంతిపూలుగా
వాడనీ తోరణం మా వాకిలిదీ
సిరీసంపదా సర్వసుఖాలూ
గడపని పెట్టిన పసుపు కుంకాలూ
అమాయకంగా, అన్యోన్యంగా
కళకళలాడూ మాదాంపత్యం
ఒళ్లు రెండుగాని ప్రాణం ఒక్కటే
మనసులు రెండైనా భావం ఒక్కటే
ఒకటేమాటా ఒకటేబాణమూ
ఆయనకి నేనంటే ప్రాణమూ.

[మంగి పాడుతున్న పదంతాలూకు ఒక్కొక్క చరణానికి ఇందిరాదేవికి మనసులో కలవరం ఎక్కువవుతుంది. ఆఖరుకి అది భరించలేక] మంగా ! ఏయ్ మంగీ !

మంగి : వత్తన్నా నమ్మా ! [చేతులనీ చీరనీ అంటుకొనివున్న పిండి దులుపుకుంటూ ప్రవేశించి] ఏమండీ అమ్మగోరూ !

ఇంది : మంగీ ! ఈ పిండివిసరడం పెట్టావేమిటే యింట్లో ? ఏచీగాని ఆసురసంధ్యప్పుడు — ఏం, మరలో విసిరించుకురారాదూ ?

మంగి : పిండిగావండమ్మా నే విసిరేది; కందిపొడుంచేత్తన్నా. మొన్నోసారి అన్నారుగా మీరు — కందిపొడి వుంటే బాగుండేదనీ: అందుకనీ —

ఇంది : అంటే నిన్ను విసరమన్నానుటే ?

మంగి : మరలో పట్టిన కందిపొడి ఏం రుసిగా వుంటంలేదండీ. అందులో ఆళ్లు ఏమేమి కల్పుతున్నారో ఏంగాచారమోగాని. పైగా ఎంత మొత్తుకున్నా ఆళ్లు అలవాటే ఆళ్లదండీ. మెత్తగా కాటికల్లే వుంటుంది పిండి. రవంత మొరుంగా వుండకపోతే యింక కందిపొడి ఏంబావుంటం

దండీ : అందుకని సుబ్బరంగా యింట్లో సేసుకుంటే కమ్మగా వుంటుం దండి మరి.

ఇంది : అందుకని యిటువంటి పనులకి ఇదేనా సమయం ? పెద్దమ్మాయి యిప్పుడేవచ్చింది యింటికి. కాస్తపడుకుంటానంది. అంతట్లో నువ్వు లొద ఆరంభించావేమిటి ?

మంగి : శాకవమ్మగోరు వచ్చారా ! ఇయ్యాలే ఎట్లొచ్చారుచెప్మా ! ప్రతివారం శనోకంనాడొచ్చేవోరుగా ? యాడున్నారమ్మా !

ఇంది : మేడమీద నాగదిలో వుందిలే.

మంగి : పోయి ఓసారి సూసొత్తానండి.

ఇంది : ఎండపడి ఒచ్చిందని కాస్సేపు పడుకోమన్నానులే.

మంగి : పుట్టింటికొచ్చె ఆడుదానికి ఎండాతగలదు. వానాతగలదు లెండమ్మగోరు. మాయమ్మ ఏమంటూండేదో తెల్సాండి.

మంగి పాట.

పుట్టింటికెళ్లే ఆడదానికీ
ముళ్లు తగిలినా మల్లెపువ్వులే
ఎండా వానా ఏది ఎదురైనా
తల్లి దండ్రులా నవ్వులాటిదే.

[మంగి మేడమీదకు వెళ్తుంది. ఇందిరాదేవి కిటికీదగ్గరకెళ్ళి ఓసారి వీధిలోకిచూసి - మళ్ళీవచ్చి కుట్టు కుట్టుతూ కూచుంటుంది. ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్టువుంది. అంతట్లో మేడమెట్లుదిగి మంగి వస్తుంది.]

మంగి : మా సెద్ద సిరాకుగావుండారెందుకోగాని.

ఛణఛణమూ కోపాలే మరి
గారాబంగా పెరిగిన చిలకకీ -
చిత్తకార్తిలో చిటపటమంటూ
రాలే చినుకుల వల్లేం నష్టం !

[మంగి యింటిలోపలిభాగంలోకి వెళ్ళబోతూవుంటుంది]

ఇంది : నిద్దర పోతోందా అమ్మాయి ?

మంగి : లేదుండమ్మా ! ఊరికే పడుకోనుండారు. కళ్ళుపెట్టుకుని ఊరికే దూలాలూ వాసాలూ సూత్తున్నారు. ఏవయినా అడిగితే మాట్లాడ్డంలేదుండి. ఒకేళ డాక్టరుగారిమీదఅలిగొచ్చినోరో ఏమోమరి ! సందే వేళయినంక ఆయనొచ్చి బతిమాలుతాడుగా. అప్పుడు అన్నీ సరిపోతాయి లెండి ! ఇంక ఆపైన అమ్మాయిగోరు మనతోకూడా మాట్లాడుతారులెండి. మద్దెమద్దెఎంచక్కానవ్వుతా [మళ్లాయింట్లోకివెళ్లబోయి-తిరిగివచ్చి]అసలు ఈమద్దే కారదమ్మగోరు ఉత్తిత్తినే కోపం తెచ్చుకుంటోండారండి; ఏంటోగాని. మాట్లాడ్డమేనేదు సరీగా - సిన్నప్పుడైతేనా ? - పొద్దత మానం ఊసులు చెబుతునేవుండేవారు పిచ్చికల్లే. ఏవన్నా పనిలోవుండి పలక్కపోతే "మంగీ ! మాట్లాడవేం - మాట్లాడవే నువ్వు" అనిప్రాణం తోడేసేవారు. యింగట్టాటప్పుడు నేనేవనేదాన్నో తెల్సుంది "మీరు మాట్లాడాల్సిందంతా యిప్పుడే యిలా సిన్నప్పుడే మాట్లాడెయ్యండమ్మా- మళ్లా అత్తోరింటికెల్లాక మాట్లాడితే తప్పు. నోరిప్పితేతప్పంటారు కొంత మంది." అనేదాన్ని. మాయమ్మ నాకు సిన్నప్పుడే సెప్పేసిందసలు.

మంగి పాట.

పుట్టింటి సీదలోవున్నన్నాళ్ళూ
అమ్మాయి వస్నిని చిలకపలుకులే
అత్తవారింటి గాడ్పువేడిలో
కోకిలకూడా నోరు విప్పదూ.

అయినా కారదమ్మగోర్కి ఇయ్యస్నీ-

ఇంది : [కళ్ళవత్తుకుంటూ] ఆబ్బబ్బ ! ఎంతవాగుతావే నువ్వు. చాలు ఊరుకోయింక. బజారుకెళ్ళొద్దూ నువ్వింక - నడిఇంట్లో తిరగ లేసుకూచున్నావ్ ?

మంగి : [ఇందిరాదేవి మాటలు వినిపించీ వినిపించనట్లే] కాని అమ్మాయిగారి పెళ్లయి ఏడెనిమిదేళ్ళు అయిందా ! ఆడ మరి అత్తగారు నేదు. మామగోల్లేరు. యింకేంకట్టం ? హాయిగా ఆళ్ళిద్దరేగందా చిలకా గోరింకల్లే: రాజారాణి: అంతే ! మరి యింకా ఎందుకు మాట్లాడక పోవాలేం అమ్మగోరు ? [తను చెప్పినదేదీ ఇందిరాదేవి

వినటంలేదని [గ్రహించి] స్సరే, నేనేదో చెప్పకపోతూనేవున్నాను. మీ రినిపించుకోనేలేదుగామాల నే నెపిప్పింది. పోనిలెండి అయితే అమ్మగోరూ,

ఇంది : మంగీ, నువ్వింక బిడారుకు వెళ్ళిరా. ఇప్పుడెళ్ళితేనే కాని దీపాలుపెట్టే వేళకయినారావు కూరగాయలట్టుకొని.

మంగి : యింకా బేబీగారు రాలేదుకదంటి కాలేజీనుంచి, ఆరొచ్చి నాక అక్కా చెల్లెళ్ళకి కాఫీ అయ్యా యిచ్చి బజారుకెల్తానండి.

ఇంది : ఎందుకిప్పుడే వెళ్ళులే. బేబీ యింటికి ఆలస్యంగా వస్తుందేమోకూడాను. ఎక్కడో మీటింగుకువెళ్తానంది, [సముదాయింపుగా] మంగీ, ఏదీ బయల్దేరు మరి.

మంగి : హారిదేపుడా ! ఇయ్యాల మాట్లాడనే మాట్లాడనివ్వటం లేదమ్మగోరు నన్ను. [మంగి యింటిలోపలకు వెళ్తుంది. కొంచం సేపయాక చటుక్కున తలుపుతోసుకొని బేబీ ప్రవేశిస్తుంది. వేష భాషల్లో కాలేజీ విద్యార్థిని అని తెలుస్తుంది. వయస్సు ఇరవై ఒకటి ఇరవై రెండు. ఏదో మహాకార్యం చేసినట్లు విజయశ్రీ ఆ ముఖంమీద ద్యోతకమవుతూంటుంది.]

ఇందిర : [కుట్టుపనిచూసుకుంటూనే] మీటింగు అయిపోయిందా ?

బేబీ : ఓ ! ఏదో నలుగురయిదుగురు మాట్లాడారు అంతే, కాని అందర్లోకి బాగా నేనే మాట్లాడాను. అసలు అక్కడ ఉపన్యాసం చెబుతున్నంతసేపూ నా కళ్ళఎదుట అక్కయ్యే కనిపించింది; దీన మయిన ముఖంతో - మొగుడువదలిపెట్టాడని విచారంలో మునిగిపోయిన అక్కయ్య కనిపించింది నాకు. అసలు నా ఉపన్యాసం వినడానికే నువ్వు రావలసింది, ఏమే ఎందుకురాలేదే అమ్మా !

ఇందిర : నే నసలు ఎప్పుడెళ్లానులేవే ఈ మీటింగులకీ వాటికీని,

బేబీ : [గారాబంతో] ఇవాళ నేను మాట్లాడుతానని చెప్పాను గదటే అమ్మా ! [ఉత్సాహంగా] అమ్మా ! యివ్వాళే నేను చెప్పిన ఉపన్యాసం విన్నతర్వాత ఒకళ్లకూడా తీర్మానానికి అడ్డుచెప్పలేకపోయారే. భార్య బ్రతికివుండగా మళ్ళీ పెళ్ళిచేసుకోకూడదని శాసనం రావాలన్న తీర్మానం ఏకగ్రీవంగా పాసయిపోయింది. ఇహ యిప్పుడు తప్పకుండా

అది చట్టమయిపోతుంది. అసలు నువ్వు ఆ మీటింగుకు వచ్చివుంటే ఈ శాసనం నీ కెంత ముఖ్యమో అర్థమయేది. లేకపోతే ఏంవిటే ; ఈ మగాళ్లు. ఏమిటి మరీని. ఇష్టమొచ్చినప్పుడు మొదటిపెళ్ళాన్ని ఒదిలి వెయ్యడమూ, రెండోపెళ్ళికి తయారవడమూను ; పెళ్ళామంటే ఏమనుకుంటున్నారు ? ఆడుకునే బొమ్మటే ; మోజుతీరిపోగానే మూల పారేసి యింకో కొత్తబొమ్మతెచ్చుకొని ఆడుకోవడానికి, అసలు యిలాటి అన్యాయం తలపెట్టిన మగాళ్ళని నిలేసి అడగడానికి మనకధికారం వుండొద్దు ?

ఇంది : ఉండాలేమ్మా ; ఉండాలి. ఉండాలి. కాని నిలబెట్టి అడిగినంతమాత్రాన నువ్వు సాధించేదేమిటే ? ఎన్ని అన్యాయాలకు నిలబెట్టగలం ?

బేబీ : మిగతా అన్యాయందారివేరు. దీని దారివేరు. ఇది వాళ్లు చేసే అన్యాయాలన్నిటిలోకి అతిక్రూరమయినది, యింతకీ యిది ప్రత్యక్షంగా నీ యింట్లోకే ప్రవేశిస్తోంది. చూస్తూచూస్తూ వుండగా అక్కయ్యకాపరం కూలిపోతుంటే నీ కేమిటి యింత నిర్లక్ష్యంగా వుంది ;

ఇంది : అక్కయ్యకాపరం యిలా అవుతుంటే నేను నిర్లక్ష్యంగా వుంటానని ఎలా అనుకున్నావే అమ్మా ; అలా వుండగలనా ?

బేబీ : ఉండలేవులే ; కాని నువ్వు వూరికే మనసులో యాతన పడుతూవుంటే ఏం లాభం : ఈ ముప్పు తప్పించటం ఎలాగ ? ఇది ప్రతిఘటించడం కోసరం పదిమందినీ కూడగట్టుకోవాలి. చట్టాన్ని, శాసనాన్ని సృష్టించి ఏదయినా ఆధారం ఆసరా కల్పించుకోవాలి.

ఇంది : హూ ; చట్టాలు సృష్టించగానే మనుష్యులకు కష్టాలు పోతాయిటే - యిప్పుడు వందలకొలది చట్టాలున్నా వేలకొలది కష్టాలు వుండనే వున్నాయి.

బేబీ : నీకు యీ చట్టాలమీద శాసనాలమీదా నమ్మకంలేకపోతే, పోనీలే, నీకు ఏ మార్గంమీద నమ్మకంవుంటే ఆదోవే తొక్కు. కాని ఏదో ఒక మార్గాన్న అక్కయ్యకి ఈ అన్యాయం జరగకుండాచూడు. అంతే ; దానిబ్రతుకు ప్రాణంవుండగానే భస్మీపటలం అవుతూంటే

చూస్తూ మాత్రం ఊరుకోకు. అంతకంటే ఆ శంకరంబావ చటుక్కున చచ్చిపోయినా నయమే !

ఇంది : బేబీ !

బేబీ : చూశావా ? అశుభమైన మాటకూడా నీచెవిని పడకూడదు. కాని యిప్పుడు జరుగుతున్నదిమాత్రం అంతకంటే తక్కువటే !

ఇంది : అంతా నిజమే కాని - నువ్వు కొంచం నెమ్మదిగా మాట్లాడు. నేడమీద అక్కయ్య శుభ్రంగా మేలుకునేవుంది. యింటికప్పు కేసి చూస్తూ మేలుకునేవుంది. దానికి వినిపించేటట్టు యిప్పుడు ఈ చర్చ ఎందుకులే.

బేబీ : అయితే నోటికి తాళంవేసుకొని ఎన్నాళ్ళూరుకుంటామే ? అసలు అక్కయ్యమాత్రం యిలా నోరుమూసుక్కోచోవడం ఏమిటి ?

ఇంది : ఆమాటా నిజమే ! అసలు, యిప్పుడు దాన్ని పట్టుకున్న అవస్థ తప్పించుకోవడానికి స్వయంగా ప్రయత్నించాల్సిన సమయం వచ్చింది.

బేబీ : అయితే ఒకవేళ అక్కయ్య ఏ ప్రయత్నమూ చెయ్యకుండా కూలబడిపోతే నువ్వుకూడా అలానే కూచుంటావా ? ఇంతమందిమి వున్నప్పుడు మనం ఏమయినా కృషిచేసి దానిక్కలిగే కష్టం తప్పించాలి. దాని పెళ్ళప్పుడు నువ్వెంత గట్టిగా వూనుకున్నావో మరిచిపోయావా ?

నాన్నగారికసలు ఆ సంబంధం మొదట్నించీ యిష్టమేలేదు. కాని అక్కయ్యమాత్రం తనకి ఆ శంకరంగార్ని చేసుకోవాలనివుంద న్నితోచెప్పింది. నువ్వప్పుడు నాన్నగారికి ఎన్నివిధాల నచ్చచెప్పావు ? శంకరం బీదవాడయితేనేం ? తెలివయినవాడు - పైగా ఆమ్మాయికి అతనిమీదే మనసున్నది. అంచేత అతనికిచ్చే పెళ్ళిచెయ్యటం మనకి న్యాయం, దానికీ మంచిది; అని ఎట్లాగో వొప్పించావు నాన్నగార్ని. మరి ఆనాడు అంత చేసినదానివి యివాళ కిక్కురుమనకుండా కూచుంటావేమే ! అక్కయ్యమీద పడబోయే ఆపద తప్పించాలని లేదుటే అమ్మాసీకు ?

ఇంది : లేదని ఎవరన్నారే ? అయినా నేనూరకే కూచున్నానని మాత్రం నువ్వు ఎందుకనుకోవాలి బేబీ ? కాని మనజీవితంలో ఏర్పడే

సంఘటనలన్నీ మనప్రయత్నాలమీద ఆధారపడివుంటాయని అనుకోవడం పొరపాటు. మనంచేసేప్రయత్నాలకి దైవంకూడా దోహదంచేస్తేనేకాని.

బేబీ : ఇప్పుడు జరుగుతున్నదాంట్లో దైవంసంగతి ఎందుకే - అవతల మనిషి ప్రత్యక్షంగా అన్యాయం తలపెడుతుంటేను ?

ఇంది : నీకు నిండినవి ఇరవై ఏళ్ళేలే. ఇంకో ఇరవైఏళ్ళు వెళ్ళితేనేగాని నీకన్నివిషయాలు తెలియవు.

బేబీ : ఇదే నన్నమాట నువ్వు నాకిచ్చే ఆశీర్వాదం ? అయితే అయిందిలే. నేనుమాత్రం దైవంమీద భారంవేసి ఊరుకోలేను. ఏదైనా ఓగట్టి ప్రయత్నంచేసి చూడాలనేవుంది సుమా !

ఇంది : నాచేతనయిన ప్రయత్నాలు నే చేస్తూనే వున్నానమ్మా ! లేకపోతే చిదానందాన్ని తక్షణం ఓసారి రమ్మనమని ఉత్తరం ఎందుకు రాస్తాను చెప్పు.

బేబీ : నువ్వసలు వాళ్ళమీదా వీళ్ళమీదా ఆధారపడటం ఎందుకే ? ఆయన వస్తాడు వస్తాడు అని ఎదురుచూస్తూ కూచున్నావుగాని అతనింత వరకూ రానేలేదాయె. నువ్వతనిమీదే నమ్మకంపెట్టుకూర్చోవటం ఎందుకో నాకర్థం కాపటంలేదు.

ఇంది : ఇలాటి పనులకు అతనే సమర్థుడులే.

బేబీ : ఏవిటా సామర్థ్యం ? వచ్చి ఏంచేస్తాడేమిటి ? ఆయన మాత్రం ఏవయినా నరసింహావతారం ఎత్తుతాడా నాన్నగారు ప్రతిరోజూ చేస్తున్నట్టు ? ఇంతకీ ఆయనగారు శంకరంబావగారికి ఆప్తమిత్రుడు కూడాను.

ఇంది : అయితే నువ్వా చిదానందం అన్నయ్యని యింతే నన్న మాట అర్థంచేసుకుంట ? అతను ఎవ్వరికీ మిత్రుడూకాదు శత్రువూకాదు. న్యాయం ఎటుంటే అటు మాట్లాడ్డానికి భగవంతుడువచ్చినా జంకడు.

బేబీ : అయివుండవచ్చు. కాని వచ్చి ఏంచేస్తాడో చెప్పనా ? ఏమో మరి ఏంచేస్తాడో ? అసలు ఆయనగారి పద్ధతులూ, జీవితమూ నాకేమీ అర్థంకావటంలేదు. ఒక్కపనిమట్టుకు చేస్తాడు. తిన్నగా బావగారిదగ్గరకు వెళ్ళి "నువ్వన్యాయంచేస్తున్నావు" అని బావగారికి నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తాడు. కాని యిప్పుడు బావగార్కి నచ్చచెప్పటంవల్ల ఏం

వుపయోగంవుంది ; ఆయనగారితో యింక కబుర్లుచెప్పటంకంటె కొరడాతీసుకునే వ్యవహరించాలని నా నమ్మకం ;

ఇంది : ఎవరినమ్మకం వాళ్ళది. ఎవరి ఉపాయం వాళ్ళదీని. ఇంతకీ కొరడాలుచూపించీ, చట్టాలుఏర్పరచీ మనుష్యుల్లో పరివర్తనతీసుకురాగలమే అమ్మా ; మనుష్యుల్లో వున్న పరమేశ్వరుణ్ణి మేలుకొలపాలి. మనస్సాక్షికి కళ్ళుతెరవాలి.

బేబీ : అహాహా ; నీ పరమేశ్వరుడు ఈ జగత్తంతా సృష్టించి శ్రమపడి అలిసిపోయాడులే. ఇందులో జరిగే అన్యాయాలు చూడలేక కళ్ళుమూసుకొని నిద్రపోయాడు.

ఇంది : పోసీలే ; [తగ్గుస్వరంతో] బేబీ ; నువ్వోసారి మేడ మీదకువెళ్ళి అక్కయ్య ఏంచేస్తున్నదో చూసిరా ; చూసి వచ్చేసెయ్యి. ఏం ;

[బేబీ వెళ్ళుతుంది. ఇంతలో పీదిగుమ్మంలోంచి చిదానందం వస్తాడు. సుమారు ముప్పైఅయిదేళ్ళుంటాయి. అతనిలో కావలసినంత గంభీరత, కాస్తంత హాస్యధోరణీ పాళంగా కలిసి వుంటాయి.]

చిదా : పిన్నీ ;

[ముందుకువచ్చి దణ్ణంపెడతాడు]

ఇంది : నువ్వా చిదానందం ; ఉత్తరం అందిందా ; ఎప్పుడొస్తావో అని చూస్తూ కూచున్నాను నాయనా ;

చిదా : ఎట్లాగయినా నేనూ యిక్కడికి రావాలనే అనుకుంటున్నాను.

ఇంది : ఎందుకు ; కూచో ;

చిదా : ఎందుకా ; పత్రికల్లో అన్నింటిలోనూ మీ బేబీ పెద్ద పెద్ద ఉపన్యాసాలిస్తోందని చదివాను. పెద్ద సంస్కర్త అయిపోతోందిటి కదూ ;

ఇంది : మరే నాయనా ! ఇటుచూస్తే యీ అల్లుడుగారి ప్రవర్తన యిలావుంది. అటుచూస్తే ఆ బేబీ పదిమందిలోనూ ఉపన్యాసాలిస్తోంది.

చిదా : అయితే నువ్వింకా నీపిల్లలకి నీ పెళ్ళివృత్తాంతం చెప్పనే లేదన్నమాట ! తన తల్లికూడా పెళ్లిమీద పెళ్ళిచేసుకున్న వ్యక్తికి రెండవభార్య అన్నసంగతి బేబీకి తెలియదన్నమాట ? అందుకే రెండో పెళ్ళిట్ట, విడాకులగొడవల్లో అంతంత ఉపన్యాసాలు చెపుతోంది మరి. అవి చదివానుగనుకే వద్దామనుకున్నాను. ఇప్పుడైనా దాంతోచెప్పడం మంచిది.

[బేబీ మేడదిగుతూ వుంటుంది]

ఇంది : చిదానందం ! బేబీయే వస్తోంది మేడమీంచి.

బేబీ : ఎందుకే అనవసరంగా పంపించావు నన్ను అక్కయ్య దగ్గరికి ? ఆది అసలు మూగదానిలా అయిపోయింది. [చిదానందాన్ని చూచి] అన్నయ్యా ! ఎప్పుడొచ్చావు ? ఓ ఉత్తరం రాయకూడదూ ? స్టేషనుకివచ్చి యింటిదాకా సాయంవచ్చేదాన్నిగా ?

చిదా : నువ్వు అంతటిదానివే అని నాకు తెలుసులే ! సాయం లేకపోయినా మీయింటికి రాలేకపోతానా అని బయల్దేరివచ్చాను. అవునూ! [గడియారంకేసి చూచి] ఈ పాటప్పుడు నువ్వింట్లో వుండడం ఎలా సంభవించిం దసలు ?

బేబీ : ఏమిటన్నయ్యా నువ్వనేది ? ఈపాటప్పుడంటే?

చిదా : అంటే యింకా చీకటి పడలేదుగదా. అప్పుడే యింటికి రావలసిన అవసరం ఏం వచ్చిందని ? ఏ మీటింగులో, ఆటలో - ఏవీ లేవుమరి. పాతకాలంలో అయితే - అంటే మాపిన్ని చిన్నతనంలో అయితే చీకటిపడ్డాక ఆడవి యింటికివస్తే తప్పుగావుండేది. ఆడాళ్ళకీ భయంగావుండేది.

బేబీ : అయ్యో పాపం ! నాకేం భయంలేదు. ఇకముందు చీకటి పడితేనేగాని యింటికి రానేరాను చూసుకో. ఏవిటమ్మా నీ ఖాయిదా ? పెద్ద ఏవో పుస్తకాల్ని నీవుస్వతంత్రంగా ఒదిలేసినట్లు, మేం యిష్టంవచ్చినట్లు

తిరుగుతున్నట్లు మాట్లాడుతున్నాడు మహా ! క్షణం ఆలస్యమైతే లక్ష ప్రశ్నలు వేస్తారు. ఎక్కడికైనా వెళ్ళితే మీ కాపురదల తప్పదు. అసలు మగవాళ్ళంతా యింతే.

చిదా : [బేబీకేసి నిగాగాచూస్తూ - ఏడిపించడానికి అన్నట్లు] పిన్ని ! ఈవిడ ఏమయినా మీటింగుల్లోనో అక్కడా ఉపన్యాసాలు చెప్పి వచ్చిందా ఏమిటి ? అసలు ఆ వేషం అలాగేవుంది. ధోరణీ అలాగే వుంది. నువ్వుకూడా వెళ్ళావా మీటింగుకి? అమ్మాయి ప్రతిభ చూట్టానికి !

బేబీ : ఆఁ! మీ పిన్ని మీటింగులకి రాకేం ? ఇంటిదగ్గర నాకో కొత్తస్వెట్టరు అల్లుతూ కూచుంది. శీతాకాలంలో నాకు రక్షణవుండాలని అమ్మకెంత ముందుచూపు అనుకున్నావు - ఓ ప్రక్కనుంచి అక్కయ్యకి జీవితమంతా వడగాడ్పు అయ్యేపరిస్థితులు ఏర్పడుతున్నాయి. అన్నయ్యా! నువ్వు విన్నావా ? విడ్డూరాలన్నీ -

చిదా : ఆఁ! అన్నీ విన్నాను. పెళ్ళి అనేది సంఘంలో ఏర్పడ్డ నియమం. అదికాస్త అయింతరువాత ప్రేమలో పడడం అంటావా అదీ ప్రకృతివల్ల ఏర్పడినది - వసంతఋతువు తర్వాత గ్రీష్మంవచ్చినట్లు.

బేబీ : [అతని వుచ్చారణాన్ని వెక్కిరిస్తూ] సృష్టిలో ఏర్పడ్డ ఋతువులు మూడేనెల లుంటాయి. ప్రేమలోపడ్డాం అని చెబుతూ మొదటిపెళ్ళాం నెత్తిమీద ఒక సవతిని ఎక్కించటం ప్రకృతినియమం ఏమీకాదు.

ఇంది : (ఎంతో విసుగుగా - అసలు ఈ సంభాషణ ధోరణి మార్చే వుద్దేశంతో) బేబీ! అన్నయ్యకు కాసటీ పెట్టించే ఏర్పాటు చెయ్యి. రాబ్బాయి, లోపలికి పోదాం.

[బయలుదేరుతుంది]

చిదా : పద పిన్ని ! ఇప్పుడే వస్తా.

ఇంది : (వెడుతూ వెడుతూ వెనక్కి తిరిగి చిదానందం, బేబీల వైపుచూచి) తొందరగా వస్తావుగా!లేకపోతే బేబీతో మళ్ళీఏదైనా వాదన పెట్టుకుంటావా ? (వెళ్తుంది.)

బేబీ : అవునూ! అమ్మ రాసిన వుత్తరం ఎప్పుడందింది నీకు ? ఎప్పుడొస్తావా అని చూస్తూ కూచున్నాం.

చిదా : కూచున్నాం? ఆఁ! ఏం నీకు పేకాటకు చెయ్యి తక్కువయిందా ఏమిటి? బేబీ! నువ్విప్పుడు పెద్దదానివయ్యావు. ప్రతిదానికీ యితరులమీద ఆధారపడ్డం ఏం బాగులేదు. అంచేత అవసరాలన్నీ తీర్చే భర్తని ఒకణ్ణి చూసేసుకుంటే మంచిది.

బేబీ : నిజమే అనుకో; కానీ, అన్నయ్యా! ఆ భర్త నన్నెల్లకాలము భరిస్తాడని నమ్మకం ఏమిటి? అతన్ని అలా వుంచటానికి అసలు ఏమీ చట్టం లేదుగా? అసలు తెలివయిన ఆడదైతే మీ మగజాతిని ఒక్క నిముషంకూడా నమ్మదు.

చిదా : ఏఁవిటమ్మోయి. ఏవేఁవిటో చాలా నేర్చుకున్నట్లున్నావు! అవునులే బేబీ! అసలు మగవాడంటే ఏమిటో పూర్తిగా పరిచయంలేక ముందే మగజాతినే నమ్మకూడదనే సిద్ధాంతానికి వచ్చేశావేఁమిటి నువ్వూ? లేకపోతే మాకెవరికీ తెలియకుండా గుప్‌చుప్‌గా ఓ పెళ్ళి చేసుకుని తెలుసుకొని ఆ తర్వాత యీ నిర్ణయానికి వచ్చావా ?

బేబీ : ఏమిటదీ? గుప్‌చుప్‌గా పెళ్ళి చేసుకోవాల్సిన ఖర్మం నాకేం పట్టిందీ? నేను శుభంగా బాండు భజంత్రీలు పెట్టి పెళ్ళి చేసుకుంటాను. రహస్యంగా, చాటుమాటుగా పెళ్ళి చేసుకోవటం కొంతమందికే అవసరం. మానుషత్వాన్ని చంపుకొని, మొదటిపెళ్ళాన్ని మూలపారేసి రెండోపెళ్ళికి తయారవుతారే—వాళ్ళకి చెల్లుతుంది—ఈ దొంగతనం పెళ్ళి.

చిదా : అట్లాగుటే! మొత్తానికి ఈ రెండోపెళ్ళి వ్యవహారం చాలా చిక్కు-అయినదే అన్నమాట! ఆఁ! కష్టమే నేర్చుకోవటంకూడా!

బేబీ : నీకంతగా నేర్చుకోవాలనుంటే నన్నడుగు చెబుతాను. ఒక పెళ్ళాంతో కాపురంచేస్తూకూడా యింకో అమ్మాయిని ప్రేమించటం ఎలాగో — అసలు ఆ సంగతి నెలలతరబడి పెళ్ళానికి తెలియకుండా రహస్యంగా వుంచడం ఎలాగో. యిహ ఆఖరుకి పెళ్ళాన్ని వదిలేసి రెండోపెళ్ళికి సన్నద్ధం చేయటం ఎలాగో —

చిదా : ఓహోహో! నిజంగా నువ్వు అదృష్టవంతురాలివే సుమా బేబీ! అసలు యిలాంటి విషయాలు ప్రతిమనిషీ స్వానుభవంమీద చాలా చిరాకులు పడి నేర్చుకోవాలసినవి. నువ్వు సునాయాసంగా బి. ఏ. క్లాసులో పాఠాలు వింటూనే ఈ తతంగం అంతా గ్రహించేశావు.

బేబీ : ఇవన్నీ కాలేజీలో గ్రహించలేదు. ఇంట్లోనే నేర్చుకున్నాను. మీ గారాబు బావగారు మా కందరికీ ఈ విషయాలు ఆచరణలో పెట్టి నేర్పించారు.

చిదా : ఓహో! అదా! అవును అన్నట్టు శంకరం యింకో పెళ్ళి చేసుకుంటాట్టకదూ? అదేనా నీ అభిప్రాయం? ఇంతకీ పాపం యిందులో నిజమెంతో అబద్ధమెంతో! అసలు శంకరానికీ ఆ యింకో అమ్మాయికీ ఉత్తస్నేహమే అయివుండవచ్చు. సానుభూతి అయి వుండవచ్చు. కళాత్మకమైన రసికత్వం కావచ్చు. కానీ — మీ ఆడవాళ్ళకి అవన్నీ అవసరంలేదు. ఇంకో ఆడదీ అనగానే తక్షణం రెండో పెళ్ళిట. అనేయడమే.

బేబీ : ఇదిగో అన్నయ్యా! ఆయనది స్నేహమూ, సానుభూతీ చట్టుబిండలూ ఏమీకాదు. ఆయన రసికత్వం ఏమీ కళాత్మకం కాదు. అది నూటికి నూరుపాళ్ళు ప్రణయాత్మకం. తెలిసిందా? పైగా యిదంతా మేం ఆచారంలేకుండా అనుకోవడమూ, అనుమానం పడడమూ కాదు. పది పదిహేనురోజుల్లోగా పెళ్ళికి ఏర్పాట్లు చేసుకుంటున్నాడని అచ్చితంగా తెలిసిన కబురు. రెండోపెళ్ళి చేసుకోడానికి శాసనం రాక ముందే ఈ శుభకార్యం ముగించుకోవాలని ఆయనగారు అన్ని ప్రయత్నాలు చేసుకున్నారని సిసలైనవార్తలు వచ్చాయి మాకు. పైగా ఈ విషయం వూరంతా చర్చించుకుంటున్నారు.

చిదా : నిజం! మొత్తంమీద శంకరం అదృష్టవంతుడే అనాలి. ఎంతోపేరు ప్రఖ్యాతీ సంపాదించుకోకపోతే, అతని పెళ్ళినిగురించి ఊరంతా చర్చించుకునే భాగ్యం ఎలాపడుతుంది!

బేబీ : అతనిపేరు ప్రఖ్యాతులను గురించి నీకూ-డా అసూయగా వుందా చెప్పు! ఎదుటివ్యక్తియొక్క సుఖదుఃఖాలకి పూచికపుల్లంత

విలువగూడా కట్టకుండా - కేవలం తన సుఖమూ, తన సంతోషమూ, తన సరదా ముఖ్యమని ప్రతిపనికీ తయారయ్యే యీ పురుషుల్ని చూస్తే నాకు ఒళ్ళు మండిపోతోంది.

చిదా : (బేబీకి చేరువగా వచ్చి, అతి గంభీరంగా, అంటే వేదాంతిలా) కానీ, బేబీ, యింతకీ శంకరాన్ని పెళ్ళిచేసుకోడానికి సిద్ధపడిన వ్యక్తి ఒక స్త్రీ అనుకుంటాను.

బేబీ : (కాలు నేలకేసి కొడుతూ) అదే అన్నిటికంటే దుర దృష్టం. ఎంచక్కావుండేది అక్కయ్యకాపురం ఈ ఉష యీ ప్రాంతంలో ఉదయించకముందు. హాయిగా ఎంత ఆనందంగా వుండేవాళ్ళు వాళ్ళిద్దరూ.

చిదా : అవునుకదా ! ఇది అసలు మామూలే ! ఎక్కడయినా అపరిమితమైన సుఖం వుందంటే అక్కడ ఒక ఆడదాన్ని పడేస్తేచాలు. ఆవిడఒక్కక్షణంలో సుఖంగిహం ఎగరగొట్టేసి సాంతం ఎడారిచేస్తుంది. అందుకే యింద్రుడుకూడా ఎవడన్నా గట్టిగా తపస్సు చేస్తున్నాడని తెలిసీ తెలియగానే ఏ అప్సరసనో అక్కడ పారేసేవాడు.

బేబీ : ఆ తపస్సు చేసేవాళ్ళంతా మగవాళ్ళు గనుక ఒక అప్స ర్సని పంపించేవాడు. అదే ఆడవాళ్ళు తపస్సుజేస్తే మగవాళ్ళనే పంపించేవాడు యింద్రుడు.

చిదా : కాని ఆడవాళ్ళు తపస్సు చేస్తేగా, యింతకీ వాళ్ళపని తపస్సు పాడుచెయ్యడం వరకే —

బేబీ : మరేపాపం ! ఆడవాళ్లు తపస్సు ఎందుకు చెయ్యలేదో ? ఉష చెయ్యలా ?

చిదా : కరెక్ట్ ! కాని ఉష ఎందుకు చేసింది ? నిజమే ! ఆడ వాళ్ళు తపస్సు చేస్తారు. కానీ ఎందుకు ? మొగుడికోసం. అంతే. ఈ యింద్రపదవీ వగైరా అల్పపు కోరికలతో తపస్సు చెయ్యరు వాళ్ళు. ఇహ వాళ్ళు భర్తకోసం తపస్సు చెయ్యాలని నిశ్చయించుకుంటేమాత్రం. ఇంద్రుడుకాదు అతని జేజమ్మవచ్చి ఎదట నిలబడ్డా ఏం లాభంలేదు.

ఆడదాని తపశ్చర్యకు భంగం వుండదు. ఇప్పుడీ ఉష అనే అమ్మాయి ఎక్కడినుంచో వచ్చి మన శంకరంకోసం తపస్సు మొదలెట్టిందా ! ఎవరు భంగం చేయగలుగుతున్నారు ?

బేబీ : (కోపంగా) చెయ్యగలరు ! ఎవరో ఎందుకు చేస్తారు ? తన సంసారము, తన సుఖమూ నాశనమయిపోతూవుంటే అక్కయ్యే ఏమీ పట్టించుకోకుండా కూచుంది.

చిదా : అటువంటప్పుడు అక్కయ్యయొక్క క్షేమం సౌఖ్యం ఆలోచించేవాళ్ళు ఎవళ్ళయినా వూనుకోవాలి మరి ?

బేబీ : ఈ ముక్క నువ్వే అన్నావుగనుక సరిపోయింది. కూతురి సౌఖ్యంకోసం బాధ్యత వహించటానికి తల్లికంటే యింకెవ్వరుంటారు ? కాని మనింట్లో అక్కయ్యకంటే అశ్రద్ధగావుంది అమ్మ !

చిదా : ఎంచేతంటే నీకుమల్లే నోరెట్టుకు గొడవచెయ్యటం లేదు కదూ, అందుకని.

బేబీ : నేనేం గొడవ చెయ్యమనడంలేదు. అసలు ఏమయినా చేస్తోందా అని ఆవిడ ?

చిదా : నీ కెట్లా తెలుస్తుందేమిటి ? బేబీ ! నువ్వింకా మీ అమ్మని అవగింజంతయినా అర్థం చేసుకోలేదు సుమా !

బేబీ : నాకుమాత్రం అమ్మ ఏ ప్రయత్నమూ చేస్తున్నట్లు కనిపించటమేలేదుసుమా ? ఊరికే బెంగపెట్టుకొని చిక్కిపోతోందంతే ! దానివల్ల ఎవరికి ఉపయోగం గనుక ? నన్నడిగితే అసలు మనమందరం ఆ శంకరం బావయ్య చుట్టూ పోగయి పెద్ద గందరగోళంచేసి, ఒక ఆందోళన లేవదియ్యాలి. విధీ విరామంలేకుండా —

చిదా : నువ్వు చెప్పింది బాగానే వుందిగాని బేబీ ! ఈ ఆందోళనలు లేవదియ్యడంలో ఒక చిక్కు ఏర్పడుతుంటుంది. గందరగోళం ప్రారంభించినవాళ్ళకి అదే ఒకనిషాలా ఎక్కిపోయి అసలు ఈ ఆందోళన ఎందుకు ప్రారంభించారో మరచిపోయి వాళ్లే గందరగోళంలో పడిపోతారు. ఇది మామూలు !

బేబీ : మొదలెట్టావు నీ వ్యాఖ్యానాలు ; నేను అసలు మొదట నుంచీ చెబుతూనే వున్నాను అమ్మతో, నువ్వు వచ్చి చేసే నిర్వాకం యిలాగే వుంటుందని. ప్రతివాణ్ణీ నీ అభిప్రాయం ఏమిటీ, సిద్ధాంతం ఏమిటీ, నీ సలహా ఏమిటీ అని అడిగి, వాగించి చివరికి వాటన్నిటినీ మాటలతోటే ఖండించి, వ్యాఖ్యానాలుచేసి ఎదుటి మనిషిని వెఱ్ఱివాడిలా నుంచోపెట్టటంతప్ప నువ్వేం చెయ్యలేవని. నాకు నీతో వాదన చేత కాదు. నాకు చేతనయినది ఏదయినా ఒక ప్రయత్నం క్రియారూపకంగా చెయ్యటం —

చిదా : అది భేషయినపని. ఏం ప్రయత్నం చేస్తావు ? కాస్త చెప్పు.

బేబీ : పీలయినంత తొందరలో ఈ ద్వితీయ వివాహం నిషేధించటానికి శాసనం చేయించాలని యివాళ సభలో ఎంత గొప్ప ఉపన్యాసం చెప్పానో తెలుసా ?

చిదా : (ఎగతాళిగా) వచ్చేటప్పటికి అందులోంచే కాబోలు కొన్ని వాక్యాలు మీ అమ్మడగ్గిర చెబుతున్నావు. కదూ ?

బేబీ : ఛీ ! అన్నయ్యా !

చిదా : అదికాదా ? కోపం ఎందుకు ? అంచేత నీ నమ్మకం అంతా సాంఘికంగా ఒత్తిడితెచ్చే ప్రయత్నంమీదే వుందన్నమాట ? మరి మీ అమ్మ నమ్మకం అంతా వ్యక్తిగతంగా నచ్చచెప్పటంమీద ఉండవచ్చు.

బేబీ : నీ నమ్మకమంతా ఉత్తమ కబుర్లు చెప్పటంమీద అనుకుంటాను ?

చిదా : నిజం ! నిజం ! మరి మీ నాన్నగారికి ఏ ప్రయత్నం మీదా నమ్మకంలేదా మరి ?

[ఇందిరాదేవి వచ్చి]

ఇంది : ఏమర్రా ! టీ త్రాగటానికి రారా ?

చిదా : వచ్చేస్తున్నాం ! ఏవమ్మా బేబీ, మరి మీ నాన్నగారి పద్ధతి ఏమిటోకూడా చెప్పవూ ?

బేబీ : నాన్నగారి పద్ధతా ? అది నాకు నచ్చింది సుమా ! ఆయ నది దెబ్బకు దయ్యం యుడుస్తుందనే పద్ధతి అంతే ! అసలు ఆ శంకరం గారి వృత్తాంతం నాన్న మొదట విన్నరోజున అయితే అగ్గినిప్పయి పోయారు ! ఆరోజు అల్లుడు కనిపించివుంటే చేతికర్ర ఎత్తేవారు నాన్న గారు. అసలు అలాగే చెయ్యాలికూడాను. ఇహ మాట్టాడ్డానికి, వాదించ డానికి, నచ్చచెప్పడానికి అర్హుడు కాడాయన. అసలు అతనికి మతిపోయి నట్టుంది పూర్తిగా. [ఇంతట్లో భార్గవరావుగారు వస్తారు. పెద్ద ఉద్యోగి— ఆఫీసునుంచి వస్తున్నట్లుంటాయి దుస్తులు. ప్రవేశిస్తూనే.]

భార్గ : మతిపోయింది ఎవరికే ? [అంటూ యింట్లో అడుగు పెడతారు. ఎదురుచెపితే ఏమాత్రం సహించనట్టి ప్రకృతి ఆయనది. అదే భావన ప్రస్ఫుటంగా ఆయనముఖంమీద కన్పిస్తుంది]

చిదా : నమస్కారం చిన్నాన్నా !

భార్గ : ఓహో ! నువ్వా ? చిదానందం ! ఎప్పుడొచ్చావు ? అయితే మీ పిన్ని వుత్తరం అందిందన్నమాట ? మన పురాణాల్లో చెల్లె లిని రక్షించటానికి అన్న పరుగెత్తుకు రావడం వున్నదేగా ? అదే కలి యుగంలోకూడా కంటిన్యూ అవుతున్నదన్నమాట ?

చిదా : ఇందులో పెద్ద రక్షించటం, పరుగెత్తుకు రావటం, అదేం లేదు చిన్నాన్నా ! ఏదో యిక్కడ ఏర్పడుతున్న పరిస్థితులన్నీ వ్రాసింది పిన్ని. సరే ఆ విద్దూరాలేమిటో ప్రత్యక్షంగా చూద్దామని వచ్చాను. అంతే !

బేబీ : ఇన్నాళ్లూ మనం మంచివారని అనుకుంటున్నవాడు ఉత్త మూర్ఖుడిలా ప్రవర్తిస్తున్నాడంటే ! అదేమో అమ్మకి వింతగానూ విద్దూరం, లాగా కనిపిస్తోంది మరి !

భార్గ : బేబీ ! నువ్వు మీ అమ్మనుగురించిమాత్రం ఎక్కువ

మాట్లాడకు. దానిమనసులో ఏం వుందో: పాతికేళ్ళ కాపురం చేసినా ఈ రోజుకే నా కర్థంకావటంలేదు.

చిదా : నిజంగా ఆవిడకి గట్టిచిక్కే వచ్చిపడింది.

బేబీ : నువ్వానేది మరీబాగుంది. సిగ్గులేకుండా రెండోపెళ్ళికి తయారయ్యేవాళ్ళసంగతి వదిలేసి__

భార్గ : బేబీ ! నువ్వూరుకో !

బేబీ : అలాటి కఠినాత్ములని పెళ్ళిచేసుకుంటానని ముందుకువచ్చే ఆ సిగ్గూ బిడియమూలేని ఆడవాళ్ళని వదిలేసి, అమ్మని కనికరిస్తూ కూచున్నావు నువ్వు. అసలు యిలాంటి వారందరికీ నీతులుచెప్పి లాభంలేదు. జైలులో పెడతామని బెదిరించాల్సిందేకాని. అదే యివ్వాళ మీటింగులో బల్లగుద్ది చెప్పేశాను.

[భార్గవరావు, ఇందిరాదేవి బిత్తరపోయి ఒకరివేపు ఒకరు చూసుకుంటారు. అంతట్లో చిదానందం ఒక ఉపాయం ఆలోచిస్తాడు]

చిదా : బేబీ, ఎంతసేపు అయింది చెప్పు నేవచ్చి? ఇహ యిప్పుడు నాన్నగారుకూడా వచ్చేశారు. మాకేమయినా కాస్త టీ యిప్పిస్తావా ? ఏవిటి ?

భార్గ : అవునమ్మా, వెళ్ళి కాస్త టీ పెట్టించు. (బేబీ కదలకపోవటం గమనించి) వెళ్ళమని చెప్పటంలా ? మేం కాస్సేపు మాట్లాడుకోవాలి ?

బేబీ : నాకు తెలుసు. మీరేదో పెద్ద తతంగం ఆలోచిస్తారు కాబోలు ? కాని నే ఒక్కటేసంగతి చెబుతున్నాను. మీరు యిష్టపడ్డా పడకపోయినా, నేను ఓ వెయ్యిమంది కాలేజీస్నేహితుల్ని వెంటవేసుకొనివచ్చి, నల్లజండాలు పుచ్చుకొని, ఆశంకరం పెళ్ళిపందిరిలోనుంచొని శంకరం గో బాక్, ఉషా గో బాక్ అని బ్రహ్మాండమయిన నినాదాలు చేయించేస్తాను !

భార్గ : ఛీష్ ! ఛీష్ ! తప్పకుండా చేయించు. కాని ముందరలోపలకెళ్ళి టీ చేయించు.

బేబీ : (మూతి ముడుచుకొని లోపలకు వెళ్తూ) పీళ్ళకి మావయసు పిల్లలంటే లెక్కలేదు బొత్తిగా ! (అని సణుగుకుంటూ వెళ్ళిపోతుంది)

భార్గ : చిదానందం ! ఇదీ యింట్లో ధోరణి ! అసలు ఈ శంకరం పోకడ తెలిసినప్పుడే - మనవృత్తాంతంకూడా పిల్లలకి చెప్పెయ్యడం మంచిదని చెప్పాను. కాని ఆవిడ సంకోచించింది. ఈ భారం నీ మీదవేస్తే సులువుగా తేలుస్తావని ఆవిడకి నమ్మకం. ఇంతకీ ఇప్పుడు నీ స్నేహితుడు శంకరం తలపెట్టిన ఘనకార్యం తెలుసుగా నీకు ?

చిదా : ఆఁ !

భార్గ : సరే ఆయితే ! అతనికి నువ్వయినా బుద్ధి చెప్పగలవేమో ఓసారి ప్రయత్నించి చూడు. అతగాడు గీచిన గిరి దాటకుండా ఇన్నాళ్ళూ కాపురంచేసిన బుద్ధిమంతురాలయిన పెళ్ళాంవుండగా,ఆయనకిప్పుడు యింకెవరో పిల్లమీద అధాత్తుగా ప్రేమ పుట్టుకొచ్చిందట ! తుంటరిలక్షణం! అంతకంటే ఏమిటి ? ఇది భార్గవరావుతో వ్యవహారంసుమా,జాగ్రత్త అని చెప్పు. నేనూ చూస్తాను. ఆ పెళ్ళి ఎలా జరుగుతుందో—

చిదా : చిన్నాన్నా ! అసలు నువ్వుకూ—డా (నిధాయించుకొని) అదికాదు - యింతకీ - ఆ పెళ్ళి మీరు ఎట్లా ఆపుచేస్తారు ?

భార్గ : అంటే ! నేనూ రెండోపెళ్ళి చేసుకున్నవాణ్ణేగదా అనేనా ? ఆ పెళ్ళి యీలాటి పిచ్చిచేష్టేంకాదు. ఎవరికీ ద్రోహం చెయ్యలేదు నేను-అసలు ఆ పెళ్ళి తరహాయేవేరు. మొదట ఒక అమ్మాయిని పెళ్ళిచేసుకొని. ఆ తర్వాత యింకో అమ్మాయిని ప్రేమించి, ఆ ప్రేమతో పిచ్చి ఎత్తి మొదటిపెళ్లాన్ని వదిలేద్దామని బుద్ధిపుట్టలేదు నాకు. అసలు ఈ ప్రేమా గీమా వ్యవహారాలు నా కెన్నడూ యిష్టంలేదు. అలాటి గొడవల్లో నేనెప్పుడూ పడనూలేదు. నేనీవిడని పెళ్ళిచేసుకున్నప్పుడుకూడా మామూలుగా, సాంప్రదాయంగా, పెళ్ళిచూపులకువెళ్ళి ఆ తర్వాత చేసుకున్నాను. అవునా ? [ఇందిరాదేవి స్థబ్దంగా వుంటుంది] అసలు ఈ డాక్టరు శంకరం వ్యవహారం నాకు కాస్తముందే తెలిసివుంటే నేను లక్షప్రయత్నాలైనాచేసి, ఆ అమ్మాయిని ఈ వూళ్ళోనుంచి సాగనంపేసేవాణ్ణి, యింత ముదరకముందే.కాని నాకుశ్రుతిమించిన తర్వాత తెలిసింది. అసలు బేబీచాలాముందే

కనిపెట్టేసింది. నా దగ్గిరకూడా అప్పుడప్పుడు ప్రస్తావించింది. ఆఁ ఏదో కుర్రవాగుడనుకున్నాను. తీరా ఇప్పుడు చూస్తే వ్యవహారం యింత వరకూ వచ్చింది.

చిదా : ఇంతవరకూ వచ్చినతర్వాత యిప్పుడు పెళ్ళి ఆపటం అంత సులభమేం కాదు. అదీకాక మీరనుకోవటంగాని బెదిరిసేనూ, యుడి పిస్తేనూ పెళ్ళి ఆగిపోతుందా ?

భార్గ : (కోపంగా) ఎందుకు ఆగదు ? ఆపించాలి. కనీసం ఈ ఒక్క పెళ్ళయినా ఆపితీరాలి. అతగాడు ప్రేమాగీమా అని పరుగులెట్టి యితరుల హక్కుల్ని కాళ్ళక్రింద త్రొక్కెయ్యడానికి అతనికేమీ అధికారంలేదని జ్ఞాపకం చెయ్యాలి. అతను అసలు ఈ ప్రపంచకమే మరచిపోతున్నట్లు ప్రవర్తిస్తున్నాడు. ఇది మనతో వ్యవహారం అని చెప్పు. తన మొదటిపెళ్లాం ఏదో దిక్కూ మొక్కూలేని పక్షికాదని చెప్ప తనకి. దాన్ని భ్రష్టంగా ఏ కలెక్టరుకో, దివానుకో యిచ్చి చేసి వుండే వాణ్ణి. అసలు. కానీ ఈ కుర్రవాడు తెలివయినవాడూ, వృద్ధిలోకి వచ్చే వాడూ, పైగా నీకు స్నేహితుడూ అని ఆలోచించి వప్పుకున్నాను ఆ పెళ్ళికి - ఆతర్వాత చదివించాను. హాస్టల్లోవుండి నీ యిష్టంవచ్చినట్లు అర్భుపెట్టుకోమన్నాను. అవునా ? అతను చక్కగా చదువుకొని ఫస్టుగా వచ్చేవాడు ప్రతి పరీక్షలోను. సరే మంచిఅల్లుణ్ణే సంపాదించామని సంతోషించాను. మన అమ్మాయి నిజంగా అదృష్టవంతురాలని ఆనందపడ్డాను. మరి యింత తెలివయినవాడూ యివాళ అసలురంగులో బయట పడ్డాడు.

చిదా : అయితే మీరుచేసిన వుపకారాలన్నీ జ్ఞాపకం తెచ్చి అతని మనసు మార్చటానికి యేమయినా ప్రయత్నం చేశారా ఏమిటి ?

భార్గ : ఈ మనసులు మార్చేప్రయత్నాలు మనచేతకాదు. నీ కోసం అట్టేబెట్టేశాను. పైగా అతను ఒట్టి పట్టుదల మనిషి. నే వెళితే ఏమయినా అవమానించినా అవమానించగలడు.

చిదా : అయితే యిప్పుడింక ఆ పెళ్ళి ఎట్లా ఆపుదామనీ ?

భార్గ : ఏం, నే నస లామ్మాయితో మాట్లాడటానికి ప్రయత్నం

చేశాను. ఆవిడతో వచ్చిన ముసలాయన లేడూ, ఆ చైతన్యదేవ్ : ఆయన ఎవరో ! అతనితో మాట్లాడానికి ఏర్పాటు చేశాను.

చిదా : అయితే, అక్కడికెళ్ళి ఏం మాట్లాడతారు ? పోసీ— వాళ్లొకవేళ—"ముందు మీ అల్లుణ్ణి అదుపులో పెట్టుకోండి. ఆ తర్వాత మాతో మాట్లాడవచ్చునూ" అంటే !

భార్గ : ఇవన్నీ నువ్వంటున్నావు. ఆ అమ్మాయి అలా ఎందు కంటుంది? ఆవిడ సాంప్రదాయంగల హిందూ స్త్రీ. అంత వినయం లేకుండా ఎప్పుడూ మాట్లాడదు. ఒకవేళ అలా అందంటే ఇదేనా అమ్మా, నువ్వు చదువుకున్నచదువని అడిగేస్తాను. నిన్నెంతో గుణవంతురాల్నిగా చెయ్యాలని - పాపం - చచ్చేవరకూ నాకు చదువుచెప్పించిన రామేశం గారికి మంచిపేరే తెస్తున్నావని జ్ఞాపకం చేస్తాను. నీ కెటువంటి భర్త కావాలో నాతో చెప్పు. ఎన్నివేలు కట్నం కావాల్సివచ్చినా నే యిస్తాను; ఆ అమ్మాయికి ఎవరూ బంధువులు లేరటమరి! పోసీ - నేను నా కూతు రులా చూచుకొని పెళ్ళిచేస్తాను. కానీ—నా పెద్దకూతురు సంసారం మాత్రం భగ్నంచెయ్యకు. ఇంకేమే మరి ? సరేనా యిలా చెబితే !

చిదా : కాని చిన్నాన్నా ! ఇది మీతరంలో అలవాటయిన పెళ్ళి కాదు. ఇది ప్రేమవివాహం.

భార్గ : ఇదీ మరీబాగుంది. అయితే అన్ని పెళ్ళిల్లు ప్రేమ వివా హమే కావాలని ఎక్కడుందోయ్ ? యిదేమయినా ప్రేమించి పెళ్ళిచేసు కుందా చెప్పు ? ఇప్పుడు ఇరవై ఏడేళ్లు సుఖంగా కాపురం చెయ్యలేదూ ? ఏమే ? (ఇందిరాదేవి మాట్లాడదు) అసలు ప్రేమా గీమా ఈమధ్య పుట్టిన పిచ్చి అంతే — ఎక్కడబడితే అక్కడ ప్రేమవివాహం అంటూ బయలుదేరుతున్నారు మరీ ! ఇప్పుడు నే చెప్పేదీ - ప్రేమించా లనివుంటే ప్రేమించుకో - వివాహం ఎందుకు ? పైగా మొదటిపెళ్లాం బ్రతికివుండగా మళ్లా యీ ప్రేమవివాహం అసలు పనికిరాదు.

చిదా : అయితే చిన్నాన్నా ! నీ అభిప్రాయంప్రకారం మొదటి పెళ్ళాం బ్రతికివుండగా, సాంప్రదాయమయిన రెండోపెళ్ళి చేసుకోవచ్చు కదూ ? ప్రేమవివాహంమాత్రం కాకూడదు అంతేనా ?

భార్గ : ఖచ్చితంగా అంతే, ఎంచేతంటే - ఇద్దరు పెళ్ళాలని పెట్టుకొని యధేష్టంగా సంసారం నడుపుకోవచ్చు. కాని, అందులో ఒక్కటి ప్రేమించిన భార్యఅయితేమట్టుకు మొదటిపెళ్లాంది అధోగతయిపోతుంది. ఇప్పుడు మొదటిపెళ్లాంలో ఏద్దైనా రోగం రొస్టూ వగైరా దోషాలుంటే అప్పటిసంగతివేరు మళ్ళా - ఇప్పుడే శంకరానికి ఏమొచ్చిందసలు ? మొన్నమొన్నటివరకూ అమ్మాయితో హాయిగా సంసారం చెయ్యలా ? అసలు పెళ్ళయిన ఒకసంవత్సరము అయ్యాక వీళ్ళందరూ అతను అమ్మాయిని చాలా ప్రేమిస్తున్నాడని చెప్పడంకూడా మొదలెట్టారు. అప్పుడే నాకు చాలా భయంవేసింది. ఇప్పుడేమో ఆ ప్రేమ మనఅమ్మాయి మీంచి ఎగిరిపోయి యింకోచోట వాలిందట. దీనికంతేమిటి అసలు ! అంతకంటే మాంసంసారాలే నయం. ఈ ప్రేమా అదీ అంటే అందుకే నాకు వళ్లుమంట. నాకు ఈ ప్రేమంటే ఏంవిటో తెలియదసలు.

చిదా : ఆ మాటా నిజమేఅనుకో ! అసలు చాలామందికి తెలియదులే.

భార్గ : ఏదో కవులకీ, రచయితలకీ తెలుసుంటే తెలిసివుండవొచ్చు. డాక్టర్లకీకూడా తెలిసివుంటుందని మనకిప్పుడే అర్థమవుతోంది. నాకు ప్రపంచకంలో అన్నివిషయాలూ తెలుసనుకో - అధమపక్షం ఆపేదకా నమ్మకంవుంది. కాని - నాకింత వయసువచ్చాక ఈ ప్రేమనిగురించి తెలుసుకోవాలిసిన అవసరం ఏమీలేదు. ఆ కోరికాలేదు.

ఇంది : నే నొక్కముక్క చెబుతాను వింటారా ? ఇప్పుడు ఆ శంకరంగారికీ ఆ అమ్మాయికీ పెళ్ళి జరగకూడదు: అంతేగా మీక్కావలసింది ? మీరువెళ్ళి ఆ అమ్మాయితో మాట్లాడుతానంటున్నారుగదా. మరి ఆ అమ్మాయి ఆలోచనలు ఎలావుంటాయో మీరు తెలుసుకోకపోతే ఎలా ?

భార్గ : ఏ ముందంత పెద్ద తెలుసుకోవడానికి ? అందరికీ తెలిసిన విషయమేగా ? ఈదొచ్చిన అమ్మాయి - పెళ్ళిచేసుకోవాలనేకోరికవుండడం సహజం. అంచేత ఆవిడకి ఎటువంటి భర్త కావలసివుంటే

వాణ్ణే వెదుకుదాం. డాక్టరునే పెళ్ళిచేసుకోవాలనివుంటే ఒక డాక్టరునే విశ్వయించేద్దాం.

ఇంది : ఏవండోయ్ ! ఆ అమ్మాయికి డాక్టరు శంకరాన్ని ప్రేమి స్తోందిగానీ డాక్టరునిగాదు. మీరు తీసుకొచ్చిన ఇంకో డాక్టరు ఎంతగొప్ప వాడయినా ఆవిడ తక్షణం ఆతన్ని ప్రేమిస్తుందనా మీ అభిప్రాయం ?

భార్గ : అంటే యిప్పుడు ఆడది ప్రేమించటం ఒక పురుషుని గుణగణాలు చూచేకదా ?

ఇంది : అవునండీ ! డాక్టరీచెయ్యడం వృత్తిగాని గుణం ఏలా అవుతుందండీ !

భార్గ : ఏంటీ ! అయితే నీకుకూడా ఈ ప్రేమించడం గొడ వంతా తెలుస్తోందా ఏంటి యిప్పుడిప్పుడు, కొంపతీసి —

ఇంది : ఏంమాటలండీ ! మీరు అసలువిషయం ఆలోచించ కూడదూ ? ఇప్పుడు మీరా అమ్మాయిని ఒప్పించి యిప్పుడే పెళ్ళి తప్పిం చాలనేకదూ ? అటువంటప్పుడు ఆవిడదగ్గిరికెళ్ళి నీకింకో తెలియిన డాక్ట రుని చూపిస్తానూ, కట్నం కావలిస్తే నేనిస్తానూ, నీ వేమో శంకరాన్ని విడిచిపెట్టి చేతులు కడుక్కో అనిమాత్రం మాట్లాడకండి. ఆ పిల్ల చదువు కున్నది. చాలామంది తెలివయినవాళ్ళని ఎంతమందినో తనకళ్ళతో చూచింది. వాళ్ళందరినీ తోసి పారేసి ఈ శంకరంమీదే ప్రేమ నిలుపు తుంది. మీరావిదమనసు మళ్ళించడానికి ప్రయత్నం చెయ్యడంలో, ఆవిద ప్రేమని పరిహాసంచేసి, ఆవిదమనసు కష్టపెట్టకండి.

భార్గ : ఆవిదప్రేమని పరిహాసం చెయ్యడం ఏవుంది ? ఆ పిల్ల శంకరాన్ని ప్రేమించడానికి నే నొప్పుకోను.

చిదా : అయితే చిన్నాన్నా ! ప్రేమించడం అంటే శలవు దర ఖాస్తు పెట్టుకోవడమా ఏమిటి ? సీకిష్టంలేకపోతే రద్దయిపోవడానికి ? ప్రేమించడం అంటే ఒకవ్యక్తిని ప్రేమించటం అన్నమాట ! ఆ వ్యక్తిలోవున్న గుణగణాలని జమాఖర్చులువేసి ఆ జాబితాని ప్రేమిం చటం జరగదు. ఈ వూళ్లో ఎంతమంది డాక్టర్లులేరు ? అందులో ఎంత

మంది పెళ్ళికి సిద్ధంగా వున్నవాళ్ళులేరు ; వాళ్ళెవళ్ళూ ఆవిడ దృష్టికి ఆనలేదుమరి. ఆవిడ మీ అమ్మాయి భర్తనే వరించింది. ఇదే ప్రేమించ డంలోవున్న పెద్దచిక్కు.

భార్గ : అయితే మీరిద్దరూ ఏమంటారిప్పుడు ; మనం ఈ పెళ్ళి జరుగుతూవుంటే చూస్తూ వూరుకోవాలనా ;

చిదా : అట్లా అనటంలేదు చిన్నాన్నా ; కాని ఆ డాక్టరు శంక రానికి బదులు యింకో డాక్టరిని పెళ్ళికొడుకుని చేస్తానూ - ఆ అమ్మా యిని హడలిగొట్టి పంపించేందుకు ప్రయత్నం చేస్తానూ అనడంలో ఫలితంలేదని చెబుతున్నాను.

భార్గ : అయితే మరి బెదిరించకూడదూ, పోసీ వాళ్ళకాళ్ళ పట్టుకో మంటావా ;

చిదా : అటువంటి సమయమే వస్తే - ఆ పనిచేసినా తప్పులేదు. ఇప్పుడు మనం ఆ పిల్లకి నచ్చచెప్పాలని చూస్తున్నాం. బాలుం. జబర్దస్తీ చేస్తే హృదయంలో పరివర్తనవస్తుందా ఎక్కడయినా ;

భార్గ : సరే ; మీ హృదయ పరివర్తన ప్రయత్నాలేవో మీరే చూసుకోండి. నా కవన్నీ పొసగవు. ఆ మార్గాలు మీ యిద్దరికీ నచ్చు తాయి కనుక మీరే సంప్రదించుకోండి. వాటివల్ల ఏ విధమయిన ప్రయో జనం కలుగుతుందనే నమ్మకం నాకులేదు. నాకు తెలిసింది ఆచరణ రూపకంగా నిరోధించగలిగితే నిరోధించటం-నేనా ప్రయత్నం చేసుకుం టాను. [వెళ్ళిపోతాడు]

చిదా : ఏమిటి పిన్ని ; ఏమిటిదంతా ; తను ఏనాడో చేసినపని తన అల్లుడు తలపెడితే ఈయన యింతకోపం తెచ్చుకుంటాడేమిటి ; పైగా ఏమీ ఎరగని ఆ పరాయిపిల్లని బెదిరిస్తానంటాడు ; ఆ బేబీ ఏమో వేదికలెక్క ఈ తప్పంతా ఆడవాళ్ళదేనని హడావిడిచేస్తోంది ఓ ప్రక్కన. దాన్ని నోరుమూసుకు కూచోమనైనా చెప్పు. ఇన్నాళ్ళనుంచీ నీ పెళ్ళి విషయం పిల్లలకి చెప్పకుండా దాచిపెట్టేసి వుంచావునువ్వు ; ఎందుకు చెప్పలేదు ; ఊఁ ; చూశావా, యిప్పుడు పరిస్థితులు ఎంత విచిత్రంగా తయారయ్యాయో ;

ఇంది : అసలు అల్లుడుగారివిషయంలో ఈ గొడవ బయలుదేరి నప్పటినుంచీ యీలాగేవుంది వరస. ఆయనేమో అల్లుడిమీద కోపం తెచ్చుకుంటారు. అమ్మాయి ఆ పిల్లని తిట్టిపోస్తుంది.

చిదా : మొత్తంమీద పెద్దపొరపాటుచేశావు పిన్నీ ! అధమపక్షం మొన్న ఈమధ్యఅయినా అమ్మాయిలతో నీ పెళ్ళినిగురించి మనసు విప్పి చెప్పినా కొంతబాగుండిపోయేది : ఎందుకు చెప్పలేదు నువ్వూ ?

ఇంది : ఏంవిటో చెప్పలేకపోయినాను బాబూ ! పూర్వంలో చెప్ప వలసిన అవసరమూ కనబడలేదు. ఇన్నాళ్ళయ్యాక ఆ అవసరం యిలా అకాతుగా వచ్చింది. ఎలా చెయ్యమంటావు నువ్వేచెప్పు పోనీ ? నా పెళ్ళి అయిన క్రొత్తలో, నీ మొదటి పిన్నిగారు మనసు కష్టపెట్టుకొని అమాంతం దేశం వదిలిపెట్టి బర్మాలో తన అన్నగారిదగ్గరకు వెళ్ళి పోయింది. ఆ తరువాత యీ యింటితో సంబంధమే పెట్టుకోలేదు ఆవిడ. ఆ కోపంతో అత్తగారసలు ఆవిడపేరే యింట్లో ఎవరూ ఎత్త కూడదని శాసించింది. తర్వాత మేమూ, ఉద్యోగాల్లో బదిలీ అవుతూ ఎప్పటికప్పుడు ఏదో కొత్తకొత్త వూళ్ళల్లో బ్రతుకుతుండడంచేత ఇరుగు పొరుగువాళ్ళకి మా వృత్తాంతమే తెలియనవసరం లేకపోయింది. ఆ రోజుల్లో యీ పిల్లలు పుట్టారు. అత్తగారు పోయింది. ఆ తర్వాత పిల్లలు పెద్దవాళ్లు అవుతూవుండగా బర్మాలో ఆవిడ పోయినట్లు కబురువచ్చింది. అంతటితో యింక ఆ విషయం అసలు ఎత్తవలసిన అవసరమేలేకుండా పోయింది. ఆలాగే రోజులు గడిచిపోయాయి. నేను వాళ్ళకి ఎప్పుడు చెప్పను ? ఏమని చెప్పను ?

చిదా : నిజమేలే పిన్నీ ! కానీ—

ఇంది : అవునయ్యా ; ఇహ ఆ తర్వాత అల్లుడుగారు ఈ క్రొత్త అన్యాయం ప్రారంభించాక - నా కసలుఊపిరే సలపకుండా పోయింది. ఆయనది ఒక పంథా - బేబీది ఒకపద్ధతి. పెద్దఅమ్మాయి అసలు మూగనోము పట్టేసింది. ఎవరితో ఏం చెప్పమన్నావు నన్ను ? అందు

కనే నీకు ఉత్తరం రాశాను. కనీసం ఆ శంకరంతోనైనా నువ్వోసారి మాట్లాడివస్తావని పిలిపించాను.

చిదా : పిలిపించావుగాని పిన్ని ! ఏం ప్రయోజనం వుంటుంది ! అసలా శంకరంలాంటి మనుష్యులు ఒక నిశ్చయానికి వచ్చాక బ్రహ్మ రుద్రులు చెప్పినా మార్చుకోరు. అందులోనూ వాళ్ళవంశమే పట్టుదలగల వంశం. అన్నిటికంటే యిబ్బందయిన విషయం. యిది ప్రేమకు సంబం ధించిన పేచీ. అతను పింటాడని నాకేం నమ్మకంలేదు.

ఇంది : ఆ మాటా నిజమే ! సాధ్యమయినంతవరకూ ఆయన ఈ పెళ్ళిచేసుకోకుండా వుండేలా ప్రయత్నించాలి అంతే ! ఒకవేళ అది సాధించగలిగినా నిజానికి ఏం ఉపయోగం ? అమ్మాయికాపురం చితికి పోయింది. ఇహ అతుక్కోదు. ఎటొచ్చీ ఆ పెళ్ళికాకుండావుంటే పది మందిలోనూ పరువునిలుపుకోటంకోసం అమ్మాయి అతనితో కాపురం చేస్తున్నట్లు నటించాలి. మన అమ్మాయి విషయంగా మహాఅయితే అంతే ! (కొంచం ఆగి. ఆలోచనతో) కానీ-చిదానందం ! నా కనేక సార్లు ఆ పిల్లనిగురించే ఆలోచనలు వస్తూవుంటాయి. అభం శుభం తెలి యని అమాయకురాలెవరీ పిల్ల ? ఇలా సవితి బ్రతికివుండగా సంసారంలో దూకడానికి తెగిస్తున్న అభాగ్యురాలెవరోకదా అని. అటువంటి సంసారం స్వర్గంలావుంటుందని ఊహించుకుంటోంది పాపం ! అందులోనూ ఈయ నతో విరోధం ఒకటి ? ఆ పెళ్ళిఅయిన మరునాటినుంచీ ఆవిడజీవితం దుర్భరం చేసేస్తే ఏంచేస్తుంది ?

చిదా : అందుకనే - అసలు ఈ చర్యలు రాయబారాలూ నడిపే టప్పుడు ఆయన రాకుండావుంటే బాగుంటుంది.

ఇంది : అందుకనే నిన్ను పిలిపించాను నాయనా ! ఎలాగో సర్దు బాటుచేసి అమ్మాయికి అవమానం తప్పేటట్టుచూస్తే అదే పదివేలు. ఆ శంకరంతో మాట్లాడి. అవయినా సాధించగలవేమో చూడోసారి.

చిదా : అలాగేలే పిన్ని ! నేనువెళ్ళి మాట్లాడుతాలే శంకరంతో. చూద్దాం. అసలు వ్యవహారం ఎంతవరకూ ముదిరిందో ? శంకరం ఏవిధంగానూ దోవకి రాకపోతే, ఆ తర్వాత ఆ అమ్మాయిని కలుసుకొనే

ఏర్పాట్లు చేసుకోవచ్చు. ఇవన్నీ నా పద్ధతుల్లో నన్ను చెయ్యనియ్యి. అంతవరకూమాత్రం ఆయన్ని కొత్త కళ్ళం బిగించిపుంచు. ఈ మధ్యలో ఆయన బయలుదేరి హడావిడిచేయటం మొదలుపెడితేమాత్రం కష్టం. వ్యవహారం పూర్తిగా బెడిసిపోతుంది. ఏమిటి? అంతవరకయినా చేస్తావా ?

ఇంది : ప్రయత్నం చేస్తాను నాయనా ! ఆయన స్వభావం నీకు తెలుసుగా ? ఎందరుచెప్పినా వినరుగదా ? అయినా చేతనయినంతవరకూ సముదా యిస్తాను.

బేబీ : (ప్రవేశించి) అమ్మా ! అన్నయ్యా ! టీ త్రాగటానికి వస్తారా ? రారా ? నాన్నగారు కాసుకూర్చున్నారు మీ కోసం ?

— తెర —

రెండవ అంకము

[డాక్టర్ శంకరంగారి యిల్లు - శంకరం ఒక్కడే కూచొని వుంటాడు. సుమారు ముప్పైమూడు సంవత్సరాలవయస్సు వుంటుంది. తలుపుదగ్గిర బెల్ మోగుతుంది. చైతన్యదేవ్ వస్తాడు. చైతన్యదేవ్ బర్మాపౌరుడు. వయసు మళ్ళినవాడు]

శంకరం : దయచెయ్యండి ! చైతన్యదేవ్ ? ఏమిటి అపురూపంగా యిలా దయచేశారు ?

చైత : క్షమించండి డాక్టర్ ! మా ఉష అలా స్నేహితులతో ఊరు వెళ్ళిందిగదా అని నేనిలా వచ్చాను.

శంక : మీరు చెప్పేది నాకర్థం కావటంలేదు. ఉష అలా ట్రిప్ వెళ్ళింది గనుక మీరిలా వచ్చారా !

చైత : (కొంచం కోపంగా) అంతేనండి ! మరి ఉష వూళ్ళో వుంటే ఇరవైనాల్గుగంటలూ మీరావిడని అంటిపెట్టుకొని కబుర్లు చెబుతూ వుంటారు మరి. నాతో తీరికగా మాట్లాడటానికి వ్యవధి ఎక్కడుంటుంది

మీకు ; అంచేత ఇవాళయినా మాట్లాడుదామని వచ్చాను. అంచేత జాగ్రత్తగా వినండి.

శంక : తప్పకుండా, మీవంటి పెద్దవారు మనసిచ్చి మాట్లాడాలనుకుంటూవుంటే నేను నిర్లక్ష్యంగా వుంటానా ; చెప్పండి ;

చైత : నేను ముసలివాణ్ణి ; అంచేత నీ కోసలహా చెబుతున్నాను. నువ్వు ఉష వ్యవహారం తొందరలో తేల్చు. ఆ అమ్మాయి పడేబాధ నే చూడలేకుండా వున్నాను. మీరు ఆ పెళ్ళితొందరలో కానివ్వరాదూ ; ఎన్నాళ్ళని ఊరికే స్నేహంగా వుండడం ; ఆఁ ;

శంక : లేదండీ ; నేనూ యిప్పుడా పెళ్ళినిగురించే ఆలోచిస్తున్నాను.

చైత : ఇంకా ఎన్నాళ్లు ఆలోచిస్తారు ; మరి యిన్నాళ్లు ఆలోచించేదయితే, అది ముందరే ఆలోచించుకోలేకపోయారూ ; ఆ పిల్ల ఏమో మీమీదనే ప్రాణం పెట్టుకు బాధపడిపోతోంది. నిన్న ఆ అమ్మాయి మీదకూడా కోపం తెచ్చుకున్నాను. ఇంక మీ పెళ్ళి అయ్యేవరకూ ఆ డాక్టరుని చూడటానికికూడా వీలులేదని చెప్పేశాను. కాని దానికష్టం చూస్తూ నే ఊరుకోగలనా ; పాపం ఎంతో అమాయికమైనపిల్ల. బిర్మా నుంచి బయలుదేరినప్పటినుంచీ, ప్రయాణంలో మొట్టమొదట పరిచయం ఏర్పడ్డప్పటినుంచీ, ఆ అమ్మాయిమీద నా కెంతో జాలీ, ఆపేక్ష పుట్టుకొచ్చాయి. లక్షకష్టాలు పడి యీ దేశం వచ్చాం. ఆ అమ్మాయంటే నా కిప్పుడు ప్రాణం. అంచేత ఆవిడ స్వదేశంలో ఆవిడకి పెళ్ళి జరిగిపోతే నేను తృప్తిగా వెళ్ళిపోతాను. మేం వచ్చీరావడంతోటే మీ పరిచయం కలిగింది. మీ యిద్దరికీ స్నేహం కుదిరింది. మంచిదేకదా అనుకున్నాను. కానీ మీరు పెళ్ళిమాట నిశ్చయించటంలేదేమిటి ; ఇహ ఇల్లా వీలులేదు. పెళ్ళిచేసుకున్నతరువాతే మళ్ళా మీ రిద్దరూ మాట్లాడుకోవటం. అమ్మాయితోకూడా ఖచ్చితంగా చెప్పేశాను. ఏమిటి మీ సందేహం ; రెండోపెళ్ళనా ; అయితేనేం ; శ్రీకృష్ణుడు వెయ్యిమందిని చేసుకున్నాడు. మనలో తప్పులేదు. ఆ తర్వాత అమ్మాయికూడా మీ మొదటిభార్యతో కలిసి మెలిసి వుంటుంది. స్నేహంగా వుంటుంది. "కురు ప్రియ సఖే

వృత్తం సపత్నీ జనే "అన్ననీతి ఆవిడకి బాగా ఉపదేశం చేశాను. సరేనా ?

శంక : ఉష ఈట్రిప్పునుంచి రాగానే నిశ్చయం చేస్తాను.

చైత : సరే అయితే ! మంచిదే ! కానీ నా కండిషను జ్ఞాపకం ఉందికదూ ? ఇంక మీకు పెళ్ళి అయినతర్వాతే మళ్ళా మీరు కలిసి మాట్లాడుకోవడం ? ఆఁ !

శంక : అయ్యయ్యో ! మరి ఆ పెళ్ళిసంగతి మాట్లాడు కోవడానికయినా ఓసారి కలుసుకోవద్దూ మేం ?

చైత : అయితే ఒకసారి ఒకర్నొకరు చూచుకోవడానికి అంగీకరిస్తాను. అంతే !

శంక : ఆవిడ ట్రిప్పునుంచి రాగానే నాక్కబురు పంపించండి అయితే !

చైత : అలాగే ! కానీ చెప్పినవన్నీ జ్ఞాపకంపెట్టుకో. నే వస్తాయింక.

[చైతన్యం వెళ్ళుతాడు. డాక్టరు శంకరం మనస్థిమితం లేకుండా కూచుంటాడు. మళ్ళీ గంట మోగుతుంది]

శంక : ఎవరది ? రండి లోపలికి - తలుపు తీసేవుంది.

మంగి : (బయటనుంచే) నేనండీ ! మంగిని.

శంక : ఏం మంగీ ! ఏవఁయినా కబురు తెచ్చావా ?

మంగి : మరేనుండీ ! శారదమ్మగారే రావాలనుకున్నారండి. కానీ చిదానందంగోరు వచ్చారుండి. అంచేత ఒకటి రెండురోజులుండి వత్తానన్నారుండి.

శంక : చిదానందం వచ్చాడా ! ఎప్పుడొచ్చాడతను ?

మంగి : నిన్న సందెకేళ వచ్చారుండి.

శంక : అట్లానా ! ఇంకా యిక్కడికి రాలేదేం మరి ? సరెలే ! ఆఁ ! ఇదిగో మంగీ ! ఒకసారివచ్చి రెండుమాటలు విని పొమ్మని చెప్పు శారదతోటి. ఏం ?

మంగి : సెబతానండి.

[కాని మంగి వెళ్ళకుండా అక్కడే నుంచొని వుంటుంది]

శంక : ఏంటి మంగీ ! యింకా ఏమయినా చెప్పమన్నారా ?

మంగి : మీతో ఏమీ చెప్పమనలేదుండి. కానీ - మంగీ! రాముడు కూడా సెలవుమీద వెళ్ళాట్ట. అంచేత ఇల్లంతా ఊడ్చి, అయ్యగారికేమైనా కావల్సివస్తే తెచ్చి యిచ్చిరా అన్నారుండి శారదమ్మగోరు.

శంక : రాముడు పొద్దున్నే వచ్చాడులే. నువ్వెళ్ళు. [మంగి ఆలోచిస్తూ నుంచుంటుంది] ఇంకా ఏమిటి ?

మంగి : (చీరచెరుగునుంచి ఓ యిత్తడి భరిణతీసి) ఏం నేదండి. మా అమ్మగోరు యీ పలారం యిచ్చి రమ్మన్నారుండి.

శంక : (మనసులో బాధపడుతూ) ఆహా ! సరె ! అక్కడ పెట్టివెళ్ళు. [మంగి వెళ్ళబోతుంటే గుమ్మంలో ఉష నుంచుని వుంటుంది. ఒక్కక్షణం యిద్దరూ ఒకర్నొకరు చూసుక్కుంటారు. శంకరం వెత్తిన చెయ్యి పట్టుకొని ఒక కుర్చీలో విచార గ్రస్తంగా కూచొని వుంటాడు. ఉష లోపలికి వస్తుంది. కాని శంకరం ఏమీ గమనించలేదు. అంచేత అతను స్ఫురణకు రావడంకోసం - ఉష తనచేతిలోవున్న హాండ్ బ్యాగుని అతనిపక్క కుర్చీలో పడేస్తుంది. ఆ చప్పుడు విని పైకి చూస్తాడు శంకరం]

శంక : ఎవరు ? నువ్వా ! ఉషా ! ఇదేమిటి ? స్నేహితురాండ్రతో కలిసి ఏదో ఊరు వెళ్ళావుటగా ఎక్స్‌కర్షనికి.

ఉష : అవును.

శంక : అంటే ! వెళ్ళలేదా ?

ఉష : వెళ్ళాను.

శంక : మరి ! రెండురోజులవరకూ రావని చెప్పారు !

ఉష : ఏంటో వచ్చేశాను.

శంక : ఎప్పుడు ?

ఉష : ఇదే రావటం ; తిన్నగా యిక్కడికే వచ్చేశాను.

శంక : ఏంవిటి ; ఎందుచేత ?

ఉష : ఎంచేతో, స్నేహితురాండ్రతో పొద్దుపుచ్చటం నచ్చ లేదు నాకు.

శంక : అంచేత వాళ్ళని అర్ధాంతంగా వదిలిపెట్టేసి వచ్చేశావా ? ఏమనుకుంటారు వాళ్లు ? నీకేదో మతి చెడిపోయిందనుకుంటారు.

ఉష : వాస్తవమేగా అది.

శంక : గొడుగైనా తెచ్చుకోకుండా ఏమిటీ ఎండలో వచ్చేశావు.

ఉష : స్నేహితురాళ్ళతోవుంటే ఎండగా వుండబట్టే నీడవెతు క్కుంటూ యిక్కడికి వచ్చేశాను. (ఉన్నట్లుండి ఇంటిలోపలికి వెళ్ళ డానికి బయలుదేరుతుంది. శంకరం అడ్డొచ్చి)

శంక : అవును ఎక్కడి కలాగ ?

ఉష : ఇంట్లోకి అక్కయ్య దగ్గిరికి.

శంక : శారద దగ్గిరికా ?

ఉష : అవును. కొంచం పనివుంది నాకావిడితో ;

శంక : నాతో చెప్పకూడదూ ఆ పనేమిటో ?

ఉష : మీతో చెప్పేదయితే ఎప్పుడో చెప్పేదాన్ని. కాని - నేను యివ్వాళ ఆవిడతో మాట్లాడదామనే వచ్చాను. ముఖ్యమయిన పనివుంది. నన్ను వెళ్ళనివ్వండి. [తలుపువరకు వెళుతుంది]

శంక : ఇదిగో ! ఆవిడ ఇప్పుడింట్లో లేదు. రెండురోజులయింది పుట్టింటికి వెళ్ళి.

ఉష : (ఎంతో హతాశురాలై) పుట్టింటికి వెళ్ళిందా ! ఎప్పు డొస్తుంది మరి ?

శంక : ఎందుకు ? అంత ఆవిడతోటే మాట్లాడవలసివచ్చేటంత పని - ఏం పనేమిటి ?

ఉష : ఏం పని ? ఏం పని ? డాక్టర్ ఆది మీ కర్థంకాదు. ఇంకా ఎన్నాళ్లని నేను మీకు దూరంగా వుండగలను ? ఇవ్వాళిటి కివ్వాళే ఆవి

దతో మాట్లాడి ఆవిడ అంగీకారం అడుగుదామని వచ్చాను. ఈ అనిశ్చిత జీవితం నాకు దుర్భరమనిపిస్తోంది. (కుర్చీలో కూలబడి ఏడుస్తుంది]

శంక : నాకు మాత్రం దుర్భరంగా లేదూ ? ఈ పెళ్ళివిషయం నిశ్చయించేప్రయత్నంలోనేవున్నాను. అందుకనే అది ఖాయపరిచేవరకూ నాల్గయిదురోజులు నిన్ను ఇటురావద్దన్నాను. మరి యిప్పుడే వచ్చేశా వేమిటి ? నువ్వెలా నా అంతు చూస్తానంటే ఏలా ?

ఉష : ఎవరి అంతు ఎవరు చూస్తున్నారో ఆలోచించండి కొంచం. మిమ్మల్ని చూడకుండా, మాట్లాడకుండా నాల్గయిదురోజులు గడపాలా ? నావల్లకాదు. ఏడెనిమిదిగంటలు స్నేహితుల్తో ఉండ టమే శక్యంకాలేదు; మీరు కనుపించకపోతే - నేనేదో ఇలా ప్రపం చంలో తిరుగుతున్నాను. నౌకరీ చేస్తున్నాను. నలుగురితోనూ మాట్లాడు తున్నాను; కాని అది అంతా ఒక యంత్రం చేసినట్లు చేస్తున్నాను. ఏపని లోను ఆసక్తిలేదు. మీరు దగ్గిరలేని క్షణాలన్నీ ఊపిరి పీలుస్తూ ప్రాణాలు నిలుపుకుంటున్నాను. అంతే. నేను జీవించి వుండేసమయం మీకు దగ్గ రలో ఉన్నప్పుడు - నాల్గయిదురోజులు దూరంగా వుండమన్నారు మీరు. నా జీవితంలోంచి మీరే వెళ్ళిపోకూడదూ ?

శంక : నేను వెళ్ళగలిగితేగా ?

ఉష : మరింకేం ? నాకుమాత్రం చెబుతున్నారు మీరు సలహా. నన్ను చూడకుండా నాల్రోజులుండమని - మొన్నసాయంకాలం నన్ను చూడ్డానికి వచ్చినప్పుడు మీరెలా ఉన్నారో జ్ఞాపకం ఉందా మీకు ? మీ రప్పుడేం మాట్లాడారో మీకన్నా అర్థమయిందా ? ఒళ్లు తెలియని మైకం అలాగే వుంటుంది. అసలు ఆ రోజున మా ఇంటినుంచి ఆస్పత్రికెళ్ళ డానికి బయలుదేరినప్పుడు మీ వాలకం చూస్తే మీరు సురక్షితంగా ఇంటికి జేరుతారా లేదా అని సందేహం పట్టుకుంది నన్ను. నన్నువిడిచి మీరా లాగా వెళ్ళుతున్నప్పుడు మీ సర్వశక్తులూ మీకు దూరమయిపోతున్నాయి. అవునా కాదా ?

శంక : కాదని ఎట్లా అనగలను ? డాక్టరుగా వృత్తిచేస్తున్నంత సేపు నేవేం చేస్తున్నానో నాకు తెలియటంలేదు. అనేకమయిన అనుమా

నాలు వస్తూవుంటాయి నాకు. రోగులని సరిగా -పరీక్షిస్తున్నానో లేదో తెలియదు. వాళ్ళపేర్లకి బదులు ఇరవైనాల్లుగంటలూ చెవిలో గింగురు మంటున్న నీ పేరు రాస్తున్నానేమో చీట్లమీద. అసలు స్టెతోస్కోపు లోంచి వినిపించేవి వాళ్ళగుండెకాయ చప్పుళ్ళకన్నా - నీ జ్ఞాపకంతోటే ధడధడలాడే నా గుండెకాయ చప్పుళ్ళేమో ! అసలు నాది మానవ శరీరంగా వుండడం మానేసి, ఏ తాంబూరలాగో, ఏ సితారలాగో తీగెల వాయిద్యం అయిపోయి, ఏ మాత్రం గాలిస్పర్శ తగిలినా అందులోంచి నీపేరే పలుకుతుందేమో అనిపిస్తోంది. నాయాతన నీకెలా అర్థమవుతుంది? నా జీవితంలోకి ఎందుకు ప్రవేశించావు ఉషా నువ్వు. అయినా నాకు పెళ్ళీ అదీ అయిపోయాక - ఇటువంటి కొరగాని సమయంలో ఎందుకు ప్రవేశించావు ? నా జీవితంలో -

ఉష : కొరగాని సమయమా ! ప్రేమలో పడటానికి ఏ సమయమూ కొరగానిదికాదు. ఏ ముహూర్తాన్నయినా, ఏ క్షణాన్నయినా, శుభముహూర్తంగా, మంగళసమయంగా మార్చేశక్తి వుంది ప్రేమకి. ప్రేమించటంలో అంత పవిత్రతవుంది.

నా జీవితంలో మీరు ప్రవేశించిన క్షణం నే బ్రతికున్నన్నాళ్ళూ జ్ఞాపకం వుంటుంది నాకు. ఆ క్షణంనుంచి జరిగిన ప్రతిహింశమూ నాకు అనుక్షణమూ తలపుకి వస్తూవుంటాయి. కాని అవన్నీ మీకు అజ వుండవు. జ్ఞాపకమూ వుండవు - జ్వరతాపంలో కొట్టుకుంటూ మంచం మీద పడివున్నానా నేను - డాక్టరు హోదాలో మీరు వచ్చారు నా దగ్గిరికి. మిమ్మల్ని పిలుచుకవచ్చాడు. వచ్చి దయగా చూస్తూ చెయ్యిపట్టుకున్నారు. నాడి చూశారు. మీరేదైనా మందిచ్చారోలేదోకూడా ఎవరికి తెలుసు ? రెండురోజులకే నాకు జ్వరం తగ్గింది. "నీకు బంధువులు ఎవరూ లేరా కాస్త కనిబెట్టివుండటానికి?" అని అడిగారు మీరోసారి. నా కళ్ళల్లో నీళ్లు నిండాయి. అసలు అప్పుడే చెబుదామనుకున్నాను. గట్టిగా-హృదయ పూర్వకంగా ఒక ముక్క చెబుదామనుకున్నాను. "జన్మజన్మాలకి మీ రొక్కరే నాకు బంధువులు" అని. కానీ-నాకు మాటరాలేదు. నిజంగానే-

ఏదో ఋణానుబంధంకాకపోతే, ఆరోజున వైద్యంచేయటానికి మీరే ఎందుకురావాలి ? ఎంతమంది డాక్టర్లు లేరు ఊళ్ళో ? కానీ - వాళ్లు మీరెలా అవుతారు ? నా పరిస్థితిచూచి మీరు నాకు నానా శుశ్రూషలు చేశారు. దుఃఖంతో కృశించిపోతున్న నా మీద మీరు అనురాగం అనే అమృతం పోశారు. వాడి ఎండిపోతున్నతీగె మళ్ళా వేళ్ళు పాతుకుంది. ఇప్పుడు నా జీవితంలో నువ్వెందుకు ప్రవేశించావు అని నన్నడుగుతున్నారు పైగా ?

శంక : ఆ ప్రశ్న నేను వెయ్యటంలేదు ఉషా ! నా దురదృష్టం వేయిస్తున్నది - నా ప్రేమ సర్వస్వమూ నీకు అర్పణచేసినా నేను వివాహితుణ్ణి. శారదసంగతి ఆలోచిస్తుంటే —

ఉష : మీ సుఖదుఃఖాల విషయంగా ఏర్పడిన సమస్యలు-యింకెవర్నోగురించి ఆలోచిస్తుంటే ఎలా తెములుతాయి ? ఆవిడ సమస్య ఆవిడ పరిలించుకోవాలి. మీ రెలా వదిలిస్తారు ?

శంక : నా కర్తవ్యం నెరవేర్చుకుని.

ఉష : అయితే కర్తవ్యం నెరవేర్చుకున్నంతమాత్రాన భర్త భార్యని సుఖపెట్టగలుగుతాడా ? ఆడది భర్తయొక్క ప్రేమను కోరుతుందేగాని కర్తవ్యపాలన ధర్మనిర్వహణాకాదు. ఇప్పుడు ఈ రెండు మూడు నెలలనుంచీ మీ కర్తవ్యానికి లోపం రానియ్యలేదుగా ? ఆవిడ సుఖంగా వుండామరి ? అంతకంటే మనం పెళ్ళిచేసుకున్నా —

శంక : (ఏదో కలలో కలవరించినట్లు) మనం....పెళ్ళి....చేసుకున్నా —

ఉష : ఆవిడ యిప్పటికంటే ఎక్కువ దుఃఖం అనుభవించదు. అందుకనే అసలు ఈ విషయాలన్నీ ఆవిడతోటే మాట్లాడి, ఆవిణ్ణి అడుగుదామని వచ్చాను.

శంక : ఏమని అడగాలనుకున్నావు ?

ఉష : నీ భర్త హృదయంలో ఒకమూల నాక్కూడా కాస్త చోటిమ్మనమని. నేనా కాస్తలోనే అమితం తృప్తిగా జీవిస్తాను. కాని ప్రాణాలను వేరుచేసి శరీరాన్ని బ్రతికించటంలాంటి పనిమాత్రం నాకు

పెట్టవద్దు. ఆయన్ని విడిచి నేను బ్రతకలేను. ఈ మాత్రం భిక్షపెట్టమనీ. అవసరమయితే ఆమె కాళ్ళమీదపడి వేడుకుందామనీ, నిర్ణయించుకొని వచ్చాను. ఏదో కులాసాగా కాలం గడుపుదామని, స్నేహితురాండ్రతో బయలుదేరిన నేను ప్రయాణం మధ్యలో బయలుదేరి తిరిగి వచ్చేశాను. మీరు చేయవలేకుండా కులాసాగా కాలం గడపటమనేది అసాధ్యమని తెలుసుకున్నాను. అంచేత ఆవిడ ఎదుటబడి ప్రార్థిద్దామని వచ్చేశాను.

శంక : కాని నువ్వు ప్రార్థించవలసిన అవసరం ఏం వుండేది కాదు ఉషా ! నువ్వు అడిగీ అడగ్గానే శారద సరే అనేది. ఆవిడ ఎప్పుడూ అభ్యంతరం పెట్టేదికాదు. తక్షణం అంగీకరించేది.

ఉష : అయితే యింకేం మరి ? లేవండి వెళ్ళొద్దాం.

శంక : కానీ—

ఉష : ఇంకా కానీ ఏమిటి ? మీరు ఎవరినిషయంగా ఆలోచిస్తున్నారో ఆవిడే సరే అన్నప్పుడు యింకా మీకు కానీ అంటారెందుకు ?

శంక : మనం ఏదేశంలో, ఏకులంలో, బ్రతుకుతున్నామో కొంచం జ్ఞాపకం తెచ్చుకో ఉషా ! రెండేసి పెళ్ళిళ్ళు చేసుకోకూడదని శాసనం చేయించేవరకు వచ్చారు, ఈ రోజున ఆడవాళ్లు. అటువంటి సమయంలో యిప్పుడు నేను రెండోపెళ్ళి చేసుకోనా ?

ఉష : శాసనాలు చేయించడానికి నడుములు కట్టుకొని ఉపన్యాసాలిస్తూ ఊరూరా తిరిగేవాళ్ళకి అసలు అయిన ప్రేమయంటే ఏంతెలుసు శంకరంగారూ ? యింతకీ ఈ సమాజం ఎవరిని దూషిస్తుంది ? నన్నా-కానీ యీ దేశపు సమాజాన్నిగురించి నేను లెక్కచేయను. నేను బాధ పడేది కేవలం అక్కయ్య విషయం.

శంక : అందుకనే నేనుకూడా ఆవిడతో ఆలోచించి ఒక నిర్ణయానికి వద్దామనుకున్నాను. ఆవిడతో మాట్లాడ్డానికనే నేను నాల్గయిదు రోజులు గడువుపెట్టాను.

ఉష : నిన్న ఒక్కరోజు మిమ్మల్ని చూడకుండా గడిపాను. అదే నాకు చాలొచ్చింది. ఇంకా నాల్గయిదురోజులు నేనుండలేను. పదండి యివాళే అడిగి వద్దాం. నన్ననవసరంగా హింసపెట్టకండి. లేవండి.

శంక : నువ్వు కాస్సేపు కూచో చెప్తాను. (ఉష కూచుంటుంది.) మనం కాస్త టీ తాగి ఆ తర్వాత ఆలోచిద్దాం ?

ఉష : టీయా ! నే చెయ్యనా ? ఆఁ ! నే టీ చేసి పట్టుకొస్తాను. ఇద్దరం తీసుకుందాం. ఏం ? (ఇంతట్లో గంట మోగుతుంది) వచ్చినవాళ్ళని త్వరగా పంపించెయ్యండి - సరేనా ? [మళ్ళా గంట మోగుతుంది. ఉష యింటిలోపలకు వెళ్ళుతుంది. చిదానందం ప్రవేశిస్తాడు]

చిదా : ఎవరది ? నువ్వేనా శంకరం ? ఏఁవిటిది ? ఆ మధ్య మనం కలుసుకున్నప్పటికీ, యిప్పటికీ యిలా అయిపోయావేమిటి ? ఏవయినా జబ్బా గిబ్బా చేసిందా ?

శంక : ఛ ! ఛ ! ఏంలేదు. అంతజబ్బు చేసినట్టు కనిపిస్తున్నానా ! నిజంగా ?

చిదా : విస్సందేహంగా అలాగే కనిపిస్తున్నావు సుమా !

శంక : అయితే అలా అవుపిస్తున్నానేమోగాని నన్ను పట్టుకున్నది జబ్బుకాదు.

చిదా : అట్లాగా ! అయితే పెద్దచిక్కేమి వుందిలే ! నేసీమధ్య భూతవైద్యం నేర్చుకున్నాను. ఎంత, ఎటువంటి దయ్యం, భూతం, పట్టుకున్నా, నే యిచ్చిన రక్షికట్టుకుంటే తక్షణం దూరంగా పారిపోతుంది.

శంక : ప్రతిమనిషీ పెద్ద మంత్ర వైద్యుడే. తననేదీ పట్టుకోనంతసేపూ - కాలేజీలో వున్నప్పుడు మిగిలిన కుట్టాళ్ళకి ఈ బాధపట్టుకున్నప్పుడు నేనూ మంత్రవైద్యుణ్ణే అని విర్రవీగేవాణ్ణి.

చిదా : అయితే ముమ్మరంగా వున్నప్పుడు తప్పించుకొని యిన్నాళ్ళూ హాయిగా తిరిగాక ఇప్పుడు పట్టుకుందన్నమాట నిన్నో దయ్యం ? ఏం చేస్తాం ? దైవ సంకల్పం కాబోలు ? నిన్ను చూస్తే నిజంగా జాలివేస్తున్నది శంకరం ! కానీ - ఫరవాలేదులే ! నా దగ్గిర బ్రహ్మాండమైన రక్షివుంది.

శంక : నీ దగ్గరవున్నది బ్రహ్మాండమయిన రక్షికాదు. ఉద్ధ్రభ్రమ ! ఈ పిశాచబాధ నిన్ను వట్టుకోలేదుగనుక తేలికగా మాటలతో

తోసేస్తున్నావు. చిన్నప్పటిరోగాలు తొందరగా కుదుర్తుతాయి. అలాగే చిన్నప్పుడే ఈ బాధ ఆవహిస్తే తొందరగా వదిలిపెడుతుంది. ముప్పై అయిదువేళ్ళు వచ్చాక యిప్పుడిది సోకిందంటే ఇది ఇహ ప్రాణంవుండగా వదిలిపెట్టదు. అవునూ నిన్ననగా వచ్చావుటకదూ ఊళ్ళోకి - అన్ని విషయాలూ తెలిసేవుంటాయి.

చిదా : ఆఁ ! అన్నీ తెలిశాయి నాకు. కానీ - నీకే యింకా అన్నివిషయాలు తెలిసినట్లులేదు. ఒకప్పుడు తెలుసున్నా యిప్పుడు మరచి పోయావోమరి. ఏదో రెండోపెళ్ళి చేసుకోవాలని ఆలోచిస్తున్నావటగా ? అంటే వ్యక్తిగతంగా నీకుండవలసిన జవాబుదారీ మరిచిపోయావన్న మాట ! ఆ అమ్మాయికీ కొన్ని సాంఘికజవాబుదారీలు వున్నాయి.

శంక : ఆ అమ్మాయికి సాంఘిక జవాబుదారీలు ఎంతమాత్రం ఉండాలో ఆవిడ విషయం పూర్తిగా తెలుసుకున్నతర్వాత తేల్చు. ఆ అమ్మాయి జీవితం ఎటువంటిదో నువ్వు వినలేదు కాబోలు. ఆత్మీయతా అనురాగములేకుండా బ్రతికిందిన్నాళ్ళు. బ్రతుకొక ఎడారిగా, జీవించడం ఒక రోతగా బ్రతికిందిన్నాళ్ళు. ఎంచేతనో తెలుసా ? అది దైవనిర్ణయం కాబట్టికాదు. మన సమాజంచేసిన అన్యాయంవల్ల. ఆ అన్యాయానికి బలి అయి ఆ సమాజాన్ని వదిలేసి దూరంగా ఉండవలసివచ్చింది. ఇప్పుడు ఆవిడికి జవాబుదారీలు ఎలావుంటాయి ? అంత మృదువైన హృదయం గల ఆ అమ్మాయి అంతటి కనికరం, వాత్సల్యంనిండిన అంతఃకరణగల ఆ అమ్మాయి ఎంతో కష్టమయిన జీవితం గడిపింది. అసలు నువ్వేకనక ఆవిడగాధ పూర్తిగా ఎనివుంటే - నువ్వు నాకంటే పిచ్చివాడివయిపోయి వుండేవాడివి. ఆ గాలి నిన్నే సోకివుండేది.

చిదా : ఆగాలి నన్ను సోకితే వచ్చిన పెద్దప్రమాదం ఏమీలేదు ! పైపై గా సులభంగా పరిష్కారం అయ్యేది వ్యవహారం. నేను పెళ్ళికాని వాణ్ణి ! - కానీ - నువ్వు—

శంక : కాని ఈ బాధ మన ఇష్టంమీద ఆధారపడి ఏర్పడదు.

చిదా : శంకరం !

శంక : ఎందుకు అనవసరంగా వాదించాలని చూస్తావు చిదానందం ! ఏం లాభంలేదు. నా నిశ్చయం మార్చుకోలేను నేను.

చిదా : ఇదిగిదిగో ! ఇప్పుడు నిన్ను మార్చటానికి వచ్చానని ఎవరు చెప్పారు సీతో !

శంక : ఎవరయినా పనిగట్టుక చెప్పాలా ఏమిటి ? శారద నీకు చెల్లెలుగదా ! నే నిప్పుడింకోపెళ్ళి చేసుకుంటే ఆవిడెంత దుఃఖిస్తుందో—

చిదా : దుఃఖించాలని ఎక్కడుందసలు ? నిన్నటినుంచి చూస్తూనే వున్నాను ఆవిడిని. హాయిగా తింటోంది. తిరుగుతోంది. నవ్వుతోంది. నవ్విస్తోంది. దీనికేం ! నిన్న రాత్రి చాలాసేపు సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ గడిపాం ఇంటిల్లిపాదీ. సినిమా కెళ్ళాం. హోటలు కెళ్ళాం. హాయిగా గడిపాం. ఏమోనబ్బా. నాకావిడ దుఃఖపడుతున్నటు ఎక్కడా కనుపించలేదు సుమా !

శంక : (ఎంతో విచారగ్రస్తంగా) ఆడవాళ్ళకుండే అభిమానం అటువంటిది. వాళ్ళ హృదయంలోవున్న విచారం ఎవరికీ కనుపించ వియ్యరు.

చిదా : ఇంతకూ శారద చిన్నప్పటినుంచీకూడా చాలా తెలివయినది. అన్నివేపులా ఆలోచించగలిగిన శక్తికలినది. అంచేత ఇప్పటి పరిస్థితినిగురించి అంత విచారపడ్డం అవసరం లేదనుకుందేమోమరి. అసలు ఆవిడ ఓ విధంగా అలోచించినా లోచించివుంటుంది. ఒక్కొక్క ఆడదా వికి అద్దాంతరంగా మొగుడు చచ్చిపోతుంటాడు. ఏంచేస్తాం ? అలాగే మనకీ ఎడబాటయిందనుకుందేమో ! ఒకేసారి నామొగుడు చచ్చిపోయాడు అనుకొని ఊరుకుందేమో !

శంక : బాగానేవున్నాయి నీ తెలివితేటలు. చచ్చిపోవడం సంగతి వేరు . అది తప్పించడం ఎవరి అధీనంలోనూ లేదు.

చిదా : అయితే ఇప్పుడీ పరిస్థితి తప్పించడంమాత్రం ఎవరి చేతుల్లోవుంది ? కనీసం ఆవిడచేతుల్లో ఏం లేదుగా !

శంక : అవును. అది ఆవిడచేతుల్లోనూ లేదు. ఇప్పుడింక నా

చేతుల్లోనూలేదు. లేకపోతే ఆనెడకి కష్టం కలిగించేలాగా ప్రవర్తించటానికి నే నిష్టపడేవాణ్ణిగాను.

చిదా : మళ్ళా అదేమాట మాట్లాడతాడు. ఇదిగో శంకరం ! భర్త రెండవపెళ్ళి చేసుకోగానే మొదటిభార్య : అమితంగా బాధపడిపోయి, దుఃఖసముద్రంలో మునిగి తీరుతుందనుకోనక్కరలేదు - తెలిసిందా ? భర్త రెండవపెళ్ళి చేసుకున్నాడని తెలియగానే అమ్మయ్యా అని శాంతంగా ఒక్క నిట్టూర్పు విడిచి ఉత్సాహంగా ఊరుకున్నవాళ్ళుండొచ్చు. బ్రతుకుజీవుడా ఇన్నాళ్లూ మన్ని పట్టుక పీడించిన శనిగ్రహం ఇప్పుడు ఇంకొకళ్ళ మెడమీద ఎక్కిందని తలచుకొని తృప్తిపడేవాళ్ళుండవచ్చు. అంటే నేను ప్రత్యక్షంగా చూడలేదనుకో అలాంటివాళ్ళని. కాని ఉండవచ్చుగా ! ఇంతకీ నువ్వు రెండోపెళ్ళి చేసుకుంటే, ఒకవేళ శారదకి కొంత మనశ్శాంతి ఏర్పడవచ్చేమోకూడా !

శంక : నువ్వేమన్నా అను చిదానందం ! ఇన్నాళ్ళూ నేను శారదని సుఖపెట్టాలనే ప్రయత్నం చేశాను కాని దుఃఖపెట్టాలని ఏపనీ చెయ్యలేదు.

చిదా : నిజమేనోయి ! ఎవరు కాదన్నారు ? అసలు ఇన్నాళ్ళూ నువ్వావిణ్ణి సుఖపెట్టికూడా వుండవచ్చు. అంచేత ఆవిడ ఇప్పుడు అమాంతం దుఃఖపడిపోతుందనుకోవడంమాత్రం పొరపాటు. ఒకవ్యక్తిని సుఖపెట్టాలంటే కొంత సామర్థ్యం కావాలి. కాని ఆ వ్యక్తిని దుఃఖపెట్టాలంటేమాత్రం ఇంకా ఎక్కువ సామర్థ్యంకావాలి. ఒకొక్కళ్ళతో సహవాసం సుఖంగానే వుండవచ్చు. కాని హృదయంలోకి చొచ్చుకుపోయే అన్యోన్య స్నేహం సామరస్యంతో తీసుకురాలేకపోయాక ఆ సహవాసం తప్పిపోతేమాత్రం విచారం ఏముంటుంది ? ఇంతకీ ఎందుకులే ఇవన్నీ— నేను శారదకి ఏర్పడే దుఃఖపరిస్థితి వినిపించాలని రాలేదు నీదగ్గరికి. నీ స్నేహితుణ్ణిగదా అని వచ్చాను. (కాలర్ సవరించుకుంటూ) సంఘంలో కొంతపలుకుబడి సంపాయించుకున్న దూతగా వచ్చాను ! భార్య బ్రతికి వుండగా రెండోభార్యని కట్టుకోవాలని తహతహలాడే మిత్రుణ్ణి—

"నాయనా ! ఎందుకోసం ఈ పెళ్ళి చేసుకుంటున్నావు ?" అనేప్రశ్న అడిగిపోదామని వచ్చాను !

శంక : అడుగు ! నీ ప్రశ్న నువ్వు మహారాజులా అడుగు. కాని దూతగా అయినా మిత్రుడిగాఅయినాసరే అడగకూడని ప్రశ్నలున్నాయి. అందులో ఒకటి పెళ్ళి ఎందుకు చేసుకుంటున్నావన్నది. అది వ్యక్తిగత మయిన వ్యవహారం ! అందులో సంఘానికీ మిత్రులకీ ఏమీ సంబంధం లేదు.

చిదా : అట్లాగా ! అయితే నువ్వు ఇదివరలో నీకుండే అభిప్రాయాలూ నమ్మకాలూ పూర్తిగా మార్చుకున్నావన్నమాట ఈ మధ్య ? ఇదివరకు పెళ్ళిఅనేది ఒక సంఘసాంప్రదాయమని గుర్తించావు ! నువ్వు మొట్టమొదట పెళ్ళిచేసుకున్నప్పుడు ఊరందరినీ పిలిచావు ! వెయ్యిమందికి భోజనం పెట్టావు. కొంతమంది పంపించిన పెళ్ళిగ్రాములు చదివి వినిపించావు ! స్నేహితులిచ్చిన బహూమతులు దణ్ణం పెడుతూ స్వీకరించావు ! అందరూవేసిన అక్షింతలకి తలవొగ్గావు ! అప్పుడు పెళ్ళిఅంటే వ్యక్తిగతమయినదనీ చాలా ప్రైవేటు వ్యవహారమనే ఆలోచన ఉండేదికాదు ! నన్ను మోసం చెయ్యాలని చూస్తున్నావా ? నిన్ను నువ్వు మోసం చేసుకుంటున్నావా ? పెళ్ళి అనేది ప్రైవేటు వ్యవహారమని ఎవరో చెప్పింది ? ప్రేమ అనేది ప్రైవేటు వ్యవహారం వ్యక్తిగతమయినదీ అంటే ఆను. ఒప్పుకుంటాను.

శంక : ఏవిటేవిటీ ? ఇప్పుడింతకీ మీమాంసయొక్క ఫలితం ఏమిటంటే, నీ చెల్లెలు నా పెళ్ళిపెళ్ళాం కనుక, నే నావిడతో సంసారం చేస్తూ, ఇంకొకర్ని ప్రేమించినా అభ్యంతరం పెట్టనంటావు.

చిదా : ఏమాత్రం అభ్యంతరం పెట్టటానికి వీల్లేదు. ఎంచేతంటే ప్రేమించటం వ్యక్తిగతమయినగొడవ. వ్యక్తిగతమయినభావన ! దాన్ని గురించి ఎవరూ ఎసర్నీ సంజాయిషీ అడగడానికి వీల్లేనిది ! కాని నువ్వు ఇప్పుడు వ్యక్తిగతమయిన భావనకి ఒక చట్ట సమ్మతమయిన సంబంధం ఏర్పరచాలని చూస్తున్నావు ! దానికి ధర్మశాస్త్రంయొక్క మాన్యతా, సంఘంలో ఒక ప్రతిష్టా ఏర్పడుద్దామని ప్రయత్నిస్తున్నావు. వీటిలో

ఏ ఒక్కటీకూడా వ్యక్తిగతమయిన హంశంకాదు. అటువంటప్పుడు, ఎంతో ప్రైవేటు వ్యవహారమయిన నీ ప్రేమకి వీటన్నిటి అవసరం ఏం వచ్చిందో చెప్పు ? నీకు ప్రేమించాలనివుంటే ఏ సంకోచంలేకుండా ప్రేమించుకో, అసలు నీ ప్రేమకి ఆ మాత్రం పుష్టి, ఓజస్సు, ఉద్వేగం ఉంటే ఈ ధర్మానికి, చట్టానికి, సంఘానికి దేనికి లెక్కచేసేదికాదు. అమాంతం ఆ వ్యక్తిని ఎత్తుకొచ్చి తక్షణం కాపురం పెట్టుకొని సుఖంగా జీవించేలా చేసేది నిన్ను !

శంక : అయితే అలాగేచేసి నీ చెల్లెల్ని వంచించమంటావా ?

చిదా : ఇందులో వంచన ఏముంది ? ఆవిడతో చెప్పే చేసుకో. ఇంతకీ ఇప్పుడు చెప్పాల్సిన అవసరమూలేదు ! నీ ప్రేమవృత్తాంతమంతా ఆవిడకి ఇదివరకే తెలిసిందిగా ? అంచేత నీ ప్రేమ సమస్యని నువ్వు వ్యక్తిగతంగా పరిష్కారం చేసుకో ! ఇహ ఆవిడ వ్యక్తిగతమయిన సమస్యల్ని (కొంచం ఆగి) ఎక్కడో నౌకరీ చూచుకుంటుంది!

శంక : ఆవిడిని పోషించడం విషయంలో నాకున్న జవాబు దారీని నేను తప్పించుకోవాలనే కోరిక ఎన్నడూ లేదు నాకు !

చిదా : అయితే బాధేలేదు ! కూటికీ, గుడ్డకూ అయ్యేఖర్చు నువ్వు భరిస్తావు కనుక ఆడదానికివుండే ముఖ్యమయిన అవసరాల్లో ఒకటి తీరిపోతుంది. ఇహ రెండవది మాతృత్వపు సమస్య ! అది మళ్ళా వ్యక్తిగతమయింది. అంచేత ఆవిడే వ్యక్తిగతంగా ఏదో ఏర్పాటు చేసుకుంటుంది. దాంతో మన కెవ్వరికీ సంబంధంలేదు.

శంక : అవతలి యిల్లాలు నీకు స్వయంగా చెల్లెలన్నసంగతి మర్చిపోయి మాట్లాడుతున్నావా చిదానంద ?

చిదా : మరిచిపోలేదు శంకరం ! నేను మాట్లాడుతున్నది నా చెల్లెలు అన్న దృష్టితోకాదు. మొగుడువదిలిపెట్టిన ఒక ఆడచనేదృష్టితో ! ఆడదానికి పిల్లలను కనాలనే ప్రైపత్వపు కోరిక వుంటుందని ఆలోచించటానికికూడా భర్తవైన నీకు ఈనాడు అసహ్యంగావుంది. కాని నీకు మాత్రం యింకో ఆడది కావాలనే—

శంక : చిదానంద్ ! స్నేహితుడవని ఇచ్చిన చనువుని, హద్దులు అతిక్రమించి దురుపయోగం చేస్తున్నావు.

చిదా : నిజమే ! కాని హిందూ వైవాహికపద్ధతులు ఇచ్చిన స్వాతంత్రాన్ని, హద్దులుమీరి నువ్వూ చాలా దుర్వినియోగం చేస్తున్నావు ! ఈ క్షణంలోకూడా బూజుపట్టిన ఆ హిందూ వైవాహిక సాంప్రదాయాన్నే శరణ్యం చేసుకోవాలనుకుంటున్నావు. ఆ సంస్థలోనూ, సాంప్రదాయంలోనూ, ఉన్నస్వేచ్ఛని స్వచ్ఛందంగా వుపయోగించుకోవాలనుకుంటున్నావు. నిన్ను పవిత్రుణ్ణి, ధర్మబుద్ధుణ్ణి చేయటానికి కావలసినవి కేవలం ఇద్దరు సాక్షులు. ఒకడు పురోహితుడు, రెండవవాడు అగ్నిదేవుడునూ ! పురోహితుడిది నరంలేని నాలిక. నాలుగురూపాయలు చూపిస్తే నీ యిష్టం వచ్చినట్లు వాగుతుంది. ఇహ అగ్నిదేవుడికి సహజంగానే ఏడు నాలికలు. పైగా అతడే యిద్దరుపెళ్ళాల మొగుడుకూడాను. ఇంక నీకు తక్కువ ఏమిటి ?

శంక : (చిదానందం తాకిడికి దద్దరిల్లిపోయి ఏదో చెప్పాలని ప్రయత్నిస్తాడు.) అదికాదు చిదానందం !

చిదా : (అతని స్థితి గ్రహించి) ఇప్పుడవస్నీ ఎందుకులే శంకరం ! ఇంతకీ నిన్ను వాదనలో ఓడించాలనే ఉద్దేశంతో రాలేదు నే విక్కడికి. స్నేహితుడినికదా చేతనయిన సహాయం చేద్దామనివచ్చాను. తోచిన సలహా యిద్దామని వచ్చాను. అసలు నీ గొడవ ఏమిటో, నీ మనస్సు ఏమిటో, నీ ముఖతా తెలుసుకొని, నువ్వూ సుఖంకోసం పాకులాడుతూ కళ్ళుమూసుకుపోయి ఎక్కడయినా గోతిలో పడిపోతావేమో జాగ్రత్తగా వుండమని హెచ్చరించి పోదామనివచ్చాను.

శంక : (మళ్ళీ ఎప్పటి జోరుతో) కళ్ళుమూసుకొని ఒకపెళ్ళి చేసుకున్నప్పుడు గోతిలో పడనేపడ్డాను. ఇంకోసారికూడా పడతానా ?

చిదా : ఎందుకు పడకూడదూ ? ఇది ప్రేమవివాహం కనుకనా ?

శంక : అవును !

చిదా : ఎంతభ్రమ పడుతున్నావోయి ! ప్రేమవివాహం చేసుకో

గానే సౌఖ్యం దానంతట అది ఒళ్లో పడిపోతుందనా ? నీ అంచనా ? అట్లాంటి దృష్టాంతరాలేమయినా వున్నాయా ?

శంక : నా అంచనా నా హృదయంలోవున్న ఉద్దేశ్యాన్నిబట్టి— నాకింకేం దృష్టాంతరాలక్కరలేదు !

చిదా : మొత్తంమీద నీ భవిష్యత్తు అంతా ఆనందమయంగా గడిచిపోతుందని నీకు గట్టినమ్మకమే వున్నట్లుంది. జూదమాడేవాడికి ప్రతివాడికి యిట్టాంటి పిచ్చినమ్మకమే వుంటుంది. లాటరీ టిక్కట్టు కొనేవాడికి ప్రతివాడికీ ఫస్టుప్రైజు తనకే వస్తుందనే మూఢవిశ్వాసం ఒకటి పట్టుకుంటుంది.

పెళ్ళిలాంటి జూదం ప్రపంచకంలో యింకేదీలేదు. అందులోనూ ప్రేమ వివాహం అంటే ఒకటే ఒక పందెంమీద సర్వస్వమూ కాయడం అన్నమాట. గెలిస్తే మాభాగే ! లేకపోతేమాత్రం సర్వమూ నాశనమయి పోతుంది. ప్రేమ వివాహంలో, విడిపోవడం, వదిలిపెట్టడం అనేవి అక్కరికి రావు ! అంచేత ఆలోచించి మరీ చేసుకో ! ఒకపెళ్ళి చేసుకొని, ఒక పందెం పోగొట్టుకున్నావు. ఇప్పుడయినా జాగ్రత్త !

శంక : చిదానంద్ ! ఇవన్నీ నేను ఆలోచించాను. పెళ్ళి అనే జూదం మనుష్యుడు దైవంతో ఆడుతాడు ! గెలుస్తే సుఖపడతాడు. ఓడిపోతే కష్టపడతాడు. కాని ప్రేమ అనేజూదం మనుష్యుడు తన జీవితంతో ఆడతాడు. గెలుస్తే బ్రతికిపోతాడు బ్రహ్మానందంగా—ఓడిపోతాడా ! అంతటితో ఆ జీవితం సమాప్తి అన్నమాట.

చిదా : అవునుగదా ! ఇప్పుడు నీకు పట్టుకున్న సమస్య— ఒక్కప్రేమనుగురించి కాదు—పెళ్ళిది కూడానూ ! ప్రేమే అయితే నువ్వు గెలిచేవాడివేమో ! కాని పెళ్ళిలో తప్పకుండా ఓడిపోతావు.

శంక : అయితే యివేవీ నే ఆలోచించుకోలేదనేనా నీ అభిప్రాయం ? నేను ఈసారి పెళ్ళిలోకూడా ఓడిపోను.

చిదా : నువ్వు ఓడిపోవనే ఒప్పుకుందాం పోనీ ! కానీ . ఆ అమ్మాయి సంగతేమిటి ? ఆవిడకి యిది మొట్టమొదటిసారి. ఆడదిగనుక

ఆఖరిసారిగూడాను. మొగాడికి ఒక పందెంపోతే రెండవపందెముంది. కానీ – మొదటిపందెంలో గెలవకపోతే మానప్రాణాలతోసహా భస్మమయిపోతుంది ఆడది. నీకేం ? నువ్వు — అనుభవమున్నవాడివి. ఆ అమ్మాయి అమాయకురాలు. ఎంత ప్రాణాపాయమయిన జూదంలో ప్రవేశిస్తోందో ఆవిడ వూహించికూడా వుండదు.

శంక : (నవ్వి) చిదానంద్ ! నీకిప్పుడు నీ చెల్లెలు సౌభాగ్యాన్ని గురించిన ఆలోచనకంటే నాకాబోయే భార్యనుగురించి ఎక్కువ ఆందోళనగా వున్నట్లుంది.

చిదా : ఊహ వచ్చినప్పటినుంచీ విశ్వకుటుంబిని నేను. ఈవిడ నా సొంత చెల్లెలు అనీ, ఆవిడ నాకు వరస చెల్లెలు అనీ, మరోస్త్రీ నా చెల్లెలేకాదనే భావన నా కెన్నడూలేదు. నా దృష్టికి కాదవ ఎంతో ఉషా అంటే ! ఏస్త్రీని అయినా స్త్రీజాతిలో ఒకవ్యక్తి అని ఎన్నడూ పరిగణించను నేను. ప్రతి స్త్రీ ఒకశక్తి స్వరూపిణి అనే భావన నాది. సృష్టించడం, సంరక్షించడం, అనే దివ్యమయిన రెండుకార్యాలు స్త్రీకి సహజ శక్తులు. కాని అటువంటి శక్తిస్వరూపిణి అయిన స్త్రీ తన పవిత్ర ధర్మాన్ని నిర్లక్ష్యంచేసి మరొకరి కాపురం ధ్వంసం చెయ్యడంలో నిమగ్న అయితే అప్పుడా స్త్రీకి దైవత్వంపోయి భయంకరమైన రాక్షసత్వం ఆవహిస్తుంది. అంచేత సహజ సౌకుమార్యం, దయార్ద్ర హృదయంగల ఒక స్త్రీకి నీ భార్య కాపురాన్ని నాశనం చెయ్యడంలో దోహదం చెయ్యకు. అది ఎవరికీ క్షేమంకాదు. సౌఖ్యం యివ్వదు.

శంక : అయితే నేనే ఆ అమ్మాయిని నన్ను పెళ్ళిచేసుకోమని పురికొల్పినట్లు మాట్లాడుతున్నావేమిటి ?

చిదా : అయితే ఆ అమ్మాయే నిన్ను పురికొల్పిందా ఏమిటి ? ఆవిడ బలవంతం పెట్టింది కనుక నువ్వీపెళ్ళికి సిద్ధపడుతున్నావా ?

ప్రేమోద్రేకంతో పెళ్ళికోసం ప్రాకులాడితే ఆ ప్రసక్తివేరు. ఆ అమ్మాయి ప్రేమించింది. పెళ్ళి కావాలంటోంది. ఆవిడ యింతవరకూ కుమారికనుక ఆవిడకి ఆ హక్కువుంది. నువ్వింతకు ముందు పెళ్ళిలో

"నాతిచరామి" అని ప్రమాణం చేసినవాడివి. నీ కా హక్కు ఎక్కడ వుంది ?

శంక : ఈ విషయాలన్నీ ఆవిడతో చర్చించలేదనుకుంటున్నావా నేను ? ఆవిడని ఈ పెళ్ళిప్రయత్నం నుంచి తప్పించడానికి నేను ప్రయత్నించనే లేదంటావా ?

చిదా : నువ్వు ప్రయత్నించి వుండవచ్చు. వుత్తి నోటిమాటలతో ప్రయత్నించి వుండవచ్చు. క్రియారూపకంగానూ, హృదయపూర్వకంగాను ప్రయత్నించి వుండవు. ఎంచేతంటే ఒకవ్యక్తి మనపై అపారప్రేమ కలిగివుందని తెలియగానే మనకు ఎక్కడలేని తృప్తి ప్రేమా పుట్టుకొస్తాయి. మనకున్న అహం అంతా ఒకసారి గర్వంతో లేచి నుంచొని ఒళ్ళు విరుచుకుంటుంది. నువ్వా అహంభావానికి లొంగిపోయి అదంతా ఆవిడమీద ప్రేమ అనుకుంటున్నావు. అది ఆవిడమీద నీకున్న ప్రేమకాదు. నీమీద నీకున్నప్రేమ. ఈ కారణంగా పెళ్ళి నిశ్చయించుకొని, దానికి జవాబుదారీ అంతా ఆ అమ్మాయిమీదే పడేస్తున్నావు. పాపం పిచ్చిపిల్ల !

శంక : ఆ ఉష పిచ్చిపిల్లా చిదానంద్ ! ఒరలోంచి బయటికి దూకిన కత్తిలాంటి పిల్లని, పిచ్చిపిల్ల అంటున్నావా ? పెళపెళమంటూ గర్జిస్తున్న ప్రళయ జీమూత మేఘాల్ని పెగల్చుకొని మిరుమిట్లుకొల్పుతూ బయటికురికి, అందరికళ్లూ జిగేలుమనిపించే విద్యుల్లతని నువ్వు పిచ్చి పిల్లంటున్నావా ?

ఆవిడ గడతేరిన దుఃఖపరంపర సుడిగుండాల్లో యింకెవరైనా పడివుంటే నామరూపాలులేకుండా నాశనమయిపోయేది. కాని - ఆ పిల్ల ఉష గనుక—

చిదా : (హతాశుడై) నిజమే ! నువ్వందాక చెప్పినసంగతి చాలా వాస్తవము. నేనది గ్రహించలేదు. కాలేజీలోవున్నప్పుడు శాకినీ ఢాకినీ దయ్యాలు పదహారేళ్ళ పడుచుల్లా వచ్చినా నిన్ను పట్టుకోలేక పోయాయి. ఇప్పుడు యీ అమ్మాయి అచ్చితంగా పదహారేళ్ళకి పైబడ్డ పడుచే - కాని - నిన్ను మంచి పకడ్బందీగా పట్టిందీ పిశాచం.

ఒకసారి నేకూడాచూస్తే బాగుండేది ఆ స్వరూపాన్ని ! (ఉష అతి త్వరగా ముందుకు వస్తుంది)

ఉష : టీ తీసుకుంటారా ! (ఇద్దరూ గాభరా పడతారు)

శంక : ఇతడు నా స్నేహితుడు. ఇప్పుడే వచ్చాడు వాళ్ళ వూరు నుంచి.

ఉష : కాలేజీలో వున్నప్పటినుంచీ మీ స్నేహితుడు కాబోలు. అందుకే అప్పటి మీ పరాక్రమం అంతా వర్ణిస్తున్నాడు. ఇంకా ఏ శాకినీ ఢానికీకూడా యీయన్ని పట్టుకున్నట్టులేదు.

శంక : ఇంతవరకూ పట్టుకోలేదు మరి. యిహ ఇప్పుడు ఈయన విశ్వాకుటుంబి లోకభ్రాత అయి కూర్చోటంవల్ల ఆ అవకాశమూ లేదనే చెప్పాలి. (పరిచయంచేసే వుద్దేశంతో) చిదానంద్ ! ఈవిడ ఎవరో నువ్వూహించే వుంటావు. కుమారి ఉష !

ఉష : ఒరలోంచి బయటకురికిన కత్తి.

చిదా : నమస్తే ! ఇందాకటినుంచీ మీగురించే మాట్లాడుకుంటున్నాం !

ఉష : విన్నాను. ఈయనగారిని పిశాచం పట్టుకొని బాధపెడుతున్నదిటగా ! అదీ విన్నాను.

చిదా : మనిషయిపుట్టి, చదువు, సంస్కారం అబ్బినతర్వాత కూడా ఒకవ్యక్తి తన వ్యక్తిత్వపు బాధ్యతనీ, సంఘ సాంప్రదాయాన్ని మరచిపోయినప్పుడు, దెయ్యం పట్టిందనుకోక యింకేం అనుకుంటాం ? ఉషాదేవీ, మీరుకూడా ఈ సంఘ నియమాలనుగురించి ఒక్కనిముషం ఆలోచిస్తే మంచిదని నా మనవి.

ఉష : మీ సంఘనియమాలనుగురించిన ఆలోచన నాకెందుకు ? ఆచరణలోలేని నియమాలూ, అర్థంలేని కట్టుబాట్లూ పెట్టుకొని అస్తవ్యస్తంగా నడుస్తున్న మీదేశపు సంఘంతో నాకేమిటి అవసరం ?

చిదా : మీరీ దేశంలో పుట్టిపెరిగిన వారేగా !

ఉష : పుట్టాలేదు. పెరగాలేదు. చుట్టంచూపుగా వచ్చానంతే నే పుట్టి పెరిగినదేశంలో యిలాటి అర్థంలేని ఆంక్షలు లేవు.

చిదా : అంటే ఏవిధమయిన సంఘనిబంధనలూలేవా ? మీరు పెరిగినచోట ?—అక్కడి సంఘమూ, సమాజము వున్నాయిగాని, నిబంధనలు ఏవీ లేవన్నమాట ! ఇది సాధ్యమేనా ?

ఉష : ఏ బంధనాలూ లేకుండా సంఘమూ సమాజమూ వుంటాయో లేదో నాకు తెలియదు. ఏవో కొన్ని నిబంధనలుంటే వున్నా యేమో ! కాని ఈ దేశంలోలాగా ఆడవాళ్ళనిమట్టుకే హింసలుపెట్టే నిబంధనలుమాత్రం నిశ్చయంగా లేవు మాదేశంలో.

చిదా : ఏదేశం చెప్పమ్మా అది ? ఏ దేశమోయి శంకరం !

ఉష : ఆయన్ని అడగటమెందుకు ? నేనే చెప్తాను ! బర్మా దేశం !

చిదా : బర్మాదేశమా ! మరయితే మీరు యిక్కడికి—

ఉష : ఊరికేనే ! మీ స్నేహితుడ్ని పిశాచినై పట్టుకోవడానికి పచ్చానంతే !

చిదా : అయినా ! తెలుగు బాగానే మాట్లాడుతున్నారే—

శంక : ఆవిడ మాతృభాష తెలుగేలే !

చిదా : ఓహో ! అట్లానా ! అయితే మీ తల్లీ తండ్రీ మీతో బాటు రాలేదా ఏమిటి ? మీరొక్కరే వచ్చారని చెప్పాడు శంకరం ! వాళ్ళాదేశంలోనే వుండిపోయారు కాబోలు.

ఉష : లేదు ! వాళ్ళు భూమిమీదే లేరు.

చిదా : ఆఁ ! అట్లాగా ! క్షమించండి. నే నట్లా అనుకోలేదు. అయితే యిక్కడ యింకెవరయినా బంధువులూ వాళ్ళూ వున్నారా ?

ఉష : ఎవరికి తెలుసు ?

చిదా : పోనీ భోగట్టా చేద్దాం.

ఉష : ఎవరిక్కావాలి ఆ భోగట్టా అంతా ? మా అమ్మవేపు చుట్టాలంతా అక్కడే వుండేవారు. ఇప్పుడంతా పోయారు.

చిదా : అయితే బర్మాలో మీ మాతామహులుండే వారన్నమాట. మీ యింటిపేరు ఏమిటి ?

ఉష : పోతాప్రగడవారు.

చిదా : పోతాప్రగడ గోవిందరావు అని నాకు తెలిసినాయన ఒకరుండాలి బర్మాలో !

ఉష : మా మేనమామ ఆయన.

చిదా : ఏవిటీ ! ఆయనకి ఒక్కతే చెల్లెలుండేది శారదాదేవి అని !

ఉష : ఆవిడే మా అమ్మ !

చిదా : అయితే మీ యింటిపేరు పోతాప్రగడ ఎట్లా అవుతుంది ? ఆవిడ యింటిపేరు పెనుగొండవారు అని వుండాలి.

ఉష : ఒక్కప్పుడుండేది. కాని అది అత్తవారి యింటిపేరు. ఆవిడ బర్మావచ్చాక పుట్టియింటిపేరే మళ్ళా పెట్టుంది.

చిదా : ఎంచేత ?

ఉష : తనని వదిలిపెట్టిన భర్తయొక్క ఇంటిపేరు ఇంకా తను మొయ్యటం ఎందుకని ? తర్వాత తర్వాత ఆవిడ కుంకమకూడా పెట్టుకోవడం మానేసింది.

చిదా : మీ అమ్మగారు ఆ పేరు వదిలేసుకున్నా మీతండ్రిగారి యింటిపేరు మీకెలా తప్పుతుంది ? ఆ వంశంలో అంకురించాక తండ్రి అంటే అభిమానం వుండదూ మీకయినా ?

ఉష : నే నెన్నడూ చూడని తండ్రి అంటే నా కెలా అభిమానం వుంటుంది ? ఇంతకీ నే నొకత్తెనున్నానని తెలుసో లేదో ఆయనకి.అటువంటప్పుడు, ఆయన ఇంటిపేరుతో నే నెందుకు ఊరేగాలి ?

చిదా : (ఆశ్చర్యంగా) మీరున్నట్లుకూడా ఆయనకి తెలియకుండా ఎందుకుపోయింది ?

ఉష : తెలియడానికి అవకాశం లేదుగనుక. ఆయన రెండోపెళ్ళి చేసుకున్నాడని కోపగించి మా అమ్మ మా మామయ్యదగ్గిరికి వచ్చేసింది బర్మాదేశానికి. ఆతర్వాత ఆరేడునెల్లకి నేను పుట్టాను. అంచేత తనకో కూతురున్నట్లు ఆయనకి తెలియకపోవచ్చు. పైగా ఆయనమాత్రం బ్రతికి వున్నాడో లేదో ఎవరికి తెలుసు ?

చిదా : బ్రతికేవున్నారు.

ఉష : ఉన్నారా ? ఎక్కడ ? అయినా ఎక్కడుంటే నాకేం ? ఆయన నా తల్లి జీవితాన్ని నాశనంచేశారు. ఆయనముఖం చూడాలని కూడా నాకు కోరికలేదు.

చిదా : అవునులే ! ఆయన నీ తల్లిజీవితాన్ని నాశనం చేశారు. నువ్వు ఇప్పుడు ఆయనకూతురు జీవితాన్ని నాశనం చేస్తున్నావు.

ఉష : ఏంవిటది ? డాక్టరుగారి మామగా రా నా తండ్రి ?

శంక : చిదానంద్ ! ఏంవిటిది ! ఏంవిటిదింతా ?

చిదా : ఇది విధి విధించిన చిద్విలాసం. ఈ దెబ్బకి నేనుకూడా తట్టుకోలేకుండా వున్నాను.

— తెర —

మూడవ అంకం

[ఉష ఉంటూ వున్నయిల్లు. ఒకవేపు రేడియో - రెండోవేపు తెర లోంచి కనబడే మంచం. ఎడమచేతివైపు గోడదగ్గిర ఒక డ్రస్సింగు టేబిలు. కుడిచేతివేపు గోడనానుకొని ఒక బిల్లమీదవున్న బుద్ధవిగ్రహం. కుర్చీలు, టేబిలు వగైరా ఫర్నిచరు - తెర ఎత్తినప్పుడు రేడియోలో నుంచి పాట వినిపిస్తూ వుంటుంది. చైతన్యదేవూ, ఉషా వింటూ కూర్చొని వుంటారు. కాని ఉష ధ్యాస పాట మీదలేదు. వున్నట్లుండి విసుగ్గా మాట్లాడుతుంది.]

ఉష : అబ్బ ! చాలు బాబూ యీ పాట —

చైత : (ఆశ్చర్యంగా) అమ్మాయీ ! ఇవాళ పాట అన్నాకూడా ఇష్టంగా లేదా ?

ఉష : ఇవాళ నాకు దేనిమీదా యిష్టం ఉండటంలేదు.

చైత : పోనీ ! నీకు యెప్పుడూ నచ్చేపాట పెడ్తానుండు గ్రామ

ఫోనులో : [చైతన్యదేవ్ రికార్డువేస్తాడు. కాని దాని పరిణామం వ్యతిరేకంగా వుంటుంది. ఉష ఆ పాట వింటున్నకొద్దీ చిరాకుపడుతుంది. చివరకు పాట అయిపోవస్తుంది. అవగానే]

ఉష : ఆపేదూ బాబాయి !

చైత : ఏమమ్మా ! రోజూ నచ్చేపాటకూడా కష్టంగా వుందా యివాళ నీకు ? సంగీతమంటేకూడా యిష్టంపోయిందా ?

ఉష : (తనలో తాను మాట్లాడుకుంటున్నట్టే) సంగీతం అంటే ఏమిటసలు ? ఏడుస్వరాలని అటూ ఇటూ సర్ది పలికించటం. అవిసరిగా కుదురుతే సంగీతం-వినటానికి మధురంగా వుంటుంది. కొంచంతప్పుతే క్రూరంగానూ, ఘోరంగానూ వినిపిస్తుంది. జీవితంకూడా అంతే ! ఏవో కొన్ని భావనలను పోగుచేసుకొని ఒక మానసిక భవనం నిర్మిస్తాం. అందులో ఏ భావం ఓటిదయినా, భవనమంతా మనెత్తినే కూలిపోతుంది.

చైత : ఏమిటమ్మా నీకు ఏర్పడిన కష్టం ? రెండ్రోజులు ధైర్యంగా వుండు. దేవుడుకూడా నిన్నుగురించి ఆలోచిస్తూనే వుంటాడు.

ఉష : లేదు బాబాయి ! ఆయన ఆలోచించటంలేదు. (ఏడుస్తూ కూచుంటుంది)

చైత : (దగ్గిరకువచ్చి కూర్చుని) నీ బాధ నా కర్థమవుతుందమ్మా ! పెళ్ళిసంగతి ఆలోచిస్తున్నావు - నిన్నటినుంచి మరీ ఎక్కువగా ఆలోచిస్తున్నావు. (నవ్వుతో) ఇంక యిప్పుడు తొందరలోనే జరిపిస్తాలేమ్మా ! ఆ డాక్టరునే చేసుకుందువుగాని.

ఉష : (కళ్ళు తుడుచుకుంటూ) మీ రనుకుంటున్నంత సులభం గాదు బాబాయి ఆ పెళ్ళి ?

చైత : ఎంత కష్టమయితేమాత్రం ఏం ఫరవమ్మా ! నేను డాక్టరు తోటి అప్పుడే చెప్పేశానులే తొందరలో పెళ్ళిచేసుకోమని. ఇపుడతని మామగారువస్తే ఆయనతోకూడా నువ్వు చెప్పేసెయ్యి. ఆ డాక్టరునే చేసుకోవాలని.

ఉష : (విచారంతో) డాక్టరుగారి మామగారిని కలుసుకొని నేనా

డాక్టరునే పెళ్ళిచేసుకుంటానని చెప్పనా ! ఎలా చెప్పను ? ఏమను కుంటారాయన నన్నుగురించి ?

చైత : ఆయన యిష్టంవచ్చినట్లు అనుకోనీ. నువ్వు ఆయనతో యివాళే మాట్లాడెయ్యటం మంచిది. ఆయనకీ ఆయనకూతురు విషయం బెంగ. నాకు నువ్వంటే బెంగాను.

ఉష : ఆయన కూతురునిగురించి బెంగ ! ఆయనకూతురు ? (ఎంతోదీనంగా) బాబాయ్ ! పోనీ నేనాయన్ని చూడటం యివాళ వద్దులే బాబాయి !

చైత : ఎలాగమ్మా ! నే నిదివరకే ఆయనతో ఒప్పుకొని వచ్చేశాగా ? అంచేత యివాళ మాట్లాడాలిలే. నేనింకోసారి ఆయన దగ్గిరకు వెళ్ళి రమ్మనమని చెప్పివస్తాను. కొంచంసేపటికల్లా వచ్చేస్తాను. (గంట వినిపిస్తుంది)

ఉష : రండి ! (చిదానంద్ వస్తాడు. అతనిచేతిలో న్యూస్ పేపరులో చుట్టబెట్టిన వస్తువేదో వుంటుంది) వచ్చి కూచోండి. (చిదానంద్ ఉషవేపూ, చైతన్యదేవ్‌వేపూ చూస్తాడు. ఆ చూపు గ్రహించి) ఈయన చిదానంద్‌గారు ! చాలా గొప్ప సోషల్‌వర్కర్. ఈయన చైతన్యదేవ్ ! బర్మాదేశంనుంచి నేను యిక్కడకువచ్చిన ప్రయాణంలో నన్ను కాపాడి కూడావచ్చిన స్నేహితులు ! (చిదానంద్ చైతన్యదేవ్ ఒకరికొకరు నమస్కరించుకుంటారు.)

చైత : అయితే అమ్మాయీ నేనువెళ్ళి త్వరలోనే వచ్చేస్తా— (వెళ్ళబోతూవుంటే—)

చిదా : ఇదేమిటి ? నేను మీ సంభాషణలకి అడ్డువచ్చినట్లున్నాను. మీరు మాట్లాడుకోండి. నే నింకొంచంసేపుండి మళ్ళా వస్తాను, పోనీ !

ఉష : మీరేం అడ్డురాలేదు. ఈయన వారిని మరోసారి పిలుద్దామని వెళుతున్నారంతే ! వెళ్ళికా బాబాయి. ఇవాళ నాతో మాట్లాడటానికి వస్తారట !

చిదా : నాకేమీ అర్థం కావటంలేదు. ఎవరువస్తున్నారు మాట్లాడ్డానికి ?

ఉష : మీ పిన్నిగారూ బాబాయిగారున్నూ. మీ రసలు వారు వస్తున్నారని చెప్పటానికే వచ్చారనుకున్నాను.

చిదా : (అమిత ఆశ్చర్యంతో) ఏఁవిటీ ! పిన్ని చిన్నాన్నా ఇక్కడికి వస్తారా ?

ఉష : మీకు తెలియదూ ?

చిదా : నిజంగానే నాకు తెలియదు. నే నింట్లో లేనప్పుడు ఎప్పుడో నిశ్చయించుకొని వుంటారు.

ఉష : నిన్న మీరు యింటికివెళ్ళి మాకువున్న రక్తసంబంధం చెప్పారనీ, అంచేత డాక్టరు మామగారు నాతో మాట్లాడ్డానికి వస్తున్నారనీ అనుకున్నాను.

చిదా : కాని మీరిద్దరూ తండ్రీ కూతుళ్ళని నే నింకా చెప్పనేలేదు ఆయనకి.

ఉష : అదేమిటి ! ఎందుకు రహస్యంగా వుంచారింకా ?

చిదా : ఉషాదేవీ ! ఇదేమయినా సర్వసాధారణమయిన విషయమా, చెవిని పడగానే చటుక్కున కనిపించినవాళ్ళందరికీ చెప్పివెయ్యడానికి. వయసులో వున్నప్పుడు, రక్తంలోవున్న దుడుసుతనంకొద్దీ చేసిన ఒక పొరపాటుకి, ప్రాయశ్చిత్తంగా యీనాడు భార్గవరావు ఎదుర్కొవలసిన పరిస్థితి ఎంత విచిత్రంగా వుందో కొంచం లోతుగా ఆలోచించండి. తనకూతురు కాపురం నాశనం చేయడానికి ఎక్కడనుంచో ఒక సైతాను భూమిమీదికి దిగి వచ్చిందనుకుంటున్నాడాయన. మీరు మీ తల్లిని హింస పెట్టిన నరరూపరాక్షసుడే మీ తండ్రి అని తీర్మానించుకున్నారు. అయితే మీ యిద్దరినీ ఒక సమాధానపు ధోరణికి తెస్తేనేగాని ఈసంగతి ఆధాత్తుగా బయటపెట్టడం మంచిదికాదనుకున్నాను. తీరా చూడబోతే యివ్వాళ్ళ, యిప్పుడే ఆయన మీతో మాట్లాడటానికి వస్తారని చెబుతున్నారు మీరు.

ఉష : చైతన్యదేవ్‌కి మాట యిచ్చాను. ఆయనతో యివాళ మాట్లాడతానని. కానీ - ఆ సమయం దగ్గిరపడినకొద్దీ నాకు ఏదో భయం భయంగా వుంది.

చిదా : మీరు సాక్షిత్తు మా శాంతాదేవి కూతుర్ని అని చెప్పి నప్పటినుంచీ నాకే మనసు కలవరమైపోయింది. ఏఁవేవిటో ఆలోచనలు పరుగెత్తాయి. ఏఁవేవో జ్ఞాపకాలు చిమ్ముకువచ్చాయి. అంచేత నే నింటికి వెళ్లాక ఎవరితోటీ పట్టుమని మాట్లాడనైనాలేదు. మౌనంగా ఒక్కణ్ణే కూచున్నాను.

నా చిన్నతనపు వూహలన్నీ సినిమాలాగా కనుపించటం మొదలు పెట్టాయి.

అప్పటికి నా కేడినిమిదేళ్లుంటాయి. మా శాంతమ్మాపిన్ని దేవుడికి హారతి యిచ్చి, నాచేతకూడా ప్రార్థన వల్లింపించేది. పటికబెల్లం చేతిలో పెట్టేది. బయటకూచొని కధలుచెప్పేది. మా చిన్నాన్నా, బొమ్మా చూడకుండా నాతో పేకకూడా ఆడేది. ఆవిడిని చూస్తే, భర్తా అత్తగారు ఎప్పుడూ కస్సుమంటూ వుండేవారు. అంచేత ఆవిడ ననొక్కణ్ణే స్నేహితురాలిగా చూసుకునేది.

ఒకరోజున ఆవిడ పుట్టింటికి వెళ్ళింది. మళ్లా తిరిగిరాలేదు. కారణం ఏఁవిటో నాకు తెలియదు. ఆవిడ వెళ్ళిపోయాక నేనా యింట్లో దిక్కులేనివాణ్ణయిపోయానా ననిపించింది. ఆవిడొస్తే బాగుణ్ణు, మళ్ళా పేకాడుకోవచ్చు అనుకునేవాణ్ణి. కాని ఆవిడరాలేదు. ఒకరోజున ఇందిర పిన్ని యింటికి వచ్చింది. ఉషా ! నిన్న నిన్ను చూడగానే ఒక్కక్షణం మా శాంతమ్మ పిన్నిని చూస్తున్నానని భ్రాంతి కలిగింది. క్షమించండమ్మా.

ఉష : ఎందుకు ? ఇందులో క్షమించడాని కేముంది.

చిదా : పొరపాటున మిమ్మల్ని ఉషా అన్నాను. ఏకవచనంలో మాట్లాడొచ్చునా మిమ్మల్నిగురించి.

ఉష : తప్పేముంది ? మీరు అన్నగారుకదా ? మీ కా హక్కువుంది.

చిదా : నాకూ అలాగే అనిపిస్తోంది. అయినా అలవాటులేదుగా ! నిన్న యింటికి వెళ్ళికూచుంటే శాంతమ్మ పిన్నిని ఒకసారి చూడాలనిపించింది. అంచేత పాతకాగితాలన్నీ తిరగవేశాను. అందులో నా ఒడు

గప్పుడు తీసిన ఈ ఫోటో కనిపించింది. అదే శాంతమ్మ పిన్ని తీయించుకున్న ఆఖరి ఫోటో ! (ఉష ఫోటో చూస్తుంది)

ఉష : ఇదే ఆఖరు ఫోటోకామలెండి. నేను ఒక సంవత్సరం పసిపిల్లగా వున్నప్పుడు తీయించుకున్న ఫోటో ఒకటి వున్నదినా దగ్గిర. పట్టుకొస్తా. (లోపలకు వెళ్ళి ఫోటో పట్టుకొస్తుంది. రెండు ఫోటోలు దగ్గిరపెట్టుకొని యిద్దరూ చూస్తారు)

చిదా : అచ్చంగా ఆవిడే ! అదే తిన్నని పాపిడి. పెద్దగళ్ళ చీర. నుదిటిన చంద్రరేఖ. ఉషాదేవీ ! మీరు యిలాంటి దుస్తులు వేసుకుంటే అచ్చు ఆవిడలాగే వుంటారు.

ఉష : నిజం ! (ఆ ఫోటోవైపు చూస్తూ) ఈయన మీ బాబాయి గారు కాబోలు !

చిదా : ఆవును ! మా బాబాయీ ! మీ తండ్రిగారూను.

ఉష : తండ్రి !

చిదా : ఎందుకమ్మా యింత విరోధం వాళ్ళంటేను నీకు ? నిజానికి మా బాబాయీ, ఇందిరాదేవిగారు చాలా మంచివాళ్ళమ్మా !

ఉష : (వ్యంగ్యంగా) ఓహూ !

చిదా : ఎప్పుడో ఒకప్పుడు పొరపాటుచేశాడుకదా అని మనిషిని రాక్షసుడు క్రింద జమకట్టుతే ఎలాగ ?

ఉష : ఒక్క పొరపాటేం ? ప్రాణాలుతీసిన పొరపాటది.

చిదా : అయినా అది పాతికేళ్ళక్రితం జరిగింది. ఆరోజుల్లో మీతండ్రిగారికి అది పొరపాటనీ తప్పనీ తోచేవుండదు. ఈనాడుకూడా యిది పొరపాటుకాదనీ తమ జన్మహక్కు అనీ అనుకునే వాళ్లంటూనే వున్నారు.

ఉష : కాని యిలాటి తప్పుకి అవకాశం దొరికితే ప్రాయశ్చితం విధించటంకూడా హక్కేఅని కొంతమంది అనుకోవచ్చు. ఆనాడుచేసిన పొరపాటుని అసలు పాయిదాలతోకూడా అనుభవింప చేయడానికికూడా కొంతమంది కంకణం కట్టుకోవచ్చు.

చిదా : ఆఁ ! ఆఁ ! ఇంత కాఠిన్యం స్త్రీజాతికి శోభ కాదమ్మా !

అయినా యిప్పుడు యీ ప్రాయశ్చిత్తం ఎవరికి విధిస్తున్నారు ? తప్పు చేసింది బాబాయి. ఒక మగవాడు. కాని ప్రాయశ్చిత్తం అనుభవించవల సింది ఒక నిరపరాధి అయిన స్త్రీ - ఆయన కూతురు. ప్రాయశ్చిత్తం విధిలచేదీ ఒక స్త్రీయే. ఏఁవిటీ న్యాయం ?

ఉష : మీ బాబాయిగారు చేసింది మట్టుకు ఏం న్యాయం ?

చిదా : కానేకాదు. శుద్ధ అన్యాయం ? ఆయన చేసింది తప్పే ! కాని ఆయన పురుషుడు. అంతఃకరణల్లో అంతులేని తేడావుంది. ఆడ వాళ్ళకీ మగవాళ్ళకూ. మగవాడు యితరుల మంచీ, దుఃఖాలనుగురించి ఆలోచించకుండా తనసౌఖ్యంకోసం ఎన్ని తప్పుడు పనులయినా చేస్తాడు. కాని - ఆడది తను క్షీణించిపోయి అయినా సరే యితరులమీద అమృత వర్షం కురిపిస్తుంది మేఘంలాగ - ఉషాదేవీ ! మా బాబాయి శాంతా దేవిని అన్యాయం చేశారని, ఆయనమీద పగబట్టి కసితీర్చుకోవడానికి ప్రయత్నించకు. అది ఆడదానికి సహజంకాదు. స్త్రీజాతికి ప్రేమించటం ధర్మంకాని - పగ తీర్చుకోవటంకాదు.

ఉష : ఈ ధర్మ నిర్ణయంచేసినవాళ్ళు ఎవరు ? మగవాళ్ళుచేశారు; స్వలాభంకోసం — అయినా యిటువంటి స్తుతులకి ఆడవాళ్ళు ఉబ్బిపోయే రోజులు పోయాయి. మా ధర్మం ఏమిటో మేం నిర్ణయించుకుంటాము. మీరు వరవడి పెట్టనక్కరలేదు. అవ్యాతవున్నచోట ప్రేమిస్తాం. అవసర మయినచోట పగ తీర్చుకుంటాం.

చిదా : అలా అనుకోవచ్చు. కాని అది మీ స్వభావంకాదు. ప్రేమించటం స్త్రీజాతియొక్క ధర్మం అనేది పురుషులు ప్రచారంచేసిన సిద్ధాంతం కాదు. ప్రకృతి ప్రసాదించిన పుణ్యం - కాని దాని విలువ తెలియక పురుషుడు ఆ నైజాన్ని అవమానం చేస్తూవుంటాడు. దుర్వి నియోగం చేస్తూంటాడు. ఆ ప్రేమతో జూదం ఆడతాడు.

ఉష : మరి ఈ వేదాంతమంతా మీ బాబాయిగారికి చెప్పకూడదూ మీరు ? మీ మగవారు మా ప్రేమతో జూదమాడవచ్చుగాని మేం మాత్రం మీమీద పగ తీర్చుకోకూడదు. ఎంచేత ఏఁవిటి ?

చిదా : మేం జూదగాళ్ళం గనుక. మాకు మీ అనురాగపూరిత

మయిన అంతఃకరణాలని అర్థంచేసుకునే సౌజన్యం లేదుగనుక - ఇంత హీనులు గనుకనే ఆడవాళ్ళందరూ ఏకంగావుండి మగవాళ్ళని కాపాడాలి. అంతేగాని, ఆడవాళ్ళల్లో ఆడవాళ్ళే ఒకరికుటుంబాలని ఒకరు నాశనం చెయ్యాలని బయలుదేరితే ఎట్లా ? అట్లాచేస్తే యింక స్త్రీజాతి తన జవాబుదారి, తన కర్తవ్యం మరిచిపోయినట్లేగా ?

ఉష : అయితే పురుషులుమాత్రం తమజవాబుదారీని మరిచిపోవచ్చునన్నమాట.

చిదా : వాళ్ళు మరచిపోతున్నారుగనుకనే మీ జవాబుదారి రెట్టింపయింది.

ఉష : అయితే జవాబుదారీలు మరచిపోయిన పురుషులను మేం శిక్షించకూడదు. పగ తీర్చుకోకూడదు. ఈ పవిత్రతత్వజ్ఞానం అంతా ఒక స్త్రీజాతికే వుపదేశించటం ఎందుకుమరి ?

చిదా : ఎందుకంటే ! స్త్రీమాతృదేవతగనుక.మానవజాతి అంతనీ సృష్టించేది స్త్రీ గనుక, అందర్నీ పోషించేది స్త్రీగనుక—తన సంతతి యొక్క సౌఖ్యంకోసం సర్వప్రయత్నాలూ చేసేది మాతృదేవతగనుక. పురుషులు సృష్టించిన సంస్కృతి ఒక్కొక్కప్పుడు మానవ సంతానాన్నం తనీ నాశనంచేసే పద్ధతిలో నడుస్తోంది గనుక. వారిని కాపాడ్డంకోసం స్త్రీయే ఒక కొత్తమార్గం వెతికి అందులోనే నడిచే నూతన సమాజాన్ని నిర్మించడం స్త్రీకే చేతనయిన పనికనుక.

ఉష : మీరు మాట్లాడ్డంమాత్రం చాలా బాగా మాట్లాడుతారు. చాలాసేపయింది. ఇంక మీ బాబాయిగారూ వాళ్లూ వచ్చేవేళ అవుతోంది. వారు వచ్చేవరకూ వుంటారా మీరు ?

చిదా : తప్పకుండా వుంటాను. ఉండాలికూడాను. వారి తరపునా నీ తరపునాకూడా నే వుండితీరాలి.

ఉష : కూచోండి అయితే ! నేను కొత్త దుస్తులు వేసుకొస్తాను. నా మనసుమార్చటానికి వస్తున్నారటకదూ. చూద్దాం, ఏం తమాషా జరుగుతుందో.

చిదా : ఉషాదేవి ! వాళ్ళబిడ్డమీద వాత్సల్యంతో వస్తున్నా రిక్క

దికి. పరాయిపిల్లని శరణు వేడుకోడానికి వస్తున్నారు. అదిమాత్రం జ్ఞాపకం వుంచుకోండి.

ఉష : వారు వచ్చాక పిలవండి నన్ను. (లోపలకు వెళ్ళిపోతుంది)

చిదా : ఇహ ముందున్నది ముసళ్ళపండుగ. (చిదానందం తల వంచుకొని కూచొని వుంటాడు. ఇంతట్లో తలుపు నెమ్మదిగా తెరుచుకొని బేబీ వస్తూంది.)

బేబీ : నువ్వా అన్నయ్యా !

చిదా : బేబీ ! నువ్వెక్కడినుంచి వచ్చావు ? ఆఁ ! బేబీ ! నువ్వెల్లా వచ్చావు యిక్కడికి ?

బేబీ : నువ్వెలా వచ్చావో నేనూ అలాగేవచ్చాను. తాను తెలియ నివ్వకుండా మీరందరూ యిక్కడకు రావడానికి ప్లాను వేశారుకదూ ? కానీ నాకు తెలిసిపోయింది. అంచేత కాలేజీనుంచి తిన్నగా యిక్కడికే వచ్చేశాను. ఏదాపిడ ?

చిదా : లోపలవుంది.

బేబీ : నువ్వుమాత్రం యిక్కడ చాలా సొంత మనిషిలా కూచున్నావే ?

చిదా : అవునవును. యిది పరాయివాళ్ళ యిల్లుకదూ ! కాని బేబీ ! నిజం చెప్పాలంటే నాకీ మధ్యన అన్నీ ఒకలాగే వున్నాయి. పరాయివాళ్ళ యిల్లయినా, హోటలయినా, జైలు అయినా, అన్నీ ఒక లాగే కనిపిస్తున్నాయి. ఏదో దానికేంలే గాని, నువ్వు మరి మీ నాన్న గారితో చెప్పకుండానే యిక్కడికి వచ్చేశావా ! మంచిపనికాదు సుమీ !

బేబీ : చెపితే రానిసారా ఏమిటి ?

చిదా : అయితే నువ్వు యిప్పుడు ఒకపని చెయ్యి. బుద్ధిగల పిల్లలాగా చటుక్కున వెళ్ళి యింటిదగ్గర కూచో.

బేబీ : ఏం ? నే నెందుకు యింటిదగ్గర కూచోవాలి ? నేనేమన్నా పాలుతాగే పిల్లనా యింకా ? మొన్న నాన్నగారూ అట్లాగేచేశారు. "వెళ్ళి టీ చేయించి తీసుకు రా" అని లోపలికి పంపించేశారు. ఇవాళ మట్టుకు

నేనుపోను. మీరు మాట్లాడేవన్నీ వినాలి నేను. నువ్వు నిన్న బావగారితో అంతసేపూ మాట్లాడావా ? ఇంతవరకూ ఏం మాట్లాడిందీ నాకు చెప్పనే లేదు. ఏం మాట్లాడావు ?

చిదా : శంకరం తోటా ! ఓ ! లక్ష మాట్లాడాను.

బేబీ : ఆ ! ఏమన్నావో చెప్పవూ ?

చిదా : రోగాలనిగురించీ, మందుల్నిగురించీ తెగ మాట్లాడుకున్నాం. అప్పెండిసైటిస్ మనభాషలో ఏమనాలి ? పుప్పొటకానికి ఆయుర్వేదంలో అంతటిగుణం చెప్తాడే అదంతా నిజమేనా ? అబ్బో యిట్లాగే ఎన్నో.

బేబీ : ఇంకే విషయాలూ మాట్లాడలా ?

చిదా : ఎందుకు మాట్లాడలా ! కొంచెంసేపు అయ్యాక జాగ్రఫీ లోకి వచ్చేశాం. ఆ తర్వాత నక్షత్రమండలాన్నిగురించి మాట్లాడుకున్నాం. అసలు క్రమం తప్పకుండా, క్షణం ఏమరకుండా తమతమ నియమితమయిన కక్షలలో సతతమూ సంచరించే గ్రహాలు దారులు తప్పే మనుష్యులమీద తమ ప్రభావం ఏమాత్రం చెలాయించగలవనేది కూడా మాట్లాడుకున్నాం.

బేబీ : అయితే నువ్వాయన్ని చూట్టానికి వెళ్ళటం వీటినిగురించి మాట్లాడ్డానికేనా ? ఆయన పునర్వివాహం సంగతి ఎత్తనేలేదా ఏమిటి ?

చిదా : దాని విషయమూ మాట్లాడుకున్నామే !

బేబీ : అయితే చూడించి అడిగావా ? ఎంచుకయ్యా ఇంకో పెళ్ళి తల పెట్టావుటా అని ?

చిదా : అది అడగలేదు సుమా.

బేబీ : ఎందుకు అడగలేదు మరి ?

చిదా : ఎట్టా అడుగుతాను ? అసలు మొదటిపెళ్ళి మాత్రం ఎందుకు చేసుకున్నావని ఎవర్ని అయినా అడుగుతున్నాం గనకనా ? అయినా మగవాళ్ళు ఎందుకు పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు చూడు. పోనీ. ఎవరోవచ్చి పిల్లనిస్తామంటున్నారు. వాళ్ళు చేసుకుంటున్నారు.

బేబీ : అన్నయ్యా ! నువ్వూరికే నన్నేడిపిస్తున్నావు. అసలు

విషయంలోంచి మళ్ళించాలని ప్రయత్నిస్తున్నానంతే. నా కర్థమయి పోయిందిలే.

చిదా : అర్థమయిందా మరి. అంచేత నువ్వు ఎంచక్కా ఇంటికి వెళ్ళుమరి. ఇక్కడ జరిగిన సంభాషణలన్నీ నీకు తర్వాత గ్రామఫోను లాగా చెబుతాగా. నువ్వు యిక్కడవుండటం మంచిదికాదు.

బేబీ : ఏం ? నేనుకూడా ఆవిడగారిని ఓ సంజాయిషీ అడుగుదా మనుకుంటున్నాను.

చిదా : అట్లాగా ! ఏమని అడుగుతావేంటి ?

బేబీ : ఏమయినా ? నువ్వు మా అక్కయ్య సంసారంలో ఎందుకు చిచ్చు పెడుతున్నావని అడుగుతాను.

చిదా : నువ్వావిడ ప్రేమ కెందుకు చిచ్చుపెడుతున్నావు మరి ?

బేబీ : అన్నయ్యా ! అయితే మన శారదక్కయ్యకంటే—నీకు యిప్పుడు యీవిడనుగురించి ఎక్కువ బాధగా వున్నట్లుంది. అయితే యింకేం పెళ్ళి చేయించేసెయ్యి. అసలు అక్కయ్య బాధలనుగురించి పట్టించుకునేవాళ్లు ఎవరున్నారు ?

చిదా : పాపం ! నీ వక్కత్తికే పట్టుకుంది ఆ జవాబుదారీ అంతా ! ఇప్పుడు అక్కయ్యకి కనక ఒక సవితిరాకుండా చేస్తే వాదాంతో స్త్రీజాతికి కలిగే ఆపదలన్నీ తప్పిపోయినట్లే అవునా ?

బేబీ : నేనల్లా ఏమీ అనలేదు. అసలు ఎక్కడా ఎవరికీ యిటువంటి సవితిపోరు వుండకూడదనే ప్రచారం చేస్తున్నాను. సంసారంలో సవితివుండటం అంటే గుండెలమీద కుంపటన్నమాట. బ్రతికుండగా బలి అయిపోవడ మన్నమాట.

చిదా : సవితివుంటేనే ఆడది బలి అయిపోతుందీ, లేకపోతే హాయిగా వుండిపోతుందనే అనుకుంటున్నావా బేబీ ! సవితివుండగా సంసారం చెయ్యడంకంటే భయంకరమయిన జీవితాలు వెళ్ళబుచ్చటం చాలామంది ఆడవాళ్ళకి తప్పనిసరి అయిపోతోంది. కాని అవన్నీ నీకు కనిపించవు. ఆ బాధలు తప్పించి ఆడవాళ్ళని ఉద్ధరించటానికి నువ్వు ఏందుకు ఉపన్యాసాలు యివ్వటంలేదు ? తన యిష్టాయిష్టాలనుగురించి

ఆలోచించలేకుండా, తన సుఖదుఃఖాలను గురించి నోరెత్తకుండా, మగవాడి పతుత్వానికి మారణహోమం అయిపోతున్న స్త్రీ లెంతమంది వున్నారో తెలుసా ? వాళ్ళని పతివ్రతలంటున్నాం. పదిమందీ వున్న యింట్లో పోరు పెట్టడం మరియాద కాదని నెత్తినపడిన తిట్లూ, వంటిన పడిన దెబ్బలూ, అర్ధరాత్రప్పుడుకూడా గాజుపెంకు గుచ్చుకున్నట్లు కరేలు కరేలు మనే అత్తమామల అవమానపు వాక్యాలు నోరెత్తకుండా భరిస్తూ శాంతంగా వుండి, —యింట్లో యీ శ్మశాన ప్రశాంతిని కాపాడకలిగిన స్త్రీని గృహలక్ష్మి అంటున్నాం, కట్నాలనీ, కానుకలనీ, ఖర్చులనీ, మరియాదలనీ, పుట్టింటివారి సొత్తంతా తాకట్లు పెట్టించి, తాము యిన పెట్టెలు నింపుకుని, వాటితో వచ్చిన నిర్భాగ్యురాలిని కొనుక్కున్న ఖానిస కంటే అధమంగా చూస్తూ - తనపెళ్ళితో పుట్టింటివారు బీదవారయి పోతే మన తాహతుకి చెలుగనుక వారిని చూడడానికికూడా ఆడకూతురిని పంపించని అత్తవారింటనే, పుట్టెడు దుఃఖం పొట్టలో పెట్టుకుంటూ, అల్లరిచెయ్యకుండా కాపురం చేస్తున్న యిల్లాలిని భాగ్యలక్ష్మి అంటున్నాము: భర్త అన్నవాడు పెళ్ళాన్ని ప్రేమించకపోయినా పరవాలేదు. ఊరిమీద తిరిగినా అభ్యంతరంలేదు. అతను యింకోపెళ్ళిమట్టుకు చేసుకోకపోతే సంసారం సంతోషంగా సాగిపోతున్నట్లే లెక్క కట్టొచ్చుకదూ ?

నికంతగా సంఘ సంస్కారం చెయ్యాలనీ, చట్టాలు పాసు చేయించాలనీ, ఉత్సాహమూ ఉద్రేకమూవుంటే, ఈ పతివ్రతలనీ, భాగ్యలక్ష్మ్లనీ, గృహలక్ష్మ్లనీ ఉద్ధరించేమార్గం ఏమిటా అని ఆలోచించు. అంతేనేగాని భర్తలు వదిలేసిన స్త్రీలను గురించికాదు.

బేబీ : అన్నయ్యా ! నువ్వు ఎన్నిచెప్పినా, భర్తలతో సంసారం చేస్తూ కష్టాలు పడేవారిసంగతి వేరు. భర్త వదిలిపెడితే, సంసారమేలేక తపించిపోయేవారిసంగతి వేరూనూ. ఎన్నికష్టాలు పడుతున్నా, కాపురాలు చేసుకుంటున్నవారి బ్రతుకులు, బహిరంగంగా పదిమందీ ఆడిపోసుకునే పరాభవం అనుభవించవు. వాళ్ళసంసారం సలక్షణంగా సాగుతున్నట్లే—నలుగురి దృష్టిలోనూ—

చిదా : సంసారం ! కాపురమునూ ! అయితే అది ఎంత ప్రేమ రహితమయినదయినా, ఎంత డొల్లఅయినా చాలు నన్నమాట ! కాపురం అంటూ వుందీ అంటే అంతే చాలన్నమాట ! యింతకీ కాపురాలేమిటి ? మన జీవితాలే ఆ పద్ధతిలోకి దిగిపోయాయి. పైకి బాగున్నట్టు కనిపిస్తూ వుంటేచాలు. లోపల ఎంతపుచ్చిపోయినా సరే. వెల్లవేసిన గోడలుంటే చాలు. పునాదులు కదిలిపోయినాసరే ! సంసారం అంటే ఏమనుకుంటున్నావే బేబీ నువ్వూ ? బజారుకువెళ్ళి తళతళలాడే గిన్నెలు కొనుకొచ్చి గొడుగుబల్లమీద పేర్చగానే సంసారం ఆరంభించినట్టుటే ? భోగి పండగకి ఆవలిస్తూ ఆవలిస్తూ-అరఎకరం ముగ్గులు పెట్టటమటే ! సంవత్సరానికి తొమ్మిదినెలలు ఎండలుమండిపోయే వూళ్ళల్లోవున్నా - సోఫాల్లో కూర్చొని ఓలుస్వెట్లర్లు అల్లుకుంటూ వుండడమంటే ? ఇదేనా సంసారం ? ఇదేనా కాపురం ? ప్రపంచంలో సగంజనాభా చచ్చిపోయారు. మిగిలిన వాళ్ళల్లో ముప్పాతికవంతు జనానికి బ్రతుకుతెరువులు లేవు.అయినా నీ అభిప్రాయంలో, చక్కటి సంసారం అంటే గొడుగుబల్లమీదవున్న తళ తళ లాడే పంటపాత్రలే ! నీలాటి ఆధునిక యుగపు యువతులు యింక ఈ అభిప్రాయాలు మార్చుకోవటం మంచిది. మన సంసారం, మన కాపురం, మన వంటిల్లుమట్టుకే కాదు. ఇరుగూ పొరుగూ, ఊరూ వాడ, అందరూ హాయిగా వున్నప్పుడే మనకీ కొంత సౌఖ్యం వుంటుదన్నసంగతి అర్థం చేసుకో. ఎదటిమనిషి సుఖంగా వుండటాన్నిగురించి ముందు ఆలోచించు.

బేబీ : నీ వేదాంతమంతా నాకు చెప్పావు బాగానేవుంది కానీ, మరి ఆ అమ్మాయికికూడా చెప్తావూ ?

చిదా : ఎందుకు చెప్పను ? తప్పకుండా చెప్తాను. సానుభూతితో, ఆపేక్షతో, యితరులనుగురించికూడా, ప్రతివ్యక్తీ ఆలోచించాలనేసూత్రం యీ ప్రపంచంలో ఒక్కరికి బోధించగలిగినా, నాజన్మ సార్థకమయిందనే తృప్తిపడతాను. ఏ ఒక్క స్త్రీకి ఆ ఆశయం :నేను ఏర్పరచగలిగినా, స్త్రీజాతి కంతకీ సికంచే . నేను ఎక్కువ సేవచేసిన

వాణి అవుతాను. [గంట మోగుతుంది. భార్గవరావుగారు, ఇందిరాదేవి వస్తారు. చిదానందం, బేబీ ఆశ్చర్యంగా చూస్తారు.]

భార్గ : ఏరా ! ఏమిటీలా వచ్చావు చిదానంద్ ?

చిదా : మీరు యిక్కడకు వస్తున్నారని తెలిసింది. అంచేత ఈ కురుక్షేత్రంలో వుంటే మంచిదికదా అని వచ్చాను.

భార్గ : ఆ అమ్మాయి ఏదిమరి ?

చిదా : లోపలుంది. వస్తుంది. కూచోండి మీరు.

భార్గ : సరే !

ఇంది : బేబీ ! నువ్వెందు కొచ్చావే ?

బేబీ : ఏదో నేనుకూడా ఆవిడతో రెండుముక్కలు చెబుదామని వచ్చాను.

భార్గ : ఆమాత్రం చూసుకోడానికి మేం వున్నాంగా. యింకా భూమ్మీద ! (చిదానందంతో) అయితే ఏమంటోంది చిదానంద్ ! ఏమయినా దోవలోకి వస్తోందా ?

చిదా : వచ్చేదేమోకాని మీరు అస్తవ్యస్తంచేశారు. ఈపూట యిక్కడకు వచ్చేప్రయత్నంమీద వున్నట్టు నాతో కొంచం చెప్పి వుండాలిసింది. మీతో మాట్లాడనివి చాలా విషయాలు వుండిపోయాయి.

భార్గ : అంటే యీ వయసువచ్చి యింకా నీ దగ్గిర పాటాలు నేర్చుకొని ఆ తర్వాత యిక్కడికి రావలిసిందంటావు !

చిదా : ఇంతకీ యీ అమ్మాయి ఎవరో మీకు తెలుసా ?

భార్గ : ఏం ? ఎవరేమిటి ? ఏం హరిజనులా, ముసల్మానులా, దొరసానులా - ఎవరేమిటి ?

చిదా : అట్లాంటిది ఎవరో అయినా బాగుండిపోయేది.

భార్గ : అంటే ! అంతకన్నా హీనమయిన దన్నమాట ! (ఎదుటవున్న తంబురా, తబలా వగయిరాలవేపు భావయుక్తంగాచూచి) ఎవరోయి ? ఎవరేమిటి ?

ఉష : చిదానందంగారూ ? వారంతా వచ్చారాండి ?

చిదా : ఔను ! రండి ఉషాదేవిగారు ! (ఉష తనతల్లి ఫోటోలో

వున్నట్లు చీరా. అవీ కట్టుకొని ప్రవేశిస్తుంది. భార్గవరావు నిర్వీర్యుడై పోతాడు. చిదానందం ఆశ్చర్యపోతాడు. ఇందిరకి బేబీకి యివేం అర్థంకావు)

భార : ఆఁ !

బేబీ : (తల్లితో . మెల్లగా) అమ్మా ! యిదేమిటే యీ పాత కాలపు వేషం ? అంత బొట్టు, ఆ నిలువుపాపిడి, ఆ గళ్ళ చీరా-

చిదా : (నిభాయించుకొని) ఉషాదేవీ ! మా చిన్నాన్నగారు, ఆవిడ మాపిన్ని, బేబీ !

భార్గ : సరి ! సరి ! ఈవిడే ఉష ! ఔనా ! ఉన్నట్టుండి నా కేదో భ్రమకలిగినట్టయింది. ఈ మొఖం ఎక్కడో చూసినట్టనిపించింది. మనిషిని పోలిన మనుష్యులుంటారుగదూ ? అంతే అది—

ఇంది : (ఉషదగ్గరికివెళ్ళి) కూచో అమ్మా ! మిమ్మల్ని ఒకసారి కళ్ళారా చూడాలని వచ్చాం.

భార్గ : (ఎంతో దర్పంగా) అసలు యింతకుముందే మిమ్మల్ని ఓసారిచూచివుంటే బాగుండిపోయేది. ఇప్పుడయినా ఏం మునిగిపోయింది లేదు. ఇంతకీ మేం ఎందుకు వస్తున్నామో మీ చైతన్యదేవ్ మీతోచెప్పే వుంటారు. అంచేత ఆ విషయంగా మేం మిమ్మల్ని సముదాయించడానికి రావలసిన అవసరం రావడం - ఏదో గ్రహచారం అనుకోవాలి. (ఉష కోపంగా చూస్తూంటుంది)

ఇంది : (వేడుకుంటూ) మీరు కొంచం శాంతంగా వుండండి—

ఉషా ! తల్లిదండ్రుల ప్రేమకి హద్దువుండదు. ఒక్కొక్కప్పుడు వాళ్లని పిచ్చివాళ్ళని చేస్తుంది. అంచేత ఆదుర్దాతో అన్నమాటలకు కోపం తెచ్చుకోవద్దు.

భార్గ : (కొంచం వళ్ళుతెలిసి) ఉషాదేవీ ! ఇప్పుడు మీరుకూడా మాకు కూతురువంటివారే ! మీరు సుఖపడకూడదనే ఉద్దేశం మా కెన్నటికీలేదు. కానీ దురదృష్టంకొద్దీ, మీరు సుఖపడడానికి ఆచరించవలసిన విధానం, మా పెద్దమ్మాయి సుఖాన్ని నాశనం చేస్తుంది.

ఉష : అప్పుడప్పుడు అలాంటి పరిస్థితులు వస్తూవుంటాయి.

బేబీ : వాటంతట అవిరావు. మనం చేతులారా తెచ్చుకుంటాం.

ఇంది : బేబీ ! నువ్వు కాస్సేపు ఊరుకో.

ఉష : ఎందుకు ? ఆ అమ్మాయి చెప్పిందీ నిజమే ! ఈలాటి ఘటనలు వాటంతట అవి జరిగిపోవు. చేతులారా చేసుకుంటూ వుంటాము.

భార్గ : అటువంటప్పుడు వాటిని తప్పించనూవచ్చు. ప్రయత్నిస్తే—మీలాంటి చదువుకున్నవారు ప్రయత్నించి తప్పించాలి.

ఉష : ఓహో !

భార్గ : అవును. విద్యా వివేకమూవున్న స్త్రీలు వీటినిగురించి శ్రద్ధగా ఆలోచించాలి.

ఉష : విద్యా వివేకమువున్న పురుషులు శ్రద్ధపట్టక్కరలేదా ?

బేబీ : అదేమన్నమాట ! ఈ విషయాల్లో పురుషులదీ దోషం వుంది.

ఉష : ఉందికదా ? ఇప్పుడు మీరందరూ నన్ను ముట్టడించే కంటే మీ అల్లుడిగారితో మాట్లాడితే తేలిపోయేదేమో ?

భార్గ : మగవాళ్ళు అప్పుడప్పుడూ జవాబుదారీలులేని పిచ్చిపనులు చేస్తూంటారు. కాని స్త్రీలు — అందులోనూ మీలాంటి చదువుకున్న స్త్రీలు—

ఉష : అవును. ఇంతకీ చదువుకోవటానికీ, ప్రేమకీ ఏమిటి సంబంధం ? నేను అక్షరం రానిదాన్నే అయినా యిదే తట్టించేది. అంచే యీ పెళ్ళి—

భార్గ : కాని మీరు ప్రేమ ప్రేమ అంటూ పరుగులుపెడుతూ సాధారణమయిన న్యాయాన్నీ, యితరుల హక్కుల్నీ దుర్లక్ష్యం చేస్తున్నారు.

ఉష : చాలామందీ అట్లాగే చేస్తూవుంటారు. కాని వాళ్ళని నిలవేసి అడిగేవారు ఎవరున్నారు ? న్యాయం విచారించి శిక్షించేవారు ఎవరున్నారు ?

బేబీ : ఇది మరీ బాగుంది. చాలామంది అలా అన్యాయంగా

ప్రవర్తిస్తున్నారు గనుక - మీరు అన్యాయం చెయ్యవచ్చునని ఎక్కడుంది ?

ఉష : కానీ ! నేనేమీ అన్యాయం చేస్తున్నట్లు నాకు తోచటం లేదే !

(చిదానంద్ ఉషకేసి ఏమిటలా మాట్లాడుతున్నావు అన్నట్టు చూస్తాడు.)

భార్గ : అయితే మీరు యింకొకరి హక్కుల్ని అపహరిస్తున్నారనీ ఈ రెండోపెళ్ళి అన్యాయమనీ మీకు తోచటమే లేదూ ? ఆశ్చర్యంగానే వుంది.

ఉష : మీకుకూడా ఆశ్చర్యంగా వుందా యీ రోజున - యితరుల హక్కులనుగురించీ పెళ్ళిమీద పెళ్ళినిగురించీ పాతికేళ్ళ క్రితం మీకున్న అభిప్రాయాలన్నీ మారిపోయాయన్నమాట !

భార్గ : అయితే ఉషాదేవీ ! ఇరవై అయిదేళ్ళ క్రిందట నేను చేసుకున్న పెళ్ళిసంగతి మీతో ఎవరో—

ఉష : (నిర్వీర్యంగా) అవును. మొదటిభార్య బ్రతికివుండగా తమరు రెండోపెళ్ళి చేసుకున్నారన్నసంగతి నాకు తెలుసు.

బేబీ : అన్నయ్యా ! ఏమిటి ఈవిడ ఇలా అంటుంది ? మా అమ్మ రెండో పెళ్ళామా ? సవితివుండగా పెళ్ళి చేసుకుందా ?

చిదా : నిన్ను యింటికి వెళ్ళమని చెప్పానా యిందాకనే—ఇప్పుడింక నోరుమూసుకూర్చో. ఇంకా చాలా వింతలు వినాలి నువ్వు—

భార్గ : కాని అప్పుడు నేను రెండోపెళ్ళి చేసుకోవటానికి బలమయిన కారణాలున్నాయి.

ఉష : అందరికీ వుంటాయి. ఆవిడ మీకు నచ్చకపోవటమూ, మీ అమ్మగారికి ఆవిడను చూస్తే కిట్టకపోవటమూ అనే రెండు మహా కారణాలుండేవి.

భార్గ : అంతేకాదు ! నాకు పెళ్ళి అయి చాలా ఏళ్ళు అయ్యాక

కూడా సంతతి కలగలేదు. మా అమ్మకి తను బ్రతికివుండగా వంశం నిలబడటం చూడాలని మహాకోరిక వుండేది. ఆవిడకోరిక మన్నించటం నాకు కర్తవ్యం కూడాను.

ఉష : అంచేత - ఆ సొకుమీద మీ సరదా తీర్చుకున్నారు.

భర్త : నువ్విప్పుడు నీ ప్రవర్తన సమర్థించుకోవటానికి అలా అంటున్నావు.

ఇంది : ఇప్పుడా విషయం ఎందుకండీ చర్చించడం ?

భర్త : అయితే నేను రెండోపెళ్ళి చేసుకోవటం సంతానంకోసం కాదని ఎలా చెప్పగలవు ?

ఉష : సులభంగా రుజువు చెయ్యగలను. మీరు మీ మొదటి భార్యని వైద్యపరీక్ష చేయించి ఆవిడకి పిల్లలు పుట్టనేపుట్టరని తెలుసుకున్నారా ? ఆవిడకి చాలారోజులవరకూ సంతతి కలుగలేదుగనుక ఇహ కలుగదని మీఅంతట మీరు నిశ్చయంచేశారు. ఇది మీ స్వార్థంకొద్దీ చేసిన నిశ్చయం. కానీ - దానివల్ల ఆవిడ ఆడబ్రతుకునే అవమానించారు. ఆవిడ మాతృత్వానికి ద్రోహంచేశారు. మీ సరదాకోసం. ఆసొకుమీద రెండోపెళ్ళి చేసుకున్నారు.

భర్త : ఇందులో ఆవిడకి అవమానం ఏముంది ? ప్రపంచకంలో చాలామంది స్త్రీలకు పిల్లలు పుట్టరు.

ఉష : కాని ఆ స్త్రీల మనసుల్లో ఎటువంటి యాతన వుంటుందో ఎపుడయినా ఆలోచించారా ? ఒక్కనిముషం ఆ సంగతి మీరు ఏనాడయినా ఆలోచించివుంటే - మిమ్మల్ని సుఖపెట్టాలని ప్రయత్నించే భార్యయొక్క హృదయంలో వున్నదుఃఖం మీకు అర్థమయ్యేది. అప్పుడు ఆవిడమీద అసహ్యం పుట్టడానికి బదులు సానుభూతి కలిగేది. మీ అమ్మగారికి చచ్చేముందు మనమల్ని చూడాలని కోరిక వుండవచ్చు. కానీ అంతకంటే గాఢంగా తనజన్మలో ఒక్కకొడుకుని కనాలనే కోరిక మీ భార్యకీ వుంటుందవి వూహించుకోలేక పోయారు మీరు ? ఆవిడకి సంతతి కలగలేదని మనస్సులో ఎంత దుఃఖిస్తున్నదో అర్థం చేసుకొని, ఆవిడదుఃఖాన్ని పంచుకోవడానికి బదులు ఆవిడని వంటరిగా మూలపారేసి మీ సౌఖ్యంకోసం, మీ సంతతికోసం తాపత్రయ పడ్డారు. తన భర్తయిటు

వంటి ద్రోహి అవడంకంటే, ఆయనకి ఏ అంటువ్యాధి వచ్చినా ఆవిడ సేవ చేయడానికి వీలుండేది. మీకు పిచ్చి పుట్టివుంటే - తన ప్రాణాన్ని కూడా లెక్కచెయ్యకుండా మిమ్మల్ని కాపాడివుండేది. మీరు గ్రుడ్డివారయితే తనే మీ చేతికి కర్ర అయ్యేది. మీరు ముష్టి ఎత్తుకుంటే మహదానందంగా మాధాకవళం అమ్మా అని మీ వెంట వీధులన్నీ తిరిగివుండేది.

ఇంది : (ఎంతో కలవరపాటుతో) ఉషాదేవీ ! చాలమ్మా చాలు.

ఉష : ఎలా చాలుతుంది ? ఈయనగారు తనకి సేవచేసేభాగ్యం కూడా కలుగచేయలేదు మా అమ్మకి.

ఇంది : ఉషా ! మీ అమ్మకా ?

భార్గ : ఏమన్నావు ! నీ తల్లికా !

ఉష : అవును. ఆవిడ మాఅమ్మ ! భార్గవరావుగారూ ! సంతతి కలుగదని మీరు చెయ్యిజార విడుచుకున్న శాంతాదేవి కూతుర్ని నేను.

భార్గ : శాంతాదేవి కూతురివా !

ఉష : మీరు రెండోపెళ్ళి చేసుకున్నారని పిచ్చికోపం తెచ్చుకొని తక్షణం బొమ్మలో వున్నవాళ్ళ అన్నదగ్గిరికి వచ్చేసింది. ఆ తర్వాత ఆరునెలలకి నే పుట్టాను.

భార్గ : అందుకే కాబోలు ! - నాకిందాక చటుక్కున ఏవేవో జ్ఞాపకాలు వచ్చాయి. నీ ముఖం ఎక్కడో చూచినట్లు అనిపించింది.

ఇంది : (లేచి ఉషదగ్గరకువెళ్ళి) ఉషాదేవీ ! నువ్వావిడ కూతురివా ?

ఉష : అవును. నే నావిడకూతుర్ని. పోలిక నా తల్లిదీ. ఆలోచనలు నా తండ్రివీ వచ్చాయి నాకు. నా పెళ్ళి నా చిత్తం వచ్చినట్లు చేసుకుంటాను. మీరు పిల్లలకోసం రెండోపెళ్ళి చేసుకున్నారు. నేను ప్రేమకోసం చేసుకుంటాను. కాని తప్పక చేసుకుంటాను. నా తల్లి సుఖదుఃఖాలనుగురించి మీరు లెక్కచేయలేదు. మీ కూతురి సుఖదుఃఖాలనుగురించి నే నెందుకు లెక్కచెయ్యాలి ?

ఇంది : (ప్రౌఢేయపూర్వకంగా) ఉషాదేవీ ! (కళ్ళు తుడుచుకుంటూ)

బేబీ : నాన్నగారూ ! ఇప్పుడింక ఏ ముఖం పెట్టుకొని అడుగుతాం డాక్టరుని పెళ్ళి మానెయ్యమని—

ఉష : భార్గవరావుగారూ ! మీ అమ్మాయి ప్రశ్నకి సమాధానం చెప్పండి చాలు. ఇకముందు మీరు న్యాయాన్యాయాలను గురించి చెప్పే వాదనలకి ఎందుకు విలువ యివ్వాలి ? మా అమ్మకి (గాద్గదికంగా) శరీరం దుర్బలమయిందే కాని హృదయం విశాలమయింది. ఏమయినా ఆవిడ ఒక ఆడది. ఇప్పుడు మీ పెద్ద అమ్మాయికి వున్నట్లే ఆనిడికీ సంసారం చేసుకోవాలనీ - మాతృత్వం పొందుదామనీ కోరికలుండేవి. ఆవిడకీ హక్కులుండేవి. కాని వాటిని మీరు దౌర్జన్యంగా, నిర్దాక్షిణ్యంగా ఆవిడదగ్గరనుంచి లాగేశారు. కాని భగవంతుడు కనికరించాడు. ఆవిడ మాతృత్వాన్ని మీరు హరించలేకపోయారు.

(ఇందిరవైపు చూస్తూ) ఏ న్యాయాన్ని అనుసరించి మీరు నా తల్లి హక్కుల్ని మీ హస్తగతం చేసుకున్నారు ? ఆ న్యాయాన్నే ఇప్పుడు నాకు సరిపెట్టి చూసుకోండి.

నాన్నగారూ ! అమ్మ తనమనసులో ఎంత బాధపడిందో తెలుసుకోవాలనయినా తోచిందికాదు మీకు ? ఆవిడ మనసారగా నవ్వగా నే నెన్నడూ చూడలేదు. ఈనాడు మీ కూతురు కాపరాన్ని నిలబెట్టడం కోసం మీరు నా దగ్గిరకువచ్చి నచ్చ చెప్పాలని ప్రయత్నించారు. కాని మా అమ్మ ఆ అదృష్టానికయినా నోచుకోలేదు. ఆవిడ తరపున వాదించటానికి మా తాతగారూ, అమ్మమ్మా రాలేకపోయారు. ఒకరోజున అకస్మాత్తుగా. పిడుగుపడ్డట్టు వారి అల్లుడు రెండోపెళ్ళి చేసుకున్నా డన్నవార్త నెత్తినపడింది. అంతే-మా అమ్మను బండి ఎక్కించి మీరు పందిరి వేసుకున్నారు. ఆవిడని పుట్టింటికి సాగనంపి మీరు భాషికం కట్టుకున్నారు. ఆవిడ శరీరం యీ దేశం విడిచి వెళ్ళిపోయింది. కానీ ఆవిడ మనశ్శాంతి లోకం విడిచి వెళ్ళిపోయింది.

బిన్నాలో - నేను యింకా చిన్నపిల్లని. మిగిలిన పిల్లలందరికీ తండ్రులుండేవారు. మా అమ్మమ్మదగ్గిరకెళ్ళి "అమ్మమ్మా ! నాన్న

ఎక్కడున్నారే" అన్నాను. ఆవిడకు కోపం వచ్చి "మీ నాన్న చచ్చి పోయాడు" అంది. "మరి అమ్మ కుంకుమ పెట్టుకుంటూందేం ?" అన్నాను. మా అమ్మ కోపంతోటి, దుఃఖంతోటి ఉక్కిరిబిక్కిరి అయి పోయి చటుక్కున కుంకుమ తుడిచేసుకుంది.

నాన్నగారూ ! నాకారోజునుంచి ఈ కుంకుమ అంటే గౌరవం పోయింది. కానీకి మూడు గరిటలిచ్చే ఎర్రటిపొడికి యింతటి మహత్యం ఎక్కడినుంచి వస్తుంది ? కాని మా అమ్మమ్మకుమాత్రం కుంకుమ అంటే గౌరవం వుంది. అంచేత మా అమ్మ కుంకుమ తుడిచెయ్యడం చూసి అమ్మమ్మ, తాతయ్యా చాలా కష్టపెట్టుకున్నారు. ఆరోజునుంచి వాళ్ళు మరీ తొందరగా ముసలివాళ్లు అయిపోయారు. చివరికి లోకం విడిచి వెళ్ళిపోయారు. తర్వాత అమ్మా జబ్బు పడింది. కాని ఆఖరువరకు ఆవిడికి ఒకటే ఆలోచన వుండేది. "మా ఉష పెళ్ళి ఎలా అవుతుంది ? అదయినా సుఖపడుతుందో లేదో" అని తర్కించుకొని బాధపడేది. నన్ను చేరదీసి "అమ్మాయీ ! ఈపెళ్ళిఅనేది ఉత్త జూదం అమ్మా" అనేది.

ఆ జూదంలో మా అమ్మా ఓడిపోయింది. [ఇందిరతో] మీరు గెలిచారు.

ఇంది : ఊరుకో అమ్మా ! ఇంక ఊరుకో !

ఉష : (ఆమాట లెక్కపెట్టకుండా తండ్రితో) ఈ పెళ్ళి అనే జూదంలో మీ పెద్దమ్మాయి ఓడిపోయింది. నే గెలుస్తాను. నాన్నగారూ ! మీరు అనాలోచితంగా చేసినపనినల్ల మా అమ్మజీవితమే కాకుండా మీ కూతురి జీవితంకూడా నట్టేటముంచేశారు. ఆవిడ దుఃఖానికి కారణం నేనుకాదు. మీరు. ప్రస్తుతం ఆవిడ పుట్టింట—అంటే మీదగ్గిరే వుందిట కదూ ? అక్కడనే వుండనియ్యండి. ఆవిడికి దూరమయిన సంసారం నే చేసుకుంటాను. నా తల్లికి మీరు చేసిన ద్రోహానికి యిది ప్రాయశ్చిత్తం. [ఒక ఉదుటున ఉష లోపలికి వెళ్ళిపోతుంది. ఇందిర రెండడుగులు అటువేసి "ఉషా !" అంటుంది. కాని ఉష ఆగదు. ఆ తర్వాత

అంతా కొంచంసేపు నిశ్శబ్దంగావుంటారు. కొంచంసేపు అయ్యాక భార్గవ రావుగారు కోపం తగ్గించుకుంటారు.]

భార్గ : (ఇందిర నుద్దేశించి) ఎందుకే ఆ తలబిరుసుపిల్లదాని వెంటపడతావు ; ఇది నా కూతుర్రా ? తండ్రితో యిలా వితండవాదం చేసేది ; ఉత్తమోత్తపు మనిషి. అంతగా రెండోపెళ్ళి చేసుకోవాలని వుంటే యింకెవరినయినా చూసుకోరాదు. సాక్షత్తు అక్కమొగుణ్ణే కట్టుకుంటుందా ; [చిదానందం నవ్వుతూ వుంటాడు] అయినా ఆ శంకరానికి బుద్ధి వుందా అని ; —

బేబీ : అవునూ ; మీ రడగటమేమిటి యీ ప్రశ్న.

భార్గ : ఏంటే ; అయితే ఇప్పుడు నీకూడా అతను చేసింది బాగున్నట్టే వుందన్నమాట....ఇంకేం ? నువ్వుకూడా ప్రేమించు అతణ్ణి. నాల్రోజులయ్యాక ఆ దరిద్రుడికి ఈ ఉష అంటేనూ యిష్టం పోతుంది. ఆ తర్వాత నువ్వు తయారవు మూడోపెళ్ళికి - ఊళ్ళో అందరూ న్యాయం మాట్లాడేవాళ్ళే ;

బేబీ : అదికాదు నాన్నగారూ ; ఆ ఉషకి యింత అన్యాయం జరిగాక ఆవిడ పగ ఎందుకు తీర్చుకోకూడదూ ?

భార్గ : ఏంటిటే మహాపగ ; తనకు నచ్చినవాణ్ణి కట్టుకోవడం కోసం యిదంతా ఒక మిష. మూర్ఖురాలు.

చిదా : అయితే బాబాయి ; ఇప్పుడు ఆ అమ్మాయి చెప్పిందాంట్లో అబద్ధమేముంది ?

భార్గ : ఇహ ఈ గొడవచాలు. నాకు ప్రాణం విసిగిపోయింది. ఈ రచ్చ రాద్ధాంతాలతోటి. ఇంతకంటే అమ్మాయి కాపరానికి ఓ సవితి ప్రవేశించినా నయమే. ఆఁ ; ఏమే ? (కాని ఇందిర వూరుకుంటుంది) సరే ; చిదానంద్ ; ఇంక యిక్కడ ఓ క్షణంకూడా ఉండక్కర్లేదు. ఆవిడా ఆ శంకరం యిష్టం వచ్చినట్లు ఏడవమను. మనకీ వాళ్ళకీ ఇంక పూచిక పుల్లంత సంబంధంలేదు. అంతే ; పద బేబీ ; —

బేబీ : కానీ, నాన్నగారూ ;

భార్గ : పదమంటుంటే ; ఇహ నువ్వేం మాట్లాడాలనుకున్నా

అంతా యింటిదగ్గరనే - పదండి అందరూ. [బేబీ బియలుదేరుతుంది. ఇందిర కూచునే వుంటుంది. భార్గవరావు తలుపుదగ్గిరకువెళ్ళి వెనక్కి చూచి] పదమని చెప్పటంలే ।

ఇంది : (నిశ్చలంగా) మీరు వెళ్ళండి. నే కాస్సేపుంటాను.

భార్గ : (కోపంగా) ఇప్పుడు జరిగిన మర్యాద చాలలేదా యింకా ?

ఇంది : ఏవిటి మర్యాద ? ఆ అమ్మాయిమట్టుకూ మన అమ్మాయికదూ ? దాని కష్టసుఖాలు మనం చూడకపోతే ఎవరు చూస్తారు ?

భార్గ : ఇది మరీ అందంగావుంది. మతిపోయిందా ఏమిటి నీకే మయినా ? నీ కూతురి కాపురం నట్టేట కలపటానికి నడుం కట్టుకున్న దాని కష్టసుఖాలు నువ్వు విచారించటం ఏవిటే - బాగుందిగాని పద.

ఇంది : ఇంతసేపూ ఎదురుచెప్పడం ఎందుకని ఏమీ అనలేదు. ఇహ ఇప్పుడు తప్పడంలేదు.

చచ్చి చెడి బర్మాదేశంనుంచి వచ్చిన కన్నకూతురు మొట్టమొదటి సారి కంటబడితే తండ్రి నడుచుకోవాలిసిన తరహా ఇదేనా ? ఇహ చాలు గాని మీరు వెళ్ళండి.

భార్గ : నీకు బుద్ధి పరీక్ష చేయించాల్సిందే. మానం అవమానం అనేవి వుండక్కర్లా, మనిషయింతర్వాత. నా జన్మలో నే నింతటి అవమానం భరించలేదు. నీ కివేం లెక్కలేకుండా వున్నాయి. యింకిక్కడ ఒక్క నిముషం వుండనక్కరలేదు. పదవే బేబీ ! ఊఁ ! లే ! నువ్వు కూడా -- [ఇందిరా చిదానంద్ గుసగుసలాడుకుంటారు]

ఇందిర : పదవోయి ! ఇంక ఈయన మనమర్యాద దక్కనీయరు.

భార్గ : పదండి అందరూ ! ఇంటిదగ్గర మాట్లాడుకోవచ్చు. [ఇందిరా, చిదానందం వెళ్ళుతారు]

బేబీ : కాని నాన్నగారూ ! ఈ వివాహం అనే విషయాన్ని గురించి—

భార్గ : బేబీ ! నీ ఉపన్యాసాలన్నీ యింటిదగ్గిర మొదలుపెట్టు. యిక్కడ కాదు పద—

— తెర —

నాల్గవ అంకం

[స్థలం : ఉషయిల్లు. పరదా వెనకవున్న మంచంమీద ఉష పడుకొని వుంటుంది. పొద్దున్న ఎనిమిదిగంటలయిపోయింది. ఉష ఎప్పుడు లేస్తుందా అని చైతన్యదేవ్ ఎదురుచూస్తున్నాడు]

చైత : ఉషా ! లే అమ్మా లే ! చాలా పొద్దెక్కింది ! (ఉష ఇంకా నిదుర మేలుకోలేదు. చైతన్యదేవ్ తంబురా తీసుకొని శృతిచేస్తూ వుంటాడు. ఒక తీగె తెగుతుంది. ఆ శబ్దం విని - ఒక కేకవేసి ఉష లేస్తుంది. బయటికివచ్చి అద్దంలో పదేపదే చూసుకుంటుంది. జడ బుజం మీదది ముందుకు వేసుకొని ఇంకోసారి చూసుకుంటుంది. ఇదంతా చైతన్యదేవ్ గమనిస్తూనే వుంటాడు. ఆఖరికి చైతన్యదేవ్ ఉషని పిలుస్తాడు) అమ్మాయి ! ఉషా !

ఉష : (ఇటుతిరిగి) బాబాయి ! మీ రెప్పుడు వచ్చారు ?

చైత : చాలాసేపు అయింది. కానీ - ఏమిటమ్మా అలా కేక పెట్టావు ? ఎందుకలాగ గాభరాగా వున్నావు ? అద్దంలో అంతసేపు చూసుకున్నావేమిటి ?

ఉష : బాబాయి ! నాకు జుట్టంతా నెరిసిపోయినట్లు కలవచ్చింది. తెల్లగా నెరిసిపోయినట్లు (ఉష మళ్ళా జడకేసి చూసుకుంటుంది)

చైత : కలల్లో ఎట్టాంటి విచిత్రాలయినా కనుపిస్తాయి. నాకయితే గాలిలో ఎగురుతున్నట్లు కలలొస్తాయి. ఏనుగుమీద కూచొని ఎగురుతున్నట్టు. కల లట్లాగే వుంటాయి.

ఉష : జుట్టు నెరిసిపోవడం ఒక్కటేకాదు బాబాయి ! నాకు రాత్రంతా ఏవేవో కలలొచ్చాయి.

చైత : అట్లాగా !

ఉష : అందులో ఒకదానికి ఒకదానికీ సంబంధంలేదు. ఒక పొడుగాటి దోవనిబడి నడిచి పోతున్నానట. రెండువేపులావున్న చెట్లనుంచి పండుటాకులు రాలి దోవనిండా రాసులు రాసులుగా వున్నాయి. నేను వాటిమీదనుండి నడిచిపోతూనే వున్నాను. కొంచెంసేపటికి నేను అలసిపోయాను. అంచేత చేతిలో ఒక కర్ర పుచ్చుకొని నడుస్తున్నాను.

చైత : మనం బ్యామనుంచి వస్తున్నప్పుడుపడ్డ కష్టాలన్నీ కలలో వచ్చినట్లున్నాయి నీకు.

ఉష : అపే అయివుండొచ్చు. కాని రాత్రంతా కలలే. ఒకదానికి ఒకదానికి సంబంధంలేదు. ఎక్కడో మానాన్నగారు కనుపించారు.

చైత : అదే ! ఆయన్ని నువ్వు ఎప్పుడూ చూడనైనా లేదుగా ! కలలో ఎలా వచ్చారు.

ఉష : నిజమే ! ఎక్కడచూశాను మానాన్నగార్ని ?

చైత : అయినా కనిపించింది మీ నాన్నగారే అయితే అంతకేక ఎందుకు వేస్తావు ?

ఉష : ఆఖరుకి డాక్టరు శంకరం కల్లోకి వచ్చారు.

చైత : అప్పుడు కేకవేశావా ? (నవ్వుతాడు)

ఉష : అప్పుడుకాదు బాబాయి ! ఆఖరునవచ్చిన కలలో అదో పెద్దతోట-అందులో ఒక ఉయ్యాలఉంది. అందులో నే నూగుతున్నాను. ఇంతలో శంకరం వచ్చాడు అక్కడికి. ఆయన ఉయ్యాల ఊపడం మొదలుపెట్టారు. ఎంతో పైకి-ఆకాశంలోకి పెళ్ళిపోయింది. ఆయన

యింకా చెయ్యివేసి పూపుతూనే వున్నారు. అంతట్లో అది అంత ఎత్తున వుండగా గొలుసు తెగిపోయింది. అప్పుడు కేకవేశాను.

చైత : ఓసి ! పిచ్చిదానా ! అది ఉయ్యాలగొలుసు కాదమ్మా ! నా తాంబురా తీగతెగింది. ఇంక ఈ కలలన్నీ మరిచిపోమరి. నిన్న ఏం జరిగిందో చెప్పు నాకు. డాక్టరుగారి మామగా రేమన్నారు ? నువ్వేం చెప్పావు ?

ఉష : నేనేం చెబుతాను. డాక్టరుగారిని పెళ్ళి చేసుకోనని ప్రమాణం చెయ్యనా ?

చైత : నో ! నో ! నో ! నువ్వా డాక్టరునే పెళ్ళిచేసుకో. నేను కూడా ఆయనతో చెప్పేశాను. మీ యిద్దరికీ ఎంతో ప్రేమ వుంది. పెళ్ళి చేసుకోవటమే వుత్తమం. కావలిస్తే డాక్టరు మామగారితోకూడా నేనే చెబుతాను.

[గంట మోగుతుంది]

ఉష : శంకరంగారు వచ్చినట్లున్నారు చూడు బాబాయి ! నేను యింకా మొఖమయినా కడుక్కోలేదు.

చైత : నువ్వు వెళ్ళు. తలుపు నే తీస్తాలే ! [ఉష లోపలకు వెళ్లుతుంది. చైతన్యదేవ్ వింగులోకివెళ్ళి ఇందిరాదేవితో తిరిగి వస్తాడు. ఇందిరాదేవి ముఖభావం శాంతంగా, గంభీరంగా వుంటుంది.]

ఇంది : అమ్మాయి వున్నారాండి యింట్లో ?

చైత : మీరు కూచోండి. అమ్మాయి వస్తుంది ఇప్పుడే. [చైతన్యదేవ్ తంబురాతీసి కుర్చీ ఖాళీచేసి, ఒక కుర్చీ ముందుకులాగి - ఎవరో పరాయిస్త్రీ వచ్చిందని తను లోపలికి వెళ్ళిపోతాడు. ఉష ముఖం తుడుచుకుంటూ - అంతే తువ్వాలు ముఖంమీద వుంటుంది. ప్రవేశిస్తుంది]

ఉష : రావద్దని చెప్పినా ఎందుకువచ్చారు డాక్టరుగారు ? (అంటూ తువ్వాల తీస్తుంది. ఇందిరను చూస్తుంది) మీరా !

ఇంది ! అవునమ్మా ! నీ కోసమే వచ్చాను. నీ కాశ్చర్యంగా వుందికదూ ?

ఉష : (కంగారుగా) అబ్బే ! అదేంలేదు ?

ఇంది : లేదు.నీకు ! ఆశ్చర్యంగా లేదూ ! లేదేమోమరి ? నా మట్టుకు నాకు ఆశ్చర్యంగానే వుంది. ఎందుచేతంటే మొన్న అంతకధ జరిగింతర్వాత, నేను నీ దగ్గరికి రాగలగటం నాకే ఆశ్చర్యంగా వుంది. నా ఇష్టాఇష్టాలకి మించినశక్తి ఏదో నన్నిక్కడికి తీసుకొచ్చింది.

ఉష : (కటువుగా) నా మనసు మార్చడానికి యింకోసారి ప్రయత్నంచేసి చూద్దామని, మీ మనసు ప్రేరేపించిందేమో ?

ఇంది : ఛ ! ఛ ! లేదమ్మా ! నీ మనసు మార్చడానికి ప్రయత్నించగలిగిన పుణ్యం చేసుకోలేదన్మా నేను. నీ తల్లి కాపురంమీద చేతులారా నిప్పులుపోసిన నేను, నా కూతురుకాపురం పాడుచెయ్యవద్దు అని ఏముఖంపెట్టుకొని అడుగుతానమ్మా నేను ?

ఉష : నిజమేలెండి. ఇహ మొన్న నే చేసుకున్న నిశ్చయం కూడా—

ఇంది : ఆ నిశ్చయం నువ్వు చేసిందా ? నాకు నిజ మనిపించటం లేదు. అటువంటి నిశ్చయం చెయ్యగలిగిన ఉషవి నువ్వుకావు.

ఉష : నేనుకాదూ ?

ఇంది : ఆహా ! మొన్న నీ ముఖంలో కనిపించిన హాలాహలం లాంటి ద్వేషమూ, అంతరంగంలోంచి పొర్లిపొర్లివచ్చే ఆ దుఃఖమూ, ఇంత లేతవయసులో నీలో ఎక్కడనుంచి వస్తాయమ్మా ?

ఉష : ఎక్కడనుంచంటే—

ఇంది : ఉషా ! ఆ భావాలు నీవికావు. నీ తల్లి సంవత్సరాల తరబడి తన హృదయంలో అణచుకొని సహించిన వేదనఅంతా నీ వాచా బయటికురికింది. ఆవిడ సముద్రమంత గంభీరంగా, బడబానలంలాంటి దుఃఖాన్ని దాచుకొంది. ఆత్మగౌరవాన్ని దహింపచేస్తున్న అవమానాన్ని బయటకి పొక్కనివ్వకుండా హృదయంలో బంధించింది. ఆవిడ కోపంతోనూ, నిరాశతోనూ కృంగిపోయి జీవితం ఎలా వెళ్ళబుచ్చిందో నా మాటల్లో కంటికట్టినట్లు కనిపించింది. అంచేతనే ఆరోజు ఉషవి నువ్వు కాదంటున్నాను. ఆరోజున శరీరంమాత్రమే నీది. నీ మనస్సు మీ అమ్మ

అక్రమించుకుంది. ఆవిడే ఆ నిశ్చయం చేసింది. ఆ రోజు స్వరంలో నీ గొంతుక వినిపించలేదు నాకు.

ఉష : మరి మీరువిన్న స్వరం ఎవరిది ?

ఇంది : మీ తల్లిది. ఆనాడు మీ కళ్ళల్లోవున్న తిరస్కారమూ, మీ కంఠంలోవున్న కర్కశత్వమూ, మీ తల్లి ప్రయోగించినవి. మీ దేహంలో పొంచి ఆవిడ నన్ను సవాలుచేసింది. నా సంసారం ముంచే కావు. ఇవాళ నా కూతురు నీ కూతురి సంసారం ముంచేస్తుంది కాసుకో అని సవాలుచేసింది. (గగుర్పాటుతో) ఉషా ! ఆ రోజున నువ్వు పలికిన నిశ్చయం నువ్వు చేసుకున్నది కాదమ్మా. మీ తల్లి చేయించిన నిశ్చయం అది.

ఉష : (ముఖం చేతులతో కప్పుకొని) నా తల్లి అంత దుష్టురాలుకాదు—

ఇంది : నువ్వూకావు. కాని యిది ప్రకృతి అనుసరించే మార్గము. అమాయకులను బలిచేసి బాగుపడదలచుకున్నవాళ్ళు ఆఖరికి వాళ్ళే బలి అయిపోవడం నీతిదేవతచేసే నిర్ణయం.

ఉష : అంటే నా తల్లిసౌఖ్యం బలిచేసింది మీరేగా !

ఇంది : నేనా ! నేను బలిచేశానా ? (శూన్యంగా చూస్తూ) అంతేలే ! ఆ రోజున లోకమూ అనుకొంది. ఇప్పటికీ అంటున్నది. కాని లోకానికి ఏం తెలుసు ? పిచ్చివాగుడు వాగుతుంది. కంటికెలా కనిపిస్తే అదే వాస్తవం అనుకొంటుంది. కానీ ఆ కనిపించే వస్తువుమీద ఎన్ని రంగుల వెల్తుర్లు పడుతున్నాయో వితరణచేసే శక్తిగానీ, తీరిక గానీ లోకానికి ఎక్కడుంది ? లోకం ఏదంటే అదే సత్యంగా పరిగణిస్తారు తెలియనివాళ్ళు. అదే సత్యం అనుకునే నేనూ యిన్నాళ్ళూ వూరుకున్నాను. లోకం ఏమనుకుంటే నాకేం ? కాని లోకం వేరు. నువ్వు వేరూనూ. నువ్వు సాక్షాత్తు నా కూతురివి. నువ్వూ లోకంలాగే అనుకుంటున్నావు. అలా అనుకొని బాధపడుతున్నావు. నే నది:భరించలేను. ఈ ఇరవయ్యాయిదేళ్లువరకే అంతుచిక్కనియ్యకుండా నా మనసులోనే దాచుకున్న రహస్యం ఈ రోజున నీ ఎదుట పెడతాను. నువ్వే నిర్ణ

యించు। నా అంతరాత్మ "నువ్వు ఎవరి కాపురము ధ్వంసం చెయ్యలేదు. జరిగిందాంట్లో నీ కేమీ జవాబుదారీలేదు" అని అంటూంటుంది. నువ్వు అందులోని నిజాలు నిర్ణయించు.

ఉష : అయితే నా తల్లికాపురం ధ్వంసంచేసింది మీరుకదూ।

ఇంది : కానేకాదు. ఆవిడసంసారం నే చెరపలేదు. సరిగదా ఆవిడ తీర్చిదిద్దిన సంసారానికి నా సౌఖ్యం బలి అయింది. ఆ సంసారంలోపడి ఈ పాతికేళ్ళనుంచీ విలవిలా తన్నుకుంటున్నాను నేను. నన్ను కన్నతల్లి ఎంతో ప్రేమతో ఈ సంబంధం చేయించింది. దానికి నా భవిష్యత్తు యిలా తగలడుతుందని ఎలా తెలుస్తుంది పాపం. దాని దృష్టిలో అల్లుడు యింకా చిన్నవాడే. సిరిసంపదలు కలవాడు. సరదాలు పడుతున్నవాడు. మొదటిపెళ్ళాంమీద ఎక్కువ యిష్టంలేక మన అమ్మాయిని కట్టుకుంటున్నాడు. అంచేత అమ్మాయి సుఖపడుతుంది. అని ఆశ పడ్డది.

ఉష : అయితే సుఖపడలేదా మీరు ?

ఇంది : అందరూ సుఖపడ్డాననే అనుకుంటున్నారు. మీరనుకుంటేమాత్రం ఏచిత్ర మేముంది ? దూరంనుంచి చూసేవాళ్ళకి నా సంసారం సుఖంగావున్నట్లే కనిపించేది. ఈడూ జోడూ సరిపోయింది. ఇల్లూ వాకిలీవుంది. నగా నట్రా వున్నాయి. సిరిసంపదలూ వున్నాయి. ఇద్దరు చక్కని పిల్లలు వున్నారు. ఇంక సంసారం సౌఖ్యంగావుండక ఎలా వుంటుందనుకుంటారు ఎవరయినా ? పైగా ఆయనకి తోచిన రీతుల్లో ఆయన నన్ను సుఖపెట్టడానికి ప్రయత్నంచేసేవారు. కానీ—

ఉష : ఏం ? ఇంకా — కానీ ఎందుకు ?

ఇంది : ఎందుకంటే ఏం చెప్పను ? ఎవరు చెప్పగలరు ? కాని నే న్నా జీవితంలో ఏనాడుకూడా మనస్ఫూర్తిగా ఆనందం అనుభవించలేదు. లోపల మనసు కుడుతూవుండేది. బయట లోకులు కుడుతూవుండేవారు. వీటివల్ల నా జీవితం దుర్భరమయి పోయింది. కొత్త కోడలుగా ఆయింటికి వచ్చాను. అత్తగారెంతో గారాబంచేసేవారు. ముచ్చట పడేవారు. ఇరుగు పొరుగువాళ్ళు వచ్చి "ఈ పిల్లేనా మీ రెండోకోడలు"

అని కుత్సితంగా అడిగేవారు. నాకు కడుపులో కత్తులు దిగినట్లుండేది. నే కాపరానికి వచ్చినతర్వాత మొదటిభార్యా సంగతి పొరపాటునయినా ప్రస్తావించేవారు కారు; యింట్లోవాళ్ళు.

కాని ఆ విషయం ఎంతగా చాయాలని మీ తండ్రి ప్రయత్నించే వారో అంత గూఢంగా అది నన్ను కుళ్ళ పొడుస్తూ వుండేది. నా కాపరం మీద, నా జీవితంలోనూ ఇరవైనాల్గుగంటలూ ఆవిడ నీడ పడుతూనే వుండేది.

ఆవిడ చేయి తగలని వస్తువంటూ నా సంసారంలో ఏదీలేదు. నా వంటిమీదవున్నవి ఆవిడ నగలు, "అందెలు కడియాలు నీకు తేలికగా వున్నాయా - ఆవిడ బలమయినది కాదులే." నత్తు పెద్దదయిందా, ఆవిడికి ఎంచక్కా వుండేది." కాపరానికి వచ్చిన కొత్తల్లో అయితే మరీనీ. ప్రతివస్తువా ఆవిడనే జ్ఞాపకంచేస్తూ వుండేది.

మొదటిపెళ్ళాం చచ్చిపోతే, ఆ పేరు ఎవరికో పెట్టేస్తే అంత టితో సవితిబాధ చలారిపోతుంది. కాని సవితి జీవించివుండగా ఈ ప్రక్రియ ఎలా పనికివస్తుంది? ఆవిడ భౌతికంగాకానీ, నామమాత్రాన్న గానీ, చుట్టుపక్కలా లేకపోయినా, ఆవిడ అస్తిత్వం క్షణక్షణమూ జ్ఞాపకంవస్తూ వుండేది. ఇక యీ బాధకి అంతేముంది?

ఉషా ! నీ తల్లి ఎంతో వేదనతో జీవితం వెళ్ళబోసం దన్నావు. కాని ఆవిడ జీవితం నా జీవితం పడినంత హింస పడివుండదు. ఎంచేతంటే, ఆవిడకి అన్యాయం జరిగిన మరుక్షణం యిల్లు వదలివేసి వెళ్ళిపోయింది. మళ్ళా ఆ యింట్లో అడుగుపెట్టలేదు ఆవిడ. తిన్నగా బ్రహ్మ వెళ్ళిపోయింది. వాతావరణంలోని విపరీతమైన వ్యధలోంచి తప్పించు కొని బయటపడిం దావిడ. అందులో ప్రవేశించి ఉక్కిరిబిక్కిరి అయి పోతూ బాధపడ్డది నేను. ఇంకా బాధపడుతూనే వున్నాను. ఇహ ఇప్పుడు నాకు తోడు పెద్దమ్మాయికూడా ఆ బాధని శాశ్వతం చేస్తుంది.

మా చిదానంద్ అప్పుడప్పుడూ "పిన్నీ, ఈ పెళ్ళి ఒక పెద్దజూదం సుమా" అంటూంటాడు. నిజమే, అది అప్పుడప్పుడు అది సుఖానికి కారణం అవుతుంది. ఒక్కొక్కప్పుడు ఓడిపోతాం, కాని నా పెళ్ళికి

పందెంవేసింది నేనుకాదు. నా జవాబుదారీ లేకుండానే నా జీవితం ఓడిపోయాను. సోగటాలు నా చేతికిచ్చారు నిజమే ; కాని నేను పందెం వెయ్యలేదు. ఒణికిపోతున్న చేతుల్లోంచి అవి క్రిందపడిపోయాయి. అదే పందెం అన్నారు. నాదే గెలుపన్నారు. జీవితంలో నేను సుఖపడుతున్నాననే యితరు లందరూ తీర్మానించారు. పతివ్రతల ధర్మాన్ని అనుసరించి నేనూ అది నిజమన్నట్టే వూరుకున్నాను. కానీ నాది ప్రేమించి చేసుకున్న వివాహం కాదు. అంచేత పందెం నేను వేయ్యలేదు. పావులు నేను నప్పలేదు.

ఉష : కాని నా పందెం నేను వేసుకోగలను.

ఇంది : మహారాజులా వేసుకో ; వద్దని నే నెలా అంటాను ; కాని ఉషా ; దైవసాక్షిగా ఒక్క సంగతిచెప్తాను నీతో - నా పెద్దకూతురు తల్లినిగనుక ఈ మాట అంటంలేదు. కానీ - పురుషస్వభావం ఎరుగున్న స్త్రీవవటంచేత ఒక్కమాట చెబుతున్నాను. ఒళ్ళు దగ్గిరపెట్టుకొని ముందు వెనుకలు ఆలోచించి ఆపైన పందెంవెయ్యి. గెలిచే పందెం పడితే మంచిదే. కాని పడకపోతే ఈ ప్రేమ అనే పెట్టుబడి అంతా నష్టమయిపోతుంది. సానుభూతి అనే అప్పుకూడా పెట్టదీ సంఘం. ప్రేమ వివాహంలో వున్న అపాయం అది ఒక్కటే—

ఉష : అప్పు అడిగే గౌరవం సంఘానికి ఎందు కివ్వాలి ? చేత నయితే మన జీవితం మనమే సుఖమయంగా చేసుకోవాలి.

ఇంది : మనం అంటే ఎవరు ? భార్యాభర్తలా ? ఉషా ; ఇంకా నువ్వు చిన్నదానవు. ప్రేమవివాహం చేసుకోగానే సుఖపడిపోతామనుకోడం నా కెందుచేతనో చాలా హాస్యాస్పదంగా కనిపిస్తున్నది. మగవారి స్వభావంలో కొంత అడవిమనిషితత్వం కాస్తో కూస్తో వుంటూంటుంది. ఆ మగవారిని ఒక అదుపులోనూ, ఆవరణలోనూ వుంచటానికి కోటి రకాల ప్రయత్నాలు చేస్తుంది స్త్రీ. వాటిల్లో ఒక కట్టుబాటు పెళ్ళి. ప్రేమ వివాహంతో క్షణంలో తేలిపోయేటంత సులభమయిన సమస్య కాదిది. అంచేత ప్రేమవివాహానికయినా జూదం సామ్యం వర్తిస్తూ వుంటుంది. ఈ సమస్య నిజంగా పరిష్కరించాలంటే, ఆడవాళ్ళ

మందరం, "పెళ్ళి అనేది సౌఖ్యం చేజిక్కించుకోవటం వీర్పడు సంస్థ" అనే అభిప్రాయం మార్చుకోవాలి.

ఉష : ప్రేమవివాహంలో సౌఖ్యం వుంటుందని నాకు నమ్మకం వుంది.

ఇంది : ఉషా ! నిజం చెప్పాలంటే ఆడదానికి మాతృత్వానికి మించిన సుఖం యింకేదీలేదు. మిగిలిన సుఖాలన్నీ మనం వూహించుకొని అనుభవించేవి. మాతృత్వం ఒక్కటే మన ఆలోచనలు లేకుండా హృదయాంతరాళంలోంచి పొంగిపచ్చే ఆనందాన్ని అనుభవింప చేసేది. నీకు నా అనుభవం దృష్టాంతంగా చెబుతాను కావలిస్తే. పెళ్ళి చేసుకొని నేనేం సుఖపడ్డానో ఎవరికి తెలుసు ? కాని-పురుడుపోసుకొని అమ్మాయి ఏడ్పు విన్నప్పుడుమాత్రం - నా శరీరంలో ప్రతి అణువూ ఆనందంతో పులకరించిపోయింది.

నా యిద్దరి కూతుళ్ళనూ చూసుకుంటూనే నా కష్టాలన్నీ మరచిపోయాను. బేబీ తర్వాత ఒక మగపిల్లవాడు పుట్టాడు. వాడికి జబ్బు చేసింది. ఒకరోజున నా కేదో కలవచ్చింది. అంచేత పూజచేసుకునే గదిలోకివెళ్ళి దేవుడిముందు "నందా" దీపంవెలిగించాను. ఎక్కడినుంచో ఒక చిన్న గాలివిసురు వచ్చింది. ఆ దీపం ఆరిపోయింది. నా కడుపు దేవినట్టయిపోయింది. ఆ గాలివిసురులోనే నా కేదో స్వరం వినిపించినట్టయింది. "ఈ ఇంట్లో నందాదీపం వెలిగించే అధికారం నీకులేదు" అన్నట్టు అనిపించింది. నా పిల్లాడు — (ఎక్కెక్కి ఏడుస్తుంది ఇందిరాదేవి)

నిజంగానే నాకా అధికారం ఎక్కడిది ? ఎంచేతంటే - నేనా కాపురంలోకి అడుగుపెట్టడానికి యింకోనిండు ప్రాణం ఆ ఇంట్లోంచి బయటకి వెళ్ళిపోవాల్సివచ్చింది. అప్పుడా ప్రాణి గర్భవతికూడా అని మొన్న, నువ్వు చెప్పినప్పుడు తెలిసింది. ఆ కల అప్పు డర్థమయింది నాకు. కాని - మా పెద్దమ్మాయి - గడచిన పదిహేను రోజులనుంచీ ఒకరి మొఖం ఒకరు చూచుకోడానికికూడా భీతి పడుతున్నాం, ఉష నిన్న నాయ్యం చేస్తోందని ఏ ముఖంపెట్టుకు ఊరడిస్తాను దాన్ని.

ఎవరి పుటకతో నా జన్మలోలేని ఆనందం అనుభవించానో దాని జీవితం యిప్పుడు సర్వనాశనం అవుతూంటే చూసి ఊరుకోవలసి వస్తోంది. పిల్లల్ని కనడం సులువయిన పనే ; కాని వాళ్ళని తీర్చిదిద్ది సుఖపెట్టటం చాలా కష్టమయిన పని.

మీ అమ్మగారు చనిపోయారని తెలిసినప్పుడు - చెప్పుకోడానికి సిగ్గుపడవలసిన మాటయిని — నాకు "అమ్మయ్యా" అనిపించింది. ఒక నిర్భాగ్యురాలి అయిన ప్రాణి, జీవితంలో తనకు జరిగిన అన్యాయానికీ, అవమానాలకీ బాధపడి మరణించినప్పుడు, యింక మనం సుఖంగా వుండవచ్చు ననుకోవడం ఎంత ఘోరం.

రేపు నీ పెళ్ళిఅయితే, నువ్వు నిరాఘాటంగా సుఖపడాలంటే నీ మనసులో ఏ కోరిక వుంటుందో తెలుసా ; మా శారదపోతే బాగుణ్ణని పిస్తూంటుంది. పరిస్థితులు ఏలాంటివయినప్పటికీ - మన సుఖంకోసం ఇంకొకరి చావు కోరటంకంటే అధఃపతనం వుంటుందా ; ఉషా ; నేను నీకేదోషం ఆపాదించటంలేదు. నిన్ను పెళ్ళిచేసుకోవాలనే వుద్దేశం మా అల్లుడికి పుట్టినప్పుడే శారద సంసారంలో శాంతి చచ్చిపోయింది. అంచేత ఆవిడ సంసారం నిలబెట్టమని నిన్ను బిచ్చమడగడానికి రాలేదు, నేనిక్కడకి. నా మనసులోవున్న కష్టాలు చెప్పుకోడానికి, నా విషయంగా నీకున్న అభిప్రాయాన్ని మార్చటానికి వచ్చాను. మా శారద సుఖపడగలుగుతే నా కానందమే. కానీ - అది యిప్పుడెవరి అధీనంలోనూ లేదు. కాని - చిన్నప్పటినుంచీ నువ్వు కరువు వాచిపోయిన నీ తల్లి ప్రేమతో ఆదరించటంమాత్రం నే చెయ్యగలిగినపని. నీకిష్టముంటే, నీ కవసరమయినప్పుడు నన్ను నీ తల్లికి బదులుగా చూసుకోమని చెపుదామని వచ్చాను. [ఇంతట్లో హఠాత్తుగా శంకరం లోపలికి వస్తాడు. ఇందిరాదేవి వుందని చూడనేలేదు.]

శంక : ఉషా ; పెళ్ళికన్నీ సిద్ధమయినాయి. కారు తీసుకొని వచ్చాను. [ఇందిరాదేవిని చూచి నిర్ఘాంతపోతాడు శంకరం]

ఇంది : నే వస్తానమ్మా ; (శంకరాన్ని చూసీ చూడనట్టు)

ఉష : అమ్మా ! మీ రుండండి. వెళ్ళవద్దు. నాకు మనసు మన సులో లేదు యివాళ.

ఇంది : ఉషా ! అనవసరంగా కలవరపడవద్దు. నీకు ఏది మంచి దని తోస్తే అదిచెయ్యి. నీ పుట్టిల్లు నీకు ఎప్పుడూ అందుబాటులోనే వుంది.

ఉష : అమ్మా ! మీరు ఇంట్లోకివెళ్ళి కూచోండి కాస్సేపు. మీతో చాలా మాట్లాడాలి నేను. (ఉష ఏడుస్తూ వుంటుంది)

ఇంది : లోపలకు వెళ్ళనా ! సరే ! నీ యిష్టం ! (ఇంట్లోకి వెళుతుంది)

శంక : ఉషా ! ఏమిటిది ? ఏడుస్తావేం ?

ఉష : (ఏడుపు ఆపుకోవటానికి ప్రయత్నిస్తుంది) ఏమీలేదు. అసలు పరిస్థితే అటువంటిది.

శంక : (ఇందిరను సూచిస్తూ) కాని - ఈ విషయాలన్నీ యీ యుద్ధం ఆరంభం అవకముందే ఆలోచించుకున్నాముగా ?

ఉష : కాని యుద్ధం ఆరంభమయ్యాక కొన్నికొన్ని పరిస్థితులు మారుతూ వుంటాయి. మన నిశ్చయాలను మార్చుకోవలసివస్తుంటుంది.

శంక : నాకీ అలంకారాలన్నీ అర్థంకావు. నువ్వు పెళ్ళిచేసు కుంటానని ఒప్పుకున్నావు. మనప్రేమ అంటే ఏం బూరుగు దూది పింజకాదు గాలేస్తే అలా కొట్టుకుపోవడానికీ, ఎవరెటూదితే అటు ఎగిరి పోవడానికీను.

ఉష : శంకరంగారూ ! నాకు మీమీద ప్రేమవుంది. అమిత మయిన ప్రేమవుంది. కాని యివాళ నా మనసు మనసులో లేదు. పెళ్ళి యివాళే కావాలని బలవంతపెట్టకండి నన్ను.

శంక : ఉషా ! మోటారు తెచ్చి క్రింద నిలబెట్టి వచ్చాను. నువ్వింక అలస్యం చెయ్యకు. నువ్వు క్రిందకు దిగుముందు.

ఉష : ఇవాళ నేను రాను.

శంక : రావూ ! నీకేమయినా పిచ్చిగిచ్చి పట్టిందా ఏమిటి ?

ఉష : పోనీ అలాగే అనుకోండి మీరు కావలిస్తే !

శంక : ఉషా ! నీకు ధైర్యం తగ్గింది. ఇన్నాళ్ళూ నేను ధైర్యం చేయలేకపోయాను. కానీ. నీ మనోదార్ఢ్యం చూసుకొని నేను ఒక నిశ్చయానికి వచ్చేటప్పటికి నువ్వు భయపడుతున్నావు.

ఉష : నిజమే ! నాకు ఏదో అంతా గజిబిజిగావుంది.

శంక : ఇంతవరకూ వచ్చినతరువాత యింకా గజిబిజి ఏమిటి ? ఇప్పుడు ఈ పెళ్ళి వాయిదావేస్తే నా పరిస్థితి అన్యాయం అయిపోతుంది. అసలే అందరూ శారదని అన్యాయం చేశానని అంటూనే వున్నారు. దానికితోడు యిప్పుడు ఈ పెళ్ళి జరగకపోతే, నీలాంటి అమాయకురాల్ని మోసపుచ్చాననికూడా అంటారు. నేనటువంటి పేరు తెచ్చుకోను. పైగా చైతన్యదేవ్ నిన్న గట్టిగా చెప్పారు. తక్షణం పెళ్ళిచేసుకోకపోతే యింక ఉషని చుట్టానికి వీల్లేదని.

ఉష : మీరు లక్షచెప్పినా యివాళ మట్టుకు నేను రాలేను. మీరు నిజంగా నన్ను ప్రేమిస్తూవుంటే - నాకు కొంచం గడువు యివ్వండి.

శంక : ఒకరోజు చాలా ?

ఉష : చాలు. కాని - నన్నొక్కతినీ వుండనియ్యండి.

శంక : ఉషా ! నీకేమయిందో అర్థంకావటంలేదు. నీ యీ దీన స్థితిని నేను చూడలేను. అయినా ఈరోజు ఎలాగో దూరంగా గడుపుతాను. కాని రేపుమాత్రం ఈ పెళ్ళి తప్పదు. (వెళ్తాడు)

ఉష : (అతని వెనకే పరుగెత్తి) డాక్టర్ !

శంక : ఏమిటి ?

ఉష : ఏంలేదు - వెళ్ళండి (శంకరం వెళ్తాడు. నిశ్చలదృష్టితో అటువేపేచూచి) పాపం ! నీ నిరాశ రేపటివరకూ వాయిదా వేశాను— కాని—నా సౌఖ్యం ? —(ఏడుస్తూ క్రింద కూలబడి పోతుంది. ఉష ఏడ్పు విని ఇందిర వస్తుంది)

ఇంది : ఏమిటమ్మా యిది ? శంకరం ఏడి ?

ఉష : ఆయన్ని వెనక్కి పంపించేశాను.

ఇంది : అంటే ?

ఉష : ఒకళ్ళు ఏడుస్తుంటే ఇంకొకళ్లు సుఖపడటం అసంభవం. అటువంటి సుఖం నాకక్కరలేదు. ఆ సుఖం నా కక్కరలేదు.

ఇంది : (ఆవిడ పుద్దేశం అర్థంచేసుకొని) ఉషా ! నీ సౌఖ్యం సర్వస్వం త్యాగం చేశావా ? [ఉష ఊరికే తలూపి ఔనంటుంది. ఇంది రకి మాట రావడమే కష్టమయిపోతుంది.]

ఇంది : ఎంత గొప్పదానివమ్మా !

ఉష : నేనా ! గొప్పదాన్ని ? నన్ను ఈ అధఃపతనంనుంచి కాపాడిన దేవతవు నువ్వు. నా మాతృదేవతవు. (అంటూ ఉష ఇందిరా దేవిని కౌగలించుకుంటుంది.)

OCT

RNGA 101 B/B4

ఫిలిం డైరెక్టరు
శ్రీ ఎన్. జగన్నాథ్

అనువదించిన అపూర్వమైన మరాఠీ స్టేజి డ్రామాలు

పుస్తకం చదివే పాఠకులను, నాటకం చూచే ప్రేక్షకులను

తన్మయులను చేసే అమోఘమైన నాటకాలు.

1. జైభవానీ (మామా వరేర్కర్) 3/-
2. స్వాతీజీ (పి. ఎల్. దేశపాండే) 3/-
3. వేరుపడి తీరాలి (బాలకోల్హాట్కర్) 3/-
4. డబ్బో డబ్బు (మహాదేవనారాయణజోషి) 3/-

రూ. 10/- లు M. O. చేస్తే పై 4 నాటకాలు రిజిస్టరు పోస్టులో పంపిస్తాము. పోస్టేజికూడా ఉచితం.

	సాదాప్రతి	మేలుప్రతి
5. అక్కరతీరాక....(విజయ తేండూల్కర్)	2/-	3/-
6. ఏమో గుర్రం ఎగరావచ్చు ,,	2-/	3/-
7. అదీ ఒకజూచం! అంతే!! (శ్రీమతి ముక్తాబాయిదీక్షిత్, ఎం.ఏ.,బి.టి.,)	2/-	3/-
8. పతంగం (గోపాలటూకళ్కర్)	2/-	3/-
9. లోకం ఏమంటుంది? (ప్రహ్లాద కేశవ ఆత్రే)	2/-	3/-
10. మనస్సాక్షి (ఎన్. జగన్నాథ్)	3/-	4/-

ప్రతినాటకానికి పోస్టేజి రు. 0-50 అదనం. పై 6 నాటకాలకు ఒకేసారి ఆర్డరిస్తే పోస్టేజి ఉచితం. అడ్వాన్సు లేనిదే వి. పి. లేదు.

ప్రేమచంద్ పబ్లికేషన్స్, విజయవాడ.

మువసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	RNGA101B134
పుస్తకం పేరు	అదీ ఒక జాదం అంతే
తారీఖు	19 April 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	93
ఏర్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	No
లేవి పేజీలు	No
తయారు చేసినది	Jayalakshmi.
పేజీలు విడదీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	Bhanu
పరీక్ష చేసినది	THASIN
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good.